www.bharathasakthi.com

# భారత శక్తి

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 21 | సంచిక : 43 | హైదరాబాద్ | శుక్రవారం,జూలై 17 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00


## పూరీ జగన్నాథుడి రథయాత్రలో అపశ్రుతి... ఒకరి మృతి



ఒడిశాలోని పూరీలో గురువారం జరిగిన జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. భారీగా తరలివచ్చిన భక్తుల రద్దీ కారణంగా ఏర్పడిన తొక్కిసలాట లాంటి పరిస్థితుల్లో ఊపిరాడక ఒకరు మరణించినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, పూరీలోని మారిచికుండ్ కూడలి వద్ద ఈ దుర్ఘటన జరిగింది. భక్తులను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన తాళ్ల బారికేడ్ కూలిపోవడం లేదా కొందరు భక్తులు పట్టుతప్పి కింద పడిపోవడంతో ఒకరిపై ఒకరు పడిపోయారు. సుమారు 40 నుంచి 50 మంది ఒకేచోట పడిపోవడంతో పలువురు గాయపడ్డారు.

2లో..

## సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటు

**- హెచ్ఎంఎస్ - తెలంగాణ రక్షణ సేన గాంధేయమార్గంలో పోరాడి సాధించిన సంయుక్త విజయం**



**హైదరాబాద్ (భారత శక్తి)** మెడికల్ బోర్డు ఏర్పాటు చేయకుండా నెలల తరబడి కాలయాపన చేసిన అప్రజాస్వామిక కాంగ్రెస్ ప్రభుత్వం.. నిరంకుశ సింగరేణి యాజమాన్యం మా ఉద్యమానికి దిగివచ్చిందని

2లో..

## సి.బి.ఐ.టి కళాశాలలో దారుణం



**- దళిత ఉద్యోగిపై వేధింపులు:**
**- ప్రిన్సిపాల్, యాజమాన్యంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు.**
**- అధ్యాపకులను కించపరిస్తే ఊరుకునేది లేదు'**
**- టీ.ఎస్.టీసీ.ఏ అధ్యక్షులు ఐనేని సంతోష్ కుమార్ హెచ్చరిక.**

**హైదరాబాద్: జూలై 16 భారత శక్తి** రాష్ట్రంలోని ప్రముఖ ప్రైవేటు సాంకేతిక విద్యాసంస్థ చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (CBIT) లో దళిత ఉద్యోగిపై జరిగిన కుల వివక్ష, మానసిక వేధింపుల ఉదంతం తీవ్ర కలకలం రేపుతోంది. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.వి. నరసింహులు (మొదటి నిందితుడు - A1), యాజమాన్య ప్రతినిధి ఎన్. సుభాష్ రెడ్డి (రెండవ నిందితుడు - A2) పై నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు భారతీయ న్యాయ సంహిత (BNS) కింద కేసు నమోదైంది. ఈ ఘటనపై తెలంగాణ సాంకేతిక కళాశాలల అధ్యాపకుల సంఘం (TSTCA) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

### అధ్యాపకులను కించపరిస్తే సహించేది లేదు: ఐనేని.సంతోష్ కుమార్

విద్యాసంస్థల్లో పనిచేసే అధ్యాపక, సాంకేతిక సిబ్బందిని కించపరిచేలా వ్యవహరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని తెలంగాణ

2లో..



## పార్లమెంట్ సమావేశాలకు రంగం సిద్ధం

**- కీలక బిల్లులతో కేంద్రం అజెండా**



**న్యూఢిల్లీ (భారత శక్తి)** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న బిజినెస్ లిస్ట్‌ను సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ గురువారం విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం 5 కొత్త బిల్లులను ప్రవేశపెట్టనుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కి పెంచేందుకు చట్ట సవరణ చేయనుంది. గ్లోబల్ మార్కెట్

2లో..

## రాష్ట్రంలో రోడ్డు భద్రతకు కొత్త బ్యూరో ఏర్పాటు

**- డిజిపి ఆనంద్ సివి ఆనంద్**



**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో' ఏర్పాటుకు పోలీస్ శాఖ చర్యలు చేపట్టింది. బ్యూరో ఏర్పాటు, విధులు, సిబ్బంది, చేపట్టాల్సిన చర్యలపై అధికారులు దృష్టి సారించారు.

2లో..

## హోర్ముజ్ జలసంధిలో రణరంగం

**- అమెరికా-ఇరాన్ మధ్య భీకర దాడులు.. ట్రంప్ 'విధ్వంసకర' హెచ్చరికతో ప్రపంచం విలవిల!**
**- హోర్ముజ్ పై పట్టు కోసం అమెరికా-ఇరాన్ మధ్య భీకర దాడులు**
**- ఇరాన్ విద్యుత్ ప్లాంట్లు, ఇంధన వనరులే లక్ష్యంగా దాడులు**
**- ఇరాన్ ను పూర్తిగా ధ్వంసం చేస్తామని డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరిక**
**- రణరంగంతో స్తంభించిన ప్రపంచ చమురు రవాణా**
**- అంతర్జాతీయ మార్కెట్లో భారీగా పెరిగిన ముడిచమురు ధరలు.**


**వాషింగ్టన్/టెహ్రాన్, జూలై 16:** పశ్చిమాసియా (మిడిల్ ఈస్ట్) మరోసారి భీకర యుద్ధ జ్వాలల్లో చిక్కుకుంది. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి (స్ట్రెయిట్ అఫ్ హోర్ముజ్ ) పై పట్టు కోసం అమెరికా, ఇరాన్ దేశాల మధ్య గత రెండు రోజులుగా జరుగుతున్న ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. ట్రాఫిక్ నియంత్రణ పేరుతో ఈ జలసంధిని తమ ఆధీనంలోకి తీసుకుంటామని, తామే దానికి 'రక్షకుడు' (గార్డియన్ )

2లో..




## న్యూజిలాండ్‌లో 6.3 తీవ్రతతో భూకంపం..

**- సునామీ హెచ్చరికలు జారీ..**



వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌లో మరోసారి భూప్రకంపనలు భయాందోళనలు రేకెత్తించాయి. దక్షిణ ద్వీపంలోని టె అనౌ పట్టణ సమీపంలో 6.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీంతో అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. టె అనౌకు ఉత్తరాన సుమారు 40 కిలోమీటర్ల(24.85 మైళ్ల) దూరంలో భూకంప కేంద్రం ఉందని న్యూజిలాండ్ జాతీయ అత్యవసర నిర్వహణ సంస్థ తెలిపింది.యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే (USGS), జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ మాత్రం దీని తీవ్రతను 5.9గా వెల్లడించాయి.

2లో..

## గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు

**ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు**



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల జాతర హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ లంగర్ హౌస్ చౌరస్తా వద్ద శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ వేడుకతో రాష్ట్రవ్యాప్తంగా నెలరోజుల పాటు జరిగే బోనాల పండుగకు అంకురార్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, నాయకులు మధు యాష్కీ గౌడ్, మెట్టు సాయి కుమార్, నూతి శ్రీకాంత్ గౌడ్, కల్వ సుజాతతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

2లో..

## మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించాలి: మంత్రి సీతక్క



**ములుగు జిల్లా ప్రతినిధి, జూలై 16 (భారత శక్తి):** గ్రామీణ మహిళలు తేనెటీగల పెంపకాన్ని లాభదాయక జీవనోపాధిగా మలచుకోవాలని

## పవన్ కళ్యాణ్‌ని పరామర్శించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్



**అమరావతి (భారత శక్తి)** కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పరామర్శించారు. గవర్నర్ గురువారం ఉదయం హైదరాబాద్‌లోని పవన్ కళ్యాణ్ నివాసానికి విచ్చేశారు. ఆయనతో మాట్లాడి శస్త్ర చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య నిపుణుల సూచనలు పాటించాలని చెప్పారు. త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో విధుల్లోకి రావాలని ఆకాంక్షించారు.

2లో..

## సక్సెస్ స్కూల్‌లో 'కల్మా' కలకలం

**- కాంగ్రెస్ పై రాంచందర్ రావు ఫైర్**



**హైదరాబాద్ (భారత శక్తి)** పాతబస్తీ పరిధిలోని సైదాబాద్‌లో ఉన్న ఒక ప్రైవేట్ పాఠశాలలో చోటుచేసుకున్న సంఘటన ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. అక్కడి 'సక్సెస్ స్కూల్'లో రెండో తరగతి చదువుతున్న ఒక హిందూ విద్యార్థికి... ఇస్లామిక్ పవిత్ర సూక్తులైన 'కల్మా', 'సూరహ్ అల్-ఫాతిహా' చదివి, నేర్చుకు రావాలంటూ ఉపాధ్యాయురాలు హోంవర్క్ ఇవ్వడం, స్కూల్ డైరీలో లిఖితపూర్వకంగా రాయడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బాలుడు స్కూల్ నుండి ఇంటికి వచ్చిన తర్వాత డైరీని గమనించిన తల్లిదండ్రులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. చిన్న వయసులోనే విద్యార్థులపై ఇలాంటి మతపరమైన అంశాలను రుద్దడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తూ

2లో..

## సీతమ్మసాగర్ - సీతారామ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేస్తాం

**- ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను పుష్కలంగా అందిస్తాం. - గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిచేస్తున్నాం.**
**- ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**భద్రాద్రి జిల్లా బ్యూరో/ మణుగూరు జూలై 16 (భారతశక్తి):** జిల్లాలోని అశ్వాపురం మండలంలో గల సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారం, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టు వ్యూ పాయింట్ నుంచి నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం నీటిపారుదల శాఖ అధికారులు మ్యాప్‌లు, సాంకేతిక నమూనాల ద్వారా బ్యారేజ్, పంప్‌హౌస్‌లు, కాలువలు, విద్యుత్ అనుసంధానం, పంపింగ్ వ్యవస్థ, ఆయకట్టు, ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలిన పనులు, అవసరమైన నిధులు తదితర అంశాలను మంత్రులకు వివరించారు.

**గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గోదావరి నదిలో ప్రవహిస్తున్న నీటిని సాధ్యమైనంత మేర పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో గ్రావిటీ ద్వారా, అవసరమైన చోట లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని తరలించేలా ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిపారు. జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో రాజీవ్ సాగర్ ప్రాజెక్టు రూ. 1,640 కోట్లతో రెండు లక్షల ఎకరాలకు, ఇందిరా సాగర్ ప్రాజెక్టు రూ. 1,680 కోట్లతో

2లో..






# సి.బి.ఐ.టి కళాశాలలో దారుణం

సాంకేతిక కళాశాలల అధ్యాపకుల సంఘం (TSTCA) రాష్ట్ర అధ్యక్షులు ఐనేని సంతోష్ కుమార్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. సమాజానికి దిశానిర్దేశం చేయాల్సిన విద్యాసంస్థల్లో ఇలాంటి కుల వివక్ష, వేధింపుల ధోరణి అత్యంత విచారకరమన్నారు.బాధితుడైన సంజీవ్‌కు సంఘం పూర్తి మద్దతు ప్రకటిస్తోందని, నిందితులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకునేలా ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. ప్రైవేటు యాజమాన్యాలు తమ పరిధి దాటి ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

### బాధితుడి ఫిర్యాదు - ప్రథమ సమాచార నివేదిక (FIR) వివరాలు

కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ECE) విభాగంలో ప్రయోగశాల సహాయకుడిగా (Lab Assistant) పనిచేస్తున్న బి. సంజీవ్ అనే సాంకేతిక ఉద్యోగి ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. నార్సింగి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ సంఖ్య 1323/2026 కింద నమోదైన ఈ కేసులో నిందితులపై క్రింది సెక్షన్లను ప్రయోగించారు:సెక్షన్ 3(1)(r), 3(1)(S): ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) సవరణ చట్టం-2015 (బహిరంగ ప్రదేశంలో కులం పేరుతో దూషించడం, అవమానపరిచేలా ప్రవర్తించడం). సెక్షన్ 352, సెక్షన్ 351(2): భారతీయ న్యాయ సంహిత - దీఛీా (శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉద్దేశపూర్వకంగా అవమానించడం, నేరపూరిత బెదిరింపులకు పాల్పడటం).

### కళాశాల ప్రాంగణంలో సుదీర్ఘ వేధింపులు.. కుల వివక్ష

గత కొంతకాలంగా విధుల్లో భాగంగా తనను మానసికంగా వేధిస్తూ, తోటి సిబ్బంది ముందే కులం పేరుతో దూషిస్తున్నట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉన్నతాధికారుల హోదాలో ఉండి, బాధ్యతాయుతమైన విద్యాసంస్థను నడపాల్సిన వారే ఈ తరహా వివక్షకు పాల్పడటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యాసంస్థల్లో మేధో వలసలు, పరిశోధనలపై దృష్టి పెట్టాల్సిన యాజమాన్యం, ఉద్యోగుల పట్ల కక్షసాధింపు ధోరణి అవలంబించడంపై సామాజిక సంఘాలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

### సమగ్ర విచారణ, ఉద్యోగ భద్రతకు డిమాండ్

ఈ ఉదంతంపై పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమగ్ర, నిష్పాక్షిక విచారణ జరపాలని, బాధితుడికి తక్షణ న్యాయం చేకూర్చాలని టీఎస్‌టీసీఏ సహా పలు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.ఈ వివాదం నేపథ్యంలో ప్రైవేటు సాంకేతిక విద్యాసంస్థల్లో పనిచేస్తున్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది హక్కుల అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. తెలంగాణ విద్యా చట్టం - 1982 (Telangana Education Act, 1982) నిబంధనల ప్రకారం ప్రైవేటు కాలేజీల్లో పనిచేసే సిబ్బందికి పూర్తి స్థాయి ఉద్యోగ భద్రత, వేధింపుల నిరోధక రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని విద్యా రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ప్రస్తుతం నార్సింగి పోలీసులు ఈ కేసును సహాయ పోలీస్ కమిషనర్ (ACP) స్థాయి పర్యవేక్షణలో అత్యంత ప్రతిష్టాత్మకంగా విచారణ జరుపుతున్నారు.

# సీతమ్మసాగర్ - సీతారామ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేస్తాం

మరో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రారంభించబడినట్లు తెలిపారు. మొత్తం సుమారు రూ.3,500 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రణాళిక రూపొందించబడిందన్నారు. రాష్ట్ర విభజనకు ముందు ఈ రెండు ప్రాజెక్టులపై సుమారు రూ.2,000 కోట్ల వరకు వ్యయం జరిగిందని, మిగిలిన పనులకు సుమారు రూ.1,505 కోట్లు అవసరమయ్యే పరిస్థితి ఉండేదన్నారు. అనంతర కాలంలో ప్రాజెక్టు పునఃరూపకల్పనతో అంచనా వ్యయం సుమారు రూ.24 వేల కోట్లకు పెరిగిందని, ఇప్పటికే రూ.7,500--8,000 కోట్ల వరకు వ్యయం జరిగినట్లు వివరించారు. ప్రస్తుతం భారీ ప్రజాధనం ఇప్పటికే వ్యయమైనందున మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీతమ్మసాగర్, సీతారామ, దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థలను సమన్వయం చేసి గోదావరి జలాలను గరిష్టంగా వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి నెలా పనుల పురోగతిని సమీక్షిస్తూ అవసరమైన నిధులు విడుదల చేసి ప్రాజెక్టును నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు .

### సీతారామ ప్రాజెక్టును నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తాం : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అత్యంత కీలకమైన సాగునీటి ప్రాజెక్టు అని అన్నారు . ఇప్పటికే ప్రాజెక్టుపై గణనీయమైన ప్రజాధనం వ్యయమైనందున మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఇరిగేషన్ రంగంపై గతంలో సుమారు రూ.1.81 లక్షల కోట్లకు పైగా వ్యయం జరిగినప్పటికీ అనేక ప్రాజెక్టులు ఇంకా వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టుపై సుమారు రూ.27,500 కోట్లు వ్యయం జరిగినట్లు తెలిపారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను దశలవారీగా పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలకు సంబంధించి జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్.డి.ఎస్. ఏ), కేంద్ర జల సంఘం (సిడబ్ల్యూసి) సూచనల మేరకు సాంకేతిక పరీక్షలు, భూగర్భ పరిశీలనలు, నిర్మాణ భద్రతా అధ్యయనాలు కొనసాగుతున్నాయని తెలిపారు. నిపుణుల నివేదికల ఆధారంగా అవసరమైన పునరుద్ధరణ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు . ప్రజల భద్రత, నిర్మాణ నాణ్యత, నీటి నిల్వ సామర్థ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని నిర్ణయాలు శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగానే తీసుకుంటున్నామని వివరించారు. సీతారామ ప్రాజెక్టులోని పంప్‌హౌస్‌లు, బ్యారేజ్, కాలువలు, విద్యుత్ అనుసంధానం, పంపింగ్ వ్యవస్థల నిర్మాణాన్ని వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. గత రెండున్నర సంవత్సరాలలో రికార్డు స్థాయిలో వరి ధాన్యం పండించి రైతుల ఖాతాల్లో రూ.80 వేల కోట్లకు పైగా రైతులకు నేరుగా జమ చేసినట్లు తెలిపారు . ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ రాష్ట్రం దేశంలో ముందంజలో నిలిచిందన్నారు. సీతమ్మసాగర్ -- సీతారామ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత సుమారు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ పై ఉన్న న్యాయపరమైన చిక్కులను పరిష్కరించుకొని త్వరితగతిన పనులు పూర్తి అయ్యేలా చూస్తామన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసి జిల్లా లో గోదావరి జలాలను వినియోగించే విధంగా అదేవిధంగా ఇల్లందు నియోజకవర్గంలో కూడా నీరు అందించే విధంగా చర్యలు చేపడతామన్నారు.

### ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి రైతులకు సాగునీరు అందిస్తాం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారం, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో ప్రారంభమైన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను ప్రత్యక్షంగా పరిశీలించి మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టుకు అవసరమైన ఎలక్ట్రికల్, మెకానికల్ తదితర పనుల కోసం సుమారు రూ.1,000 కోట్లకు పైగా నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలిసిపోకుండా పంపింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి నీటి వినియోగాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అవసరమైన అన్ని పనులను వేగవంతం చేస్తున్నామని, అవసరమైన చోట అదనపు నిధులు కూడా విడుదల చేస్తామని చెప్పారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని అన్నారు .

### జిల్లా కలెక్టర్ అంకిత్

ప్రాజెక్టు పనుల ప్రస్తుత పురోగతి, భూసేకరణ, పునరావాసం, విద్యుత్ అనుసంధానం, అనుబంధ మౌలిక సదుపాయాల కల్పన, శాఖల మధ్య సమన్వయంపై మంత్రులకు వివరించారు. ప్రాజెక్టు పనులకు అవసరమైన పరిపాలనా అనుమతులు, భూ సంబంధిత అంశాలను వేగవంతంగా పరిష్కరిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై జిల్లా స్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, శాఖల సమన్వయంతో పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరిస్తున్నట్లు వివరించారు. అనంతరం మంత్రులు మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముందుగా హైదరాబాద్ నుండి మణుగూరుకు హెలిఫ్యాడ్ ద్వారా గురువారం విచ్చేశారు. వారికి సగర్వంగా స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్ జిల్లా ఉన్నతాధికారులు పుష్ప గుచ్చాలు అందించి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుండి రోడ్డు మార్గం ద్వారా అశ్వాపురం మండలం సీతమ్మసాగర్ -- సీతారామ ప్రాజెక్టుల వ్యూ పాయింట్లను చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, వైరా శాసనసభ్యులు రామదాసు నాయక్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, నీటిపారుదల శాఖ అధికారులు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సంబంధిత శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ సమావేశాలకు రంగం సిద్ధం

ఒడిదుడుకుల నేపథ్యంలో ఆదాయపు పన్ను చట్టంలో కీలక సవరణలు చేపట్టనుంది. విదేశీ విరాళాల నియంత్రణ (ఖీజ=ూా) సవరణ బిల్లుపై ఈ సమావేశాల్లో చర్చించి.. ఆమోదం తెలపనుంది. ఉభయ సభల సంయుక్త కమిటీ పరిశీలనలో ఉన్న 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు'పై తుది నిర్ణయం తీసుకోనుంది. జనన, మరణాల ఆలస్యం రిజిస్ట్రేషన్ల నిబంధనలను మరింత కఠినతరం చేయనుంది. జాతీయ గౌరవానికి భంగం కలిగించడాన్ని నిరోధించే చట్టానికి మరికొన్ని సవరణలు చేయనుంది. మీావీజు రంగంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఆలస్యపు చెల్లింపుల పరిష్కారం కోసం సరికొత్త బిల్లులను ఈ సమావేశాల్లో తీసుకురానుంది.రాష్ట్రాలు సొంతంగా మీావీజు ఫెసిలిటేషన్ కౌన్సిళ్లను ఏర్పాటు చేసుకునేలా చట్ట సవరణ చేయనుంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అదనపు నిధుల వ్యయంపై లోక్‌సభలో ఓటింగ్ నిర్వహించనుంది. ఆగస్ట్ 13వ తేదీతో ఈ వర్షాకాల సమావేశాలు ముగుస్తాయి.

## సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటు

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించారు. ఎట్టకేలకు ఈనెల 17, 18 న మెడికల్ బోర్డు ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నది.. ఇది వేలాది మంది సింగరేణి కార్మికుల గెలుపు. వారసత్వ ఉద్యోగాలు సింగరేణి కార్మికుల హక్కు. వేలాది మంది కార్మికులు అనారోగ్య సమస్యలతో మెడికల్ అన్ ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నెలల తరబడి మెడికల్ బోర్డు ఏర్పాటు చేయకుండా వారి మనోవేదనకు కారణమవుతోంది. మేము ఉద్యమించామని ఇప్పుడు మాత్రమే మెడికల్ బోర్డు ఏర్పాటు చేయడం కాదు.. ప్రతి నెలా మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలి. సింగరేణి కార్మికులు ఎవరిని సూచిస్తే వారికి వారసత్వ ఉద్యోగం ఇవ్వాలి.. మెడికల్ బోర్డు కు దరఖాస్తు చేసుకున్న కార్మికులందరినీ అన్ ఫిట్ చేయాలని ఆమె అన్నారు.

## రాష్ట్రంలో రోడ్డు భద్రతకు కొత్త బ్యూరో ఏర్పాటు

దీనికి సంబంధించిన చట్టపరమైన అంశాలు, పరిపాలనా విధానాలపై ప్రణాళికలు రూపొందిస్తున్నారు. డీజీపీ సీవీ ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రస్తుత ట్రాఫిక్ పరిస్థితులు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ఇతర రాష్ట్రాల విధానాలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, కేంద్ర ప్రభుత్వ నిబంధనలపై చర్చించారు.

## మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించాలి: మంత్రి సీతక్క

మంత్రి చెప్పారు. చిన్న సీసాల్లో ఆకర్షణీయ ప్యాకేజింగ్, నాణ్యమైన బ్రాండింగ్‌తో విక్రయించాలని సూచించారు. ములుగు జిల్లాకు కేటాయించిన 'మా శక్తి' బ్రాండ్‌తో ఆదివాసి తేనె, అడవి తేనె, సమ్మక్క--సారక్క తేనె పేర్లతో మార్కెటింగ్ చేయాలన్నారు. దీనివల్ల అటవీ తేనెకు ప్రత్యేక గుర్తింపు వస్తుందని వివరించారు.ప్రారంభంలో శ్రమ ఉన్నా క్రమంగా ఇది స్థిర ఆదాయ వనరు అవుతుందని అన్నారు. మోదుగాకు, ఇప్పాకులతో విస్తారాకుల తయారీకి కూడా మంచి మార్కెట్ ఉందని తెలిపారు.మహిళా సంఘాలకు వడ్డీలేని రుణ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కొండపర్తిలో ఇప్పపువ్వు లడ్డూలతో మహిళలు లక్షల ఆదాయం సాధిస్తున్నారని ఉదాహరణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్పీ సుధీర్ కేకన్, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, సెర్ప్ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, జిల్లా అటవీ శాఖ అధికారి, అదనపు కలెక్టర్ ఎం. సంపత్‌రావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కళ్యాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, ప్రజాప్రతినిధులు, సెర్ప్ అధికారులు, హంబుల్ బీ సంస్థ ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్‌ని పరామర్శించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

పవన్ కళ్యాణ్ లైబ్రరీ తిలకించిన జస్టిస్ అబ్దుల్ నజీర్ పవన్ కళ్యాణ్ స్వగృహంలో ఉన్న లైబ్రరీని గౌరవ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ తిలకించారు. లైబ్రరీలోని పలు పుస్తకాలను పరిశీలించారు. ప్రఖ్యాత రచయితలు, స్కాలర్స్, విశ్లేషకులు, పబ్లిక్ పాలసీ మేకర్స్ రాసిన పుస్తకాలు పరిశీలించారు. వాటి గురించి పవన్ కళ్యాణ్ తో ఆసక్తిగా చర్చించారు. పవన్ కళ్యాణ్ కోరడంతో ఓ పుస్తకంపై జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆటోగ్రాఫ్ చేశారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ గారు ఎంతో ఆప్యాయతతో వచ్చి పరామర్శించినందుకు పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## సక్సెస్ స్కూల్‌లో 'కల్మా' కలకలం

బంధువులు, స్థానికులతో కలిసి నేరుగా స్కూల్‌కు వెళ్లి యాజమాన్యాన్ని సూటిగా నిలదీశారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. బాధితులు వెంటనే సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం వెలుగులోకి రాగానే అలర్ట్ అయిన సక్సెస్ స్కూల్ యాజమాన్యం.. ఇది సదరు టీచర్ వ్యక్తిగతంగా చేసిన పొరపాటుగా భావిస్తున్నామని పేర్కొంది. ఈ వివాదానికి కారణమైన ఉపాధ్యాయురాలు షేక్ ఆయిషా పర్వీన్‌ను తక్షణమే విధుల్లో నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించింది.

భవిష్యత్తులో తమ విద్యాసంస్థల్లో ఆమెకు ఎలాంటి అవకాశం ఇవ్వబోమని, పాఠశాలలో ఇలాంటి మతపరమైన బోధనలకు తావు లేదని స్పష్టం చేసింది. ఈ ఉదంతంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అత్యంత తీవ్రంగా స్పందించారు. 'కాంగ్రెస్ అంటే ముస్లింలు' అనే ప్రకటనల వల్లే ఇలాంటి శక్తులకు ప్రోత్సాహం లభిస్తోందని మండిపడ్డారు.

స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ... చిన్నారిపై మతపరమైన ఒత్తిడి తీసుకురావడం ఘోరమని, జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## హోర్ముజ్ జలసంధిలో రణరంగం

అవుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అయితే ఇరాన్ దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ అంతర్జాతీయ వాణిజ్య నౌకలపై దాడులు చేయడంతో పాటు, జలసంధిని పూర్తిగా మూసివేస్తున్నట్లు ప్రకటించింది. దీనిపై ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో ట్రంప్ అత్యంత దూకుడుగా స్పందిస్తూ, వచ్చే వారం ఇరాన్‌కు రోజులు చాలా దారుణంగా ఉండబోతున్నాయని హెచ్చరించారు. వారు వెంటనే చర్చల టేబుల్ ముందుకు రాకపోతే ఇరాన్‌లోని అన్ని విద్యుత్ ప్లాంట్లు, వంతెనలను బాంబులతో పేల్చి పూర్తిగా ధ్వంసం చేస్తామని, చివరగా వారి ఇంధన వనరులపై కూడా దాడులు చేస్తామని నేరుగా అత్యంత 'విధ్వంసకర' అల్టిమేటం ఇచ్చారు. మరోవైపు అమెరికా వైమానిక దళాలు ఇరాన్ ఓడరేవులు, తీరప్రాంతాలపై పూర్తి నౌకాదళ దిగ్బంధనాన్ని (నవల బ్లాకడే ) విధించాయి. ఇరాన్ దళాలు ఏడు వాణిజ్య నౌకలపై దాడులు చేసి, 11 మంది సిబ్బంది మరణానికి కారణమవ్వడంతో అమెరికా సైన్యం (సెంటకామ్ ) ఈ చర్యకు పూనుకుంది. బుధవారం ఉదయం అమెరికా దళాలు ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, క్రూయిజ్ క్షిపణి నిల్వ కేంద్రాలు, కోస్టల్ రాడార్ సైట్లు మరియు గ్రేటర్ తుంబ్, క్విష్మ్ ద్వీపాల్లోని ఐఆర్‌జీసీ (IRGC) స్థావరాలపై సుమారు 90 నిమిషాల పాటు ఎడతెరిపి లేకుండా క్షిపణి దాడులు చేశాయి. ఈ దాడుల్లో కనీసం ఏడుగురు ఇరాన్ సైనిక సిబ్బంది మరణించినట్లు టెహ్రాన్ ధృవీకరించింది. ఈ అమెరికా దాడులకు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (IRGC) అంతే కసితో, దీటుగా బదులిచ్చింది. అమెరికా బలగాలకు రక్షణ కల్పిస్తున్న పొరుగు దేశాలపై ఇరాన్ విరుచుకుపడింది. బహ్రెయిన్ రాజధానిలోని అమెరికా నౌకాదళ మద్దతు స్థావరం, కువైట్, జోర్డాన్‌లలోని యూఎస్ మిలిటరీ క్యాంపులపై ఇరాన్ వందలాది క్షిపణులు, ఆత్మాహుతి డ్రోన్లతో దాడికి తెగబడింది. ఈ క్రమంలో బహ్రెయిన్‌లో బాంబు పేలుళ్ల సైరన్లు మోగగా, జోర్డాన్, కువైట్ సైన్యాలు తమ గగనతలంలోకి వచ్చిన శత్రు క్షిపణులను అడ్డుకునేందుకు రంగంలోకి దిగాయి. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే చమురులో ఐదో వంతు కేవలం ఈ హోర్ముజ్ జలసంధి గుండానే వెళుతుంది. ఇరు దేశాల రణరంగంగా మారడంతో ఈ మార్గంలో ఓడల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అమెరికా తమపై ఈ దుర్మార్గాన్ని ఆపకపోతే, మిడిల్ ఈస్ట్ నుండి ప్రపంచంలోని ఏ దేశానికి కూడా ఒక్క చుక్క చమురు లేదా గ్యాస్ వెళ్లకుండా అడ్డుకుంటామని ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. ఈ పెను ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు (జతీబఆవ ూఱశ్రీ) ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. జూన్‌లో జరిగిన తాత్కాలిక శాంతి ఒప్పందం (వీశీఖ) ఈ తాజా దాడులతో పూర్తిగా కుప్పకూలిపోగా.. ట్రంప్ కఠిన వైఖరి, ఇరాన్ దూకుడు చూస్తుంటే ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే పెను ఆర్థిక యుద్ధంగా మారబోతోందని అంతర్జాతీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

## న్యూజిలాండ్‌లో 6.3 తీవ్రతతో భూకంపం..

అలాగే భూమికి 50 కిలోమీటర్లకు పైగా లోతులో భూకంపం సంభవించినట్లు నిర్ధారించాయి. కాగా, ఒక్కసారిగా భూమి కంపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. భవనాలు ఊగిపోవడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనలో ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు.మరోవైపు సునామీ హెచ్చరికల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ప్రజలను న్యూజిలాండ్ ప్రభుత్వం హెచ్చరించింది. ముఖ్యంగా తీర ప్రాంతాల ప్రజలు సురక్షితమైన ప్రదేశాలకు వెళ్లాలని సూచించింది. ఈ మేరకు అధికారులను కూడా అప్రమత్తం చేసింది.

## గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు

ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.తెలంగాణ జానపద సంప్రదాయాలకు అద్దం పట్టే ఈ పండుగలో భాగంగా, భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో 'బోనం' సమర్పించారు. అన్నం, బెల్లం, పెరుగుతో నింపిన కుండలను నైవేద్యంగా నివేదించి, అంటువ్యాధుల నుంచి రక్షించి, పాడిపంటలతో రాష్ట్రాన్ని చల్లగా చూడాలని వేడుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, భక్తిగీతాల ఆలాపనలతో గోల్కొండ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. చారిత్రాత్మక గోల్కొండ కోటలో మొదలైన ఈ ఉత్సవాల కోసం హైదరాబాద్ పోలీసులు పటిష్ఠమైన భద్రతను ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గోల్కొండ బోనాలతో అట్టహాసంగా ప్రారంభమైన ఈ జాతర, రాబోయే వారాల్లో సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయం సహా నగరంలోని ఇతర ప్రధాన ప్రాంతాల్లోనూ వైభవంగా కొనసాగనుంది.

## బెల్ట్ షాపులపై ఎల్బీనగర్ ఏసీపీ ఆకస్మిక దాడులు




ఎల్బీనగర్, జూలై 16 (భారత శక్తి): విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య స్వయంగా ఎన్‌టీఆర్ నగర్‌లోని బెల్ట్ షాపులపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపులను తనిఖీ చేసి, అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత నిర్వాహకులపై కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.అక్రమ మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, బెల్ట్ షాపులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పోలీసులు హెచ్చరించారు.

## జూలై 18న సరూర్‌నగర్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ "యువ సంగ్రామ సభ"ను విజయవంతం చేయాలి



ఎల్బీనగర్, జూలై 16 (భారత శక్తి): నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, జూలై 18న సరూర్‌నగర్ స్టేడియంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "యువ సంగ్రామ సభ" ఏర్పాట్లలో భాగంగా సభా వేదిక నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి శుభారంభం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, ముఠా గోపాల్, శంభీపూర్ రాజు, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు, మాజీ చైర్మన్లు మరియు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని సభా ప్రాంగణాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా సభకు సంబంధించిన వేదిక నిర్మాణం, పార్కింగ్ ఏర్పాట్లు, ప్రజల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను సమీక్షించి సంబంధిత కమిటీలకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న యువ సంగ్రామ సభను విజయవంతం చేసి, నిరుద్యోగ యువత గొంతుకను ప్రభుత్వానికి బలంగా వినిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పూరీ జగన్నాథుడి రథయాత్రలో అపశ్రుతి... ఒకరి మృతి

వారిలో నలుగురైదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వెంటనే స్పందించి సుమారు 20 మందిని రక్షించి అంబులెన్స్‌లలో ఆసుపత్రికి తరలించామని, చికిత్స పొందుతూ ఒక వృద్ధుడు మరణించినట్లు తెలిసిందని వారు పేర్కొన్నారు.భారీ జనసందోహం, కుండపోత వర్షం కారణంగా ఊపిరాడక, ఇతర గాయాలతో సుమారు 200 మంది భక్తులు పూరీలోని ఆసుపత్రులలో, తాత్కాలిక వైద్య శిబిరాల్లో చేరినట్లు సమాచారం. లక్షలాది మంది భక్తులు తరలిరావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అంతకుముందు, గురువారం ఉదయం షెడ్యూల్ కంటే ముందుగానే పహండీ బిజే క్రతువుతో రథయాత్ర ప్రారంభమైంది. అయితే, ఊరేగింపు పూర్తికావడానికి మాత్రం రెండు గంటలకు పైగా ఆలస్యమైంది.

## నల్లగొండ లక్ష్మీ నరసిహస్వామి ఆలయంలో కేంద్రమంత్రి బండి సంజయ్ పూజలు



**కొడిమ్యాల (భారత శక్తి)**కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని కేంద్ర మంత్రి బండి సంజమయ్ కుమార్ గురువారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. తరువాత వేదపండితులు ఆశీర్వచదించి స్వామివారి ప్రసాదం అందజేశారు. జాతర సందర్భంగా స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు కలుగుతున్న పలు ఇబ్బందుల గురించి వారు వివరించగా వాటర్ ప్లాంట్, టాయిలెట్స్ నిర్మాణంతో పాటు గుట్ట మీది దేవాలయం వద్ద లైటింగ్ ఏర్పాటు, ఘాట్ రోడ్డును అభివృద్ధి చేసే విషయంలో నా వంతు సాయం చేస్తానని వేదపండితులకు, అధికారులకు మంత్రి హామీ ఇచ్చారు.

# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN

## అమెరికా యూ టర్న్

రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500 శాతం సుంకాన్ని విధించాలనే ప్రతిపాదనలను అమెరికా కాస్త వెనక్కి తగ్గింది. ఇది భారత్, చైనాకు ఊరట కలిగించే అంశంగా విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికాలో ప్రవేశపెట్టిన రష్యా ఆంక్షల బిల్లును సవరించారు. ప్రతిపాదిత గరిష్ట సుంకాన్ని 500 శాతం నుంచి 100 శాతానికి తగ్గించింది. ఈ బిల్లు చట్టంగా మారితే, భారత్ వంటి ప్రధాన రష్యన్ చమురు దిగుమతిదారులకు మేలు జరగనుంది. ఇప్పటి వరకు ఎదుర్కొంటున్న ఆర్థిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలగవచ్చు. రిపబ్లికన్- డెమొక్రటిక్ చట్టసభ సభ్యులు మంగళవారం రష్యా ఆంక్షల బిల్లు సవరించిన ప్రతిని ప్రవేశపెట్టారు. ఈ కొత్త ముసాయిదా, రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై గరిష్టంగా 100 శాతం సుంకాన్ని విధించాలని ప్రతిపాదిస్తోంది. గతంలో, ఈ బిల్లు అటువంటి అన్ని దేశాలపై 500 శాతం సుంకాన్ని విధించాలని కోరింది. అగ్రరాజ్యం అమెరికాకు డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడు అయ్యాక భారత్‌కు మొదలైన కష్టాలు ఇంకా కొనసాగుతున్నాయి. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలతో భారత్ ఆర్థికంగా ఒడిదుడుకులు ఎదుర్కొటోంది. అమెరికా వెళ్లేవారు ఇబ్బంది పడుతన్నారు. ఇక ప్రతీకార సుంకాలు భారత వ్యాపార ఎగుమతులను దెబ్బతీస్తున్నాయి. ఇప్పటికే అనేక కారణాలతో దిగుబతులపై 25 శాతం నుంచి 50 శాతం వరకు సుంకాలు అమలు అవుతున్నాయి. తాజాగా రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని సాకుగా చూపి ట్రంప్ చట్ట సవరణ తీసుకురాబోతున్నారు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేసే దేశాలపై విధించాలనుకున్న సుంకాల గరిష్ట పరిమితిని 500 శాతం నుంచి 100 శాతానికి తగ్గించారు. ఈ బిల్లు రష్యా నాయకులు, ఆర్థిక సంస్థలు, ఇంధన సంబంధిత ప్రాజెక్టులను నేరుగా లక్ష్యంగా చేసుకుంటుంది.ఈ చట్టం (శాంక్షనింగ్ రష్యా యాక్ట్)ను ఇటీవల మరణించిన సెనేటర్ లిండ్సే గ్రాహమ్ ప్రతిపాదించారు. దీని ద్వారా అధ్యక్షుడికి రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాలపై అసాధారణ స్థాయిలో సుంకాలు విధించే అధికారం లభిస్తుంది. మొదట్లో దీనిని ఆర్థికంగా బలహీనపరిచే శక్తివంతమైన చర్యగా అభివర్ణించారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరగడంతో సుంకాల పరిమితిని 100 శాతానికి తగ్గించి సవరించారు. ఈ మార్పులకు ప్రభుత్వ, వ్యతిరేక పక్షాల నుంచి మద్దతు లభించింది.గ్రాహమ్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలు యుద్ధానికి పరోక్షంగా నిధులు సమకూరుస్తున్నాయని ఆరోపించారు. ఈ బిల్లు అమల్లోకి వస్తే ఆ దేశాలు రష్యా ఇంధనం కొనకుండా అడ్డుకుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. సవరించిన రూపంలో ఈ నిబంధనలు మిత్రరాజ్యాలకు అనుకూలంగా ఉన్నాయి. లక్ష్యంగా మారే దేశాల్లో చైనా, భారత్, స్లోవేకియా, హంగరీ, అజర్‌బైజాన్ ఉన్నాయి.రష్యా సహజ వాయువును దిగుమతి చేసుకునే ప్రధాన దేశాల్లో చైనా, ఫ్రాన్స్, జపాన్, హంగరీ, బెల్జియం ఉన్నాయి. రష్యా వాయువు ఎగుమతుల్లో 15 శాతం కంటే తక్కువ దిగుమతి చేసి, సరఫరాలను తగ్గించే చర్యలు తీసుకుంటున్న దేశాలకు ఈ బిల్లులో మినహాయింపులు ఇచ్చారు. ఇది జపాన్, ఫ్రాన్స్‌కు ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటుంది.మధ్యప్రాచ్యంలో సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిలో సరఫరాలో అంతరాయం కలగకుండా ఉండేందుకు అమెరికా రష్యా ఇంధనంపై మినహాయింపులు ఇచ్చింది. ప్రస్తుతం ఆ మినహాయింపులను తొలగించే యోచనలో ఉంది. ట్రంప్ పిచ్చి చేష్టలతో మళ్లీ చమురు సంక్షోభం నెలకొనే ప్రమాదం ఉంది.రష్యా నుంచి ముడి చమురును అత్యధికంగా కొనుగోలు చేసే దేశాల్లో భారత్, చైనా ఉన్నాయని అమెరికా భావిస్తోంది. సవరించిన బిల్లు ప్రకారం, రష్యా నుంచి అత్యధికంగా చమురు, సహజ వాయువును కొనుగోలు చేసే మొదటి ఐదు దేశాలకు మాత్రమే గరిష్ట సుంకాలు వర్తిస్తాయి. గతంలో, ఈ నిబంధన దిగుమతి చేసుకునే అన్ని దేశాలకు వర్తించేది.ఈ బిల్లును దివంగత రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం, డెమొక్రటిక్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంతల్ ప్రవేశపెట్టారు. సవరించిన ఈ బిల్లుకు రిపబ్లికన్,డెమొక్రటిక్ పార్టీల నుంచి కూడా మద్దతు లభిస్తోంది. సెనేట్ వర్గాల సమాచారం ప్రకారం, ప్రస్తుతం 26 మంది చట్టసభ్యులు ఈ బిల్లుకు సహ-ప్రాయోజకులుగా ఉన్నారు. ఇది కాంగ్రెస్‌లో ముందుకు సాగే కొద్దీ మరింత మద్దతు పొందే అవకాశం ఉంది.ఈ ప్రతిపాదన ప్రస్తుతం అమెరికా కాంగ్రెస్‌లో పరిశీలనలో ఉంది. కాంగ్రెస్ ఆమోదం, అధ్యక్షుడి అంగీకారం లభించిన తర్వాతే ఇది చట్టంగా మారుతుంది. అందువల్ల, భారత్ సహా ఇతర దేశాలు ఈ బిల్లు పురోగతిని నిశితంగా గమనిస్తున్నాయి.

# గాంధీ ఆసుపత్రి మందుల కొనుగోళ్ల దోపిడీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి.

**- రూ.7 కోట్ల ఔషధాలకు రూ.13 కోట్ల బిల్లులా పేదల ప్రాణాలతో చెలగాటమాడితే ఊరుకోం: ఏఐవైఎఫ్,**

హైదరాబాద్: జులై 16 భారత శక్తి, సికింద్రాబాద్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రిలో స్థానిక కొనుగోళ్ల (లోకల్ పర్చేస్) పేరుతో జరిగిన బహుళ కోట్ల రూపాయల మందుల కొనుగోళ్ల కుంభకోణంపై హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో తక్షణమే న్యాయ విచారణ జరిపించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

**అధికారుల అండతోనే రూ.6 కోట్ల దోపిడీ?**

గాంధీ ఆసుపత్రిలో రూ.7 కోట్ల విలువైన మందుల కొనుగోలుకు ఏకంగా రూ.13 కోట్ల బిల్లులు సృష్టించి ప్రభుత్వ ఖజానాను లూటీ చేశారనే ఆరోపణలు అత్యంత దిగ్భ్రాంతికరమని ఏఐవైఎఫ్ నేతలు పేర్కొన్నారు. పేదలకు ఉచితంగా వైద్యం అందించాల్సిన పవిత్ర దేవాలయాల లాంటి ప్రభుత్వ ఆసుపత్రులను కొందరు అవినీతి అధికారులు, ప్రైవేట్ కాంట్రాక్టర్లు తమ స్వంత ఆదాయ వనరుగా మార్చుకోవడం దారుణమన్నారు. నిరుపేద రోగులను బయటి మెడికల్ షాపుల నుంచి మందులు కొనుగోలు చేయాల్సిందిగా ఒత్తిడి తెస్తూ, లోపల మాత్రం కోట్ల రూపాయల నిధులను కాజేయడం ముమ్మాటికీ మానవతా రహిత చర్య అని దుయ్యబట్టారు.

**-నిబంధనల ఉల్లంఘన - పారదర్శకత శూన్యం**

వైద్య ఆరోగ్య శాఖ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన ఔషధాలను తెలంగాణ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (TGMSIDC) ద్వారా బహిరంగ విద్యుత్ టెండర్ల (ఈ–టెండర్) పద్ధతిలోనే సేకరించాల్సి ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే పరిమిత సంఖ్యలో స్థానిక కొనుగోళ్లు చేపట్టాలి. కానీ, గాంధీ ఆసుపత్రిలో ఈ నిబంధనలన్నింటినీ తుంగలో తొక్కారని నాయకులు ఆరోపించారు.

**- ఔషధాల నాణ్యత ప్రమాణాలు, నిల్వ నమోదు పుస్తకాల (స్టాక్ రిజిస్టర్) నిర్వహణను గాలికొదిలేశారు.**

-ముందుగా గడువు ముగిసే మందులను మొదట వాడాలనే నియమాన్ని ఉల్లంఘించారు.

-గడువు ముగిసిన నాసిరకం మందులను సైతం కృత్రిమ బిల్లులతో కొనుగోలు చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**-గత ఐదేళ్ల కొనుగోళ్లపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలి.**

ఈ కుంభకోణంపై కేవలం నామమాత్రపు శాఖాపరమైన విచారణలతో కాలయాపన చేయకుండా, తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి బాధ్యులను అరెస్ట్ చేయాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేసింది. దీనితో పాటు ఈ క్రింది చర్యలు చేపట్టాలని పట్టుబట్టింది:

**- రాష్ట్రవ్యాప్త ఆడిట్:**




గత ఐదేళ్లుగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ బోధనాసుపత్రులు, జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జరిగిన స్థానిక కొనుగోళ్లు, మందుల నాణ్యతపై తక్షణమే ప్రత్యేక ఆర్థిక తనిఖీలు (స్పెషల్ ఆడిట్) జరిపి నివేదికను బహిరంగపరచాలి.

**- నష్ట నివారణ చర్యలు:**

అవినీతి నిరూపితమైతే దోచుకున్న ప్రతి పైసాను సదరు కాంట్రాక్టర్లు, అధికారుల వ్యక్తిగత ఆస్తుల నుంచి రికవరీ చేయాలి. పేద ప్రజల ప్రాణాలతోనూ, ప్రజాధనంతోనూ ఆటలాడే శక్తులు ఎంతటి రాజకీయ బలమున్న వారైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఏఐవైఎఫ్ నేతలు హెచ్చరించారు.

# ప్రజాధనంపై పడగ- పార్కు స్థలం పరాధీనం!

**- గ్రీన్ జోన్లలో అక్రమ రిజిస్ట్రేషన్లు, నిర్మాణాలపై కాలనీవాసుల తిరుగుబాటు... రంగంలోకి ప్రజాప్రతినిధులు, విచారణకు డిమాండ్!**

హైదరాబాద్ జూలై16 (భారత శక్తి ): నగరంలో పచ్చదనం, ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన పార్కు స్థలాలు భూబకాసురుల నోట్లో చిక్కుకుంటున్నాయి. ఉమ్మడి బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని మారుతీ నగర్ కాలనీలో బహిరంగంగానే పార్కు స్థలాన్ని కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వైనం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. గతంలో రద్దయిన వివాదాస్పద పత్రాలతో మళ్లీ నిర్మాణ పనులు ప్రారంభించడంతో కాలనీవాసులు తిరగబడ్డారు. ఈ వ్యవహారంపై కాలనీవాసుల పిలుపు మేరకు రంగంలోకి దిగిన తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి నిర్మాణ పనులను అడ్డుకుని, సంబంధిత పురపాలక అధికారులకు ఫిర్యాదు చేశారు.

**- శాస్త్రీయ మౌలిక సూత్రాల ఉల్లంఘన: పర్యావరణ సమతుల్యతకు గొడ్డలిపెట్టు**

పట్టణ ప్రణాళికా శాస్త్ర నియమాల ప్రకారం, ఏ నివాస ప్రాంతంలోనైనా పచ్చదనం, ప్రజల శారీరక ఉల్లాసం కోసం కనీసం పది శాతం స్థలాన్ని బహిరంగ ప్రదేశాలు లేదా పార్కుల కోసం కేటాయించాలి. ఇది కేవలం వినోదం కోసమే కాకుండా, భూగర్భ జలాల పునరుద్ధరణకు, స్థానిక ఉష్ణోగ్రతల నియంత్రణకు అత్యంత కీలకం. మారుతీ నగర్ కాలనీలో సర్వే నంబర్ 179 పరిధిలోని పార్కు స్థలాన్ని కబ్జా చేయడం వల్ల స్థానిక పర్యావరణ వ్యవస్థ దెబ్బతినడమే కాకుండా, భవిష్యత్తులో వర్షపు నీరు నిలిచిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పచ్చటి చెట్లు ఉండాల్సిన చోట కాంక్రీట్ వనాలు నిర్మించడం శాస్త్రీయ నివాస సూత్రాలకే విరుద్ధం.

**-కాలనీవాసుల నిలదీత - అక్రమ రిజిస్ట్రేషన్ల బాగోతం**

గత 2017 సంవత్సరంలోనే కొన్ని తప్పుడు, సృష్టించిన పత్రాల ఆధారంగా ఈ పార్కు స్థలానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగిందని కాలనీ సంఘం ప్రతినిధులు ఆధారాలతో సహా నిరూపిస్తున్నారు. అప్పట్లో కబ్జా ప్రయత్నాలను కాలనీవాసులు సమిష్టిగా తిప్పికొట్టారు. అయితే, మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఆసరాగా చేసుకుని, సదరు కబ్జాదారులు మళ్లీ అక్రమంగా నిర్మాణ పనులను ప్రారంభించారు. దీనిపై కాలనీవాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తూ, ప్రజాప్రతినిధుల మద్దతుతో నిర్మాణ స్థలంలోనే నిరసన చేపట్టారు.

**- అధికారుల అలసత్వంపై ఆగ్రహం:**

ఈ సందర్భంగా తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజల సంక్షేమానికి ఉపయోగపడాల్సిన ప్రభుత్వ స్థలాన్ని ఏ విధంగా ప్రైవేటు వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తారని రిజిస్ట్రేషన్ శాఖను ప్రశ్నించారు. అసలు పార్కు స్థలంలో గృహ నిర్మాణానికి మున్సిపల్ అధికారులు ఏ విధంగా అనుమతులు మంజూరు చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే సదరు అక్రమ రిజిస్ట్రేషన్లను, తప్పుడు అనుమతులను రద్దు చేయాలని మున్సిపల్ కార్యాలయ అధికారులకు లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు.

**- ప్రజాప్రతినిధుల ప్రధాన డిమాండ్లు:**

- పార్కు స్థలానికి సంబంధించిన నకిలీ దస్తావేజులపై నిష్పాక్షిక విచారణ జరిపించాలి.
- తప్పుడు అనుమతులు ఇచ్చిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.
- వివాదాస్పద స్థలాన్ని పురపాలక సంస్థ స్వాధీనం చేసుకుని,



రక్షణ గోడ నిర్మించి, పార్కును అభివృద్ధి చేయాలి.

**-ఉధృతంగా ప్రజా ఉద్యమం**

ఈ నిరసన మరియు ఫిర్యాదుల కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. పార్కు స్థలాన్ని కాపాడుకునే వరకు, కబ్జాదారులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం ఆపేది లేదని కాలనీ మహిళా ప్రతినిధులు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీధర్ రావు, ప్రధాన కార్యదర్శి ప్రేమ్ నాథ్, విష్ణువర్ధన్ రెడ్డి, ఇతర ముఖ్య నాయకులు రవిశంకర్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ శర్మ, సంగమేశ్వర్ రావు, కాలనీ సంఘం అధ్యక్షులు దుర్గాప్రసాద్, కాలనీ ప్రతినిధులు అరుణ, దుర్గ, స్వాతి, సత్య, ఉమా, శారద, బిందు, సత్యవేణి, మాధవి, భార్గవి, యాదమ్మ, సుచిత్ర, సరిత, ప్రసన్న, అశ్విని, సునీత, శ్రీ మాల, మహేశ్వరి, రమ్య, నాగలక్ష్మి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కబ్జాకు వ్యతిరేకంగా గళం విప్పారు.

# నిరుద్యోగులపై పోలీసుల లాఠీ చార్జ్

## సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, జూలై 16 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 19 వేల పోలీస్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ, “5000 వద్దు -- 19000 ముద్దు” అనే నినాదంతో దిల్‌సుఖ్‌నగర్‌లో నిరుద్యోగ యువత భారీ మహాధర్నా నిర్వహించారు.రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ న్యాయమైన డిమాండ్లను శాంతియుతంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా నిరుద్యోగులపై లాఠీచార్జ్ చేయడం జరిగింది. ఈ విషయాన్ని ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.

ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును గౌరవించాలని, ఉద్యమాలను అణిచివేసే ప్రయత్నాలు మానుకుని నిరుద్యోగ యువత సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి,




ప్రసన్న హరికృష్ణ, కిరణ్ నిరుద్యోగులను అరెస్టు చేసిన నాగోల్ పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి వారికీ సంఘీభావం ప్రకటించి మద్దతు తెలపడం పట్ల నిరుద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోలీస్ పోస్టులతో పాటు అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను పారదర్శకంగా, వేగవంతంగా భర్తీ చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగుల జేఏసీ నాయకులు



ఇంద్రా నాయక్, ఆకాష్, శంకర్, శింబు కుమార్ నాయక్, సింధూ రెడ్డి, రమేష్, చెర్రీ, ప్రవీణ్ కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# జిల్లా న్యాయ సేవా సంస్థ చొరవతో బంధిత కార్మికుడి సురక్షిత రక్షణ

ఎల్బీనగర్, జూలై 16 ( భారత శక్తి): రంగారెడ్డి జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ ఎ.కర్ణ కుమార్ మరియు కార్యదర్శి శ్రీమతి జి. అనూష ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రత్యేక రక్షణ చర్యలో బంధిత కార్మికుడు కోట శ్రీనివాస్‌ను సురక్షితంగా రక్షించారు.దివ్య దిశ స్వచ్ఛంద సంస్థ (NGO) అందించిన సమాచారం మేరకు బాధితుడు కోట శ్రీనివాస్ (తండ్రి: కృష్ణారావు) గత నాలుగు సంవత్సరాలుగా కృష్ణ, రాము అనే కాంట్రాక్టర్ల వద్ద బంధిత కార్మికుడిగా పని చేస్తున్నట్లు తెలిపాడు. కుటుంబ అవసరాల నిమిత్తం రూ.1,60,000 అడ్వాన్స్ తీసుకున్న అనంతరం ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు బలవంతంగా పని చేయించడంతో పాటు రోజుకు కేవలం రూ.100 మాత్రమే చెల్లించేవారని వాంగ్మూలంలో పేర్కొన్నాడు. పని చేయడానికి నిరాకరించినా లేదా ప్రశ్నించినా తనపై దాడులు చేయించేవారని తెలిపాడు.అలాగే తన భార్యను మరో సంస్థలో పని చేయించి ఆమెకు రావలసిన వేతనాలను అడ్వాన్స్‌పై వడ్డీగా జమ చేస్తున్నట్లు చూపించేవారని, అప్పుకు సంబంధించిన రికార్డులను ధ్వంసం చేసి మరింత డబ్బు తీసుకురావాలని ఒత్తిడి చేస్తూ బలవంతంగా పని చేయించారని వివరించాడు. ఇటీవల తనను స్వగ్రామానికి పంపించి, తన భార్యను సుమారు నెల రోజుల పాటు అక్రమంగా నిర్బంధించగా, అనంతరం ఆమెను రక్షించి తిరిగి తీసుకువచ్చినట్లు తెలిపాడు.దివ్య దిశ స్వచ్ఛంద సంస్థ (NGO) అందించిన సమాచారం మేరకు సమాచారం మేరకు హాఫీజ్‌పేట్ లోని ప్రేమ్‌నగర్‌లో ఉన్న నిర్మాణ స్థలంలో పని చేస్తున్న శ్రీనివాస్‌ను సురక్షితంగా రక్షించి భద్రమైన ప్రదేశానికి తరలించారు. అనంతరం ఆయన భార్య, కుమార్తెను కూడా వారి నివాసానికి తరలించారు.అదేవిధంగా బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.ఈ రక్షణ చర్యలో జిల్లా న్యాయ సేవా సంస్థ, మండల రెవెన్యూ అధికారులు మరియు లేబర్ అధికారులు మరియు కార్మిక శాఖ అధికారులు దివ్య దిశ



స్వచ్ఛంద సంస్థ (NGO) పాల్గొన్నారు.

# నేటి నుంచి బోనాల జాతర షురూ.



హైదరాబాద్, జూలై 16(భారత శక్తి): తెలంగాణలో ఆషాఢ మాసం బోనాల జాతర జులై 16వ తేదీ నుంచి అత్యంత వైభవంగా ప్రారంభం కానుంది. చారిత్రాత్మక గోల్కొండ కోటపై వెలిసిన జగదాంబిక ఎల్లమ్మ మహంకాళి ఆలయంలో జరిగే తొలిపూజతో ఈ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా మొదలవుతాయి. ప్రభుత్వం తరపున మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ ఉదయం లంగర్‌హౌస్‌లో ఈ ఉత్సవాలను ప్రారంభిస్తారు. అనంతరం, పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లతో తొట్టెలను గోల్కొండ కోటలోని అమ్మవారి ఆలయానికి సమర్పిస్తారు.


# పిల్లలకు జర్మన్, జపాన్ భాషలు నేర్పిస్తాం

## – సీఎం రేవంత్




హైదరాబాద్, జూలై 16(భారత శక్తి ): తెలంగాణలోని పిల్లలకు జర్మన్, జపాన్, సౌత్ కొరియన్ భాషలు నేర్పించాలని టీచర్లను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కొత్తకోటలో ఆయన మాట్లాడుతూ ఈ భాషల్లో ప్రాథమిక పరిజ్ఞానం సంపాదిస్తే నెలకు రూ.2 లక్షల వరకు సంపాదించవచ్చని సీఎం తెలిపారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత వల్ల విద్యార్థులు చేరేందుకు వెనుకడుగు వేసేవారని, కానీ ఇప్పుడు పరిస్థితి మెరుగుపడిందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివితే ఏమవుతారని ప్రశ్నించేవారికి, తెలంగాణకు సీఎం కావొచ్చని తనను ఉదాహరణగా చూపాలని సూచించారు.

# నాంపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు.



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూలై 16: వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి వద్ద గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్కూటీపై వెళ్తున్న ఇద్దరు యువకులను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.ప్రమాద దాటికి స్కూటీ ముందు భాగం నుజ్జు నుజ్జు అయిన దృశ్యం.

# వానల్లేని కాలం.. ఎండిపోతున్న నారుమడులు!

## – రైతన్నల కళ్లల్లో కన్నీరు..

## వరుణుడి కరుణ కోసం కొండాపూర్ ఎదురుచూపులు.

భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూలై 16: కాలం కాని కాలంలో కారుమబ్బులైనా కరుణించకపోతాయా అని ఆశపడ్డ రైతన్నకు ఆకాశమే పగబట్టినట్లయింది. చేతికందిన కాడిని పట్టి, నమ్మకంతో నాట్లు వేసిన కర్షకుడికి ఇప్పుడు వానల్లేని వైనం గుండెకోత మిగులుస్తోంది. కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామంలో ప్రస్తుత సాగు ముఖచిత్రం అత్యంత ఆందోళనకరంగా మారింది. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్న ఆశతో అన్నదాతలు వరి నాట్లు వేశారు. వేలకు వేలు అప్పులు తెచ్చి, రేయింబవళ్లు శ్రమించి నారుమడులను సిద్ధం చేసుకున్నారు. తీరా నాట్లు వేసి పంటను సాకుదామనుకునే సమయానికి ఆకాశానికి చిల్లు పడినట్లు ఒక్క చుక్క రాలకపోవడంతో పరిస్థితి తలకిందులైంది.

పచ్చగా కళకళలాడాల్సిన నారుమడులు నిలువునా ఎండిపోతున్నాయి. కళ్లముందే పంట వాడిపోతుంటే, ఏం చేయాలో పాలుపోక రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పాతాళ గంగ సైతం అడుగంటడంతో ప్రత్యామ్నాయ నీటి వనరులు లేక, ఆకాశం వైపు దీనంగా మొహం పెట్టి చూస్తున్నారు. సకాలంలో వానలు కురవకపోతే ఈ ఏడాది పెట్టుబడులు కూడా దక్కవని, అప్పుల ఊబిలో కూరుకుపోతామని లబోదిబోమంటున్నారు. ఇప్పటికైనా వరుణ దేవుడు కరుణించి, కాస్తయినా కనువిప్పు కలిగిస్తేనే తమ పంటలు బతుకుతాయని, తక్షణమే వర్షాలు కురిసి అన్నదాతను ఆదుకోవాలని కొండాపూర్ రైతాంగం వేడుకుంటోంది. ప్రభుత్వం కూడా స్పందించి తగిన నీటి వసతులు కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# కటకట: నిజామాబాద్, కనగర్తి రైతన్నల ఆందోళన గర్జన!

భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూలై 16: పంటను కాపాడుకునేందుకు కరెంటు ఇవ్వాలంటూ అన్నదాతలు సమరశంఖం పూరించారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కళ్లముందే పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన చెందుతూ కోనరావుపేట మండలం నిజామాబాద్, కనగర్తి గ్రామాల రైతులు రోడ్డెక్కారు..
వరి నాట్ల సమయం ఆసన్నమైనా కరెంటు జాడ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రధాన రహదారిపై బైఠాయించారు. రైతుల ఆకస్మిక ధర్నాతో కిలోమీటర్ల మేర వాహనాల రాకపోకలు నిలిచిపోయి, రవాణా వ్యవస్థ స్తంభించింది. రెక్కలు ముక్కలు చేసుకుని సాగు చేస్తున్న పంటలు కళ్లముందే కరవుబారిన పడుతుంటే అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని రైతులు నిప్పులు చెరిగారు...విద్యుత్ అధికారుల నిర్లక్ష్య వైఖరి, సమయపాలన లేని సరఫరా తీరుపై అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో నాణ్యమైన విద్యుత్ అందించి పంటలను కాపాడాల్సిన కనీస బాధ్యతను అధికారులు విస్మరించారని మండిపడ్డారు..
ఒకవైపు కరెంటు కష్టాలు ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే, మరోవైపు మార్కెట్‌లో సకాలంలో మందు బస్తాలు ఎరువులు దొరకడం లేదని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

పెట్టుబడులు పెరిగి, అవసరమైన సరుకులు దొరకక తాము తీవ్రంగా నష్టపోతున్నామని కన్నీటిపర్యంతమయ్యారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే, ఉన్నతాధికారులు స్వయంగా వచ్చి నమ్మకమైన హామీ ఇచ్చేంత వరకు తాము రోడ్డుపై నుంచి కదిలేది లేదని రైతులు భీష్మించుకు కూర్చున్నారు. అన్నదాతల న్యాయమైన డిమాండ్లను ఆలకించి, తక్షణమే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

# అధికారుల చొరవతో బాల్య వివాహం నిలిపివేత

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 16 (భారత శక్తి )కుంటాల మండలంలోని ఓ గ్రామంలో 14 ఏళ్ల బాలికకు బాల్య వివాహం జరగనున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాలపై జిల్లా బాలల సంరక్షణ విభాగం, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు గురువారం గ్రామానికి చేరుకుని బాలిక కుటుంబ సభ్యులతో కౌన్సెలింగ్ నిర్వహించి బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు.
ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల బాలికల శారీరక, మానసిక, విద్యా, ఆరోగ్యపరమైన అభివృద్ధిపై కలిగే ప్రతికూల ప్రభావాలు, అలాగే బాల్య వివాహ నిరోధక చట్టం-2006 ప్రకారం తీసుకునే చట్టపరమైన చర్యలపై కుటుంబ సభ్యులకు అధికారులు సమగ్రంగా అవగాహన కల్పించారు.
అధికారుల సూచనలు, కౌన్సెలింగ్‌తో తమ తప్పును గ్రహించిన బాలిక తల్లిదండ్రులు, తమ కుమార్తెకు 18 సంవత్సరాలు పూర్తైన తర్వాత మాత్రమే వివాహం జరిపిస్తామని హామీ ఇస్తూ లిఖితపూర్వక స్వీయ ప్రకటన (సెల్ఫ్ డిక్లరేషన్) అందజేశారు.
ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ,
చట్టం ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు పూర్తికాకముందు వివాహం జరపడం నేరమని స్పష్టం చేశారు. బాల్య వివాహాలను నిర్వహించినా, ప్రోత్సహించినా లేదా సహకరించినా సంబంధిత వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని లేదా చైల్డ్ హెల్ప్‌లైన్--1098కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల అప్రమత్తతతోనే బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి మురళి, సూపర్వైజర్ శ్రీజని, కౌన్సెలర్లు శైలజ, కరుణశ్రీ, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, సోషల్ వర్కర్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణకట్టలో దందాపై ఈవో ఉక్కుపాదం.

- భక్తుల నుంచి అదనపు వసూళ్లు చేస్తే కాంట్రాక్ట్ రద్దు.. బ్లాక్‌లిస్ట్‌లో చేర్పిస్తాం.
- భక్తులతో నేరుగా మాట్లాడి సమస్యలపై ఆరా..
- నాయి బ్రాహ్మణుల వివరాల సేకరణ.. వీడియో రికార్డింగ్..
- యూనిఫాం, ఐడీ కార్డులు తప్పనిసరి..
- రూ.50 టికెట్ మాత్రమే.. అదనపు డబ్బులు చెల్లించొద్దని బోర్డులు.
- ప్రత్యేక నిఘా, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ..

భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూలై 16: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కళ్యాణకట్టలో భక్తుల నుంచి అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఈవో ఎల్. రమాదేవి గురువారం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందస్తు సమాచారం లేకుండా కళ్యాణకట్టకు చేరుకున్న ఈవో క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి భక్తులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.తలనీలాలు సమర్పించుకునేందుకు వచ్చిన భక్తులను అదనపు డబ్బులు ఎవరైనా డిమాండ్ చేస్తున్నారా, ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు.
అనంతరం అక్కడ విధులు నిర్వహిస్తున్న నాయి బ్రాహ్మణులను ఒక్కొక్కరిని వీడియో రికార్డింగ్ ద్వారా ఇంటర్వ్యూ చేసి వారి వివరాలు సేకరించారు. వేతనాలు సక్రమంగా అందుతున్నాయా, కాంట్రాక్టర్ ద్వారా కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు.కళ్యాణకట్ట నిర్వహణ కాంట్రాక్టర్‌కు ప్రతి సిబ్బందికి యూనిఫాం, గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఇవ్వాలని ఈవో ఆదేశించారు. కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.భక్తుల నుంచి తలనీలాల కోసం అదనపు డబ్బులు డిమాండ్ చేయడం లేదా వసూలు చేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. అలాంటి ఘటనలు నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలతో పాటు అవసరమైతే కాంట్రాక్టును రద్దు చేసి బ్లాక్‌లిస్ట్‌లో చేర్చుతామని హెచ్చరించారు.భక్తుల్లో అవగాహన కల్పించేందుకు కళ్యాణకట్టలో తలనీలాల టికెట్ ధర రూ.50 మాత్రమే,అలాగే



నాయి బ్రాహ్మణులకు అదనపు డబ్బులు చెల్లించవద్దు, అదనపు వసూళ్లు శిక్షార్హమైన నేరం అనే బోర్డులను ఏర్పాటు చేయించారు. మైక్ ద్వారా నిరంతరం ప్రకటనలు చేసేలా అధికారులను ఆదేశించారు. కళ్యాణకట్టలో నగదు వసూళ్లపై ప్రత్యేక నిఘా ఉంచేందుకు ఇద్దరు సిబ్బందిని నియమించాలని,ప్రాంగణమంతా సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఈవో సూచించారు. కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు తనిఖీ చేయడంతో పాటు ఫుటేజీ ఆధారంగా ఫిర్యాదులను పరిశీలించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల అనంతరం నిర్వహణ అధికారులతో సమీక్ష నిర్వహించిన ఈవో, భక్తులకు మర్యాదపూర్వకంగా, పారదర్శకంగా సేవలు అందించాలని ఆదేశించారు. ఆలయానికి వచ్చే ప్రతి భక్తుడికి ఇబ్బందుల్లేని సేవలు అందించడమే దేవస్థానం లక్ష్యమని, ఎవరైనా అదనపు డబ్బులు వసూలు చేసినట్లు గమనిస్తే వెంటనే దేవస్థానం అధికారులకు సమాచారం ఇవ్వాలని భక్తులను కోరారు.ఈ తనిఖీల్లో దేవస్థానం డీఈవో నవీన్ కుమార్, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, నరేందర్, శివసాయి,ఏఈ రామకృష్ణారావు, స్థానిక పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ సమస్యలపై కదంతొక్కిన కమలదళం.

- ఇల్లంతకుంటలో భాజపా ఆధ్వర్యంలో భారీ పాదయాత్ర.
- ఫసల్ బీమా, రైతు భరోసా తక్షణమే అమలు చేయాలని డిమాండ్.

రాజన్న సిరిసిల్ల, జూలై 16(భారత శక్తి ): తెలంగాణలోని రైతాంగాన్ని ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భాజపా ఇల్లంతకుంట మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్ విమర్శించారు. ఇల్లంతకుంట బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో రేపాక గ్రామం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం నుండి ఇల్లంతకుంట మండల తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ పాదయాత్ర నిర్వహించారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం, కేంద్ర ప్రభుత్వ ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. ?ఈ సందర్భంగా భూమల్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రతిష్ఠాత్మకంగా ఫసల్ బీమా యోజనను ప్రవేశపెడితే, ఇటు గత బీఆర్ఎస్ ప్రభుత్వం, అటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ కూడా దీనిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని మండిపడ్డారు. అతివృష్టి, అనావృష్టి, అగ్నిప్రమాదాలు, వడగండ్ల వానల వల్ల నష్టపోతున్న రైతులను ఆదుకునేందుకు కేంద్రం బీమా పథకాన్ని తెస్తే, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా లక్షలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# రోడ్డు ప్రమాదాల నియత్రణయే లక్ష్యంగా ప్రమాదాలు జరుగు(బ్లాక్ స్పాట్స్) ప్రదేశాలు సందర్శన.

## రోడ్డు ప్రమాదాల నివారణలో వాహనదారులు, ప్రజలు భాగస్వామ్యం కావాలి.



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూలై 16: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే గురువారం రోజున బోయినపల్లి మండలం కోదురుపాక చౌరస్తాలో ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ ప్రాంతాన్ని వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, బోయినపల్లి ఎస్ఐ లతో కలిసిపరిశీలించారు. ఈసందర్భంగా ప్రమాదాలకు దారితీసే కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని రోడ్డు ప్రమాదాలనుసమర్థవంతంగా అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రజల విలువైన ప్రాణాలను కాపాడేందుకు ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు నిర్మించడం, స్ట్రీట్ లైటింగ్ కల్పించడం,రోడ్డు భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అలాగే వాహనదారులు ట్రాఫిక్ , రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటిస్తూ అతివేగం , నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరిగా వినియోగించి సురక్షిత ప్రయాణాన్ని అలవాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.అనంతరం మిడ్ మానేర్ డ్యామ్‌ను సందర్శించి, సంబంధిత ఇంజనీర్లతో డ్యామ్ భద్రత మరియు తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. డ్యామ్ పరిసర ప్రాంతాల్లో ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో అప్రమత్తంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఎస్పీ వెంట వేములవాడ రూరల్ సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ రమాకాంత్, సిబ్బంది ఉన్నారు.

# శ్రీ జగన్నాథ స్వామివారి ఆశీస్సులతో ఘనంగా నిర్వహించిన రథయాత్ర మహోత్సవం



కుత్బుల్లాపూర్, జూలై 16(భారత శక్తి ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్(పద్మా నగర్ డివిజన్)పరిధిలోని వివేకానంద నగర్, సాయి నగర్, ప్రసూన నగర్, మాణిక్య నగర్, సుదర్శన్ రెడ్డి నగర్, కాకతీయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ జగన్నాథ స్వామివారి రథయాత్ర మహోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి,భక్తి, సమానత్వానికి ప్రతీకగా భావించే ఈ పవిత్ర రథయాత్రలో భక్తులతో కలిసి స్వామివారి రథాన్ని లాగి, అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రతి కుటుంబంపై శ్రీ జగన్నాథ స్వామివారి దివ్య అనుగ్రహం ఉండాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి ఆకాంక్షించారు.

## కుత్బుల్లాపూర్, బహదూర్‌పల్లి డివిజన్‌లలో SIR-2026 హెల్ప్ డెస్క్ కార్యక్రమాలను ప్రారంభించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి



ఖుత్బుల్లాపూర్, జూలై 16(భారత శక్తి ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 286 కుత్బుల్లాపూర్ డివిజన్‌తో మరియు 294 బహదూర్‌పల్లి డివిజన్ గ్రామంలోని హనుమాన్ టెంపుల్ పరిధిలో ఏర్పాటు చేసిన ూ×=–2026 హెల్ప్ డెస్క్ కార్యక్రమాలలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓటర్లకు ూ×=–2026 ప్రక్రియపై అవగాహన కల్పించడం, అవసరమైన సమాచారం అందించడం మరియు నమోదు ప్రక్రియలో సహాయ సహకారాలు అందించేందుకు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ, ూ×=–2026 కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ఓటర్లకు అవసరమైన సహాయం అందించడంలో హెల్ప్ డెస్క్‌లు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి అర్హులైన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కాంగ్రెస్ పార్టీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ఫిఫా ప్రపంచకప్?

- మెస్సీ మ్యాజిక్.. ఇంగ్లాండ్‌ను మట్టికరిపించి ఫైనల్లో అర్జెంటీనా!
- వరసగా రెండో ఫైనల్ చేరిన 'లా అల్బిసెలెస్టే'
- ఒత్తిడికి చిత్తైన 'త్రీ లయన్స్'
- మ్యాచ్ అనంతరం భావోద్వేగాలు, తోపులాటలు, రాజకీయ సంఘర్షణలు

అట్లాంటా,జూలై 16: ఈ రెండు దేశాల మధ్య శత్రుత్వానికి 1982లో జరిగిన 'ఫాక్‌లాండ్స్ యుద్ధం' ఒక ముఖ్య కారణం. ఫిఫా వరల్డ్ కప్ చరిత్రలోనే అత్యంత వివాదాస్పదమైన సంఘటనలు వీరి మ్యాచ్‌ల్లోనే జరిగాయి. యెల్లో, రెడ్ కార్డుల ప్రవేశానికి ఈ జట్ల మధ్య జరిగిన మ్యాచే కారణం.

ఫిఫా ప్రపంచకప్ 2026లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా మరోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం తెల్లవారుజామున మెర్సిడెస్ బెంజ్ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత సెమీఫైనల్ పోరులో అర్జెంటీనా 2–1 గోల్స్ తేడాతో సాంప్రదాయ ప్రత్యర్థి ఇంగ్లాండ్‌ను మట్టికరిపించింది. దశాబ్దాల పాత కక్షలు, మైదానంలో తీవ్ర ఉద్వేగాల నడుమ సాగిన ఈ హై–వోల్టేజ్ మ్యాచ్‌లో లూసియెల్ మెస్సీ సేన అద్భుత కమ్‌బ్యాక్‌తో విజయాన్ని సొంతం చేసుకుంది.

### మలుపు తిప్పిన మెస్సీ పాస్‌లు

మ్యాచ్ తొలి సగభాగంలో ఇరు జట్లు హోరాహోరీగా తలపడినా గోల్స్ చేయలేకపోయాయి. అయితే 55వ నిమిషంలో ఇంగ్లాండ్ ఫార్వర్డ్ ఆటగాడు ఆంథోనీ గోర్డాన్ మెరుపు గోల్‌తో తన జట్టుకు 1–0 ఆధిక్యాన్ని అందించాడు. ఆట 85వ నిమిషం వరకు ఇంగ్లాండ్ విజయం ఖరారు అనుకున్న సమయంలో మూడు యెల్లో కార్డులతో ఒత్తిడిలో పడిన అర్జెంటీనాను కెప్టెన్ లియోనల్ మెస్సీ తన అద్భుతమైన వ్యూహాలతో ముందుండి నడిపించాడు. ఆట ఆఖరు నిమిషాల్లో రెండు గోల్స్ చేసిన అర్జెంటీనా తమ చిరకాల ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేసింది. 85వ నిమిషంలో మెస్సీ ఇచ్చిన పర్‌ఫెక్ట్ పాస్‌ను అందుకున్న ఎంజో ఫెర్నాండెజ్ అదిరిపోయే లాంగ్ షాట్‌తో స్కోరును 1–1తో సమం చేశాడు. ఆ తర్వాత ఇంజూరీ టైమ్‌లో (90ం2వ నిమిషంలో) మళ్లీ మెస్సీ అందించిన అద్భుతమైన క్రాస్‌ను లౌటారో మార్టినెజ్ హెడర్ ద్వారా గోల్‌గా మార్చడంతో అర్జెంటీనా 2–1తో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. ఈ ఓటమితో 1966 తర్వాత ఫైనల్ చేరాలనే ఇంగ్లాండ్ కల మరోసారి చెదిరిపోయింది. ఆదివారం జరగబోయే ప్రతిష్టాత్మక ఫైనల్ పోరులో అర్జెంటీనా జట్టు స్పెయిన్‌తో తలపడనుంది. అదే రోజు మూడో స్థానం కోసం ఫ్రాన్స్ తో ఇంగ్లాండ్ పోటీపడనుంది.

### - భావోద్వేగాలు, తోపులాటలు...

ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్ ముగిసిన తర్వాత మైదానంలో ఆటగాళ్ల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. ఈ ఓటమిని జీర్ణించుకోలేక ఇంగ్లండ్ మిడ్‌ఫీల్డర్ జూడ్ బెల్లింగ్హామ్ తీవ్ర ఉద్వేగానికి లోనయ్యాడు.



మ్యాచ్ అనంతరం అర్జెంటీనా ఆటగాళ్లు సంబరాలు చేసుకుంటుండగా, ఆ జట్టు ప్లేయర్ వాలెంటైన్ బార్కో తలపై జూడ్ కొట్టడంతో ఇరు జట్ల మధ్య తోపులాట జరిగి పరిస్థితి హీటెక్కింది.

మైదానంలో అర్జెంటీనా ఆటగాడు వాలెంటైన్ బార్కో ఏదో అనడం వల్లే జూడ్ బెల్లింగ్హామ్ సహనం కోల్పోయి అతని తలపై కొట్టినట్లు తెలుస్తోంది. జూడ్ బార్కోను తోసివేయడంతో ఆగ్రహించిన మిగతా అర్జెంటీనా ఆటగాళ్లు అతనిపైకి దూసుకెళ్లి వెనక్కి నెట్టేశారు. పరిస్థితి చేయిదాటి కొట్టుకునే వరకు వెళుతుండటంతో రెండు జట్ల మిగతా ఆటగాళ్లు కలగజేసుకుని సర్దిచెప్పాల్సి వచ్చింది. మరోవైపు మైదానంలో ఆటగాళ్ల ఘర్షణ మాత్రమే కాకుండా, ఇరు దేశాల మధ్య ఉన్న పాత రాజకీయ శత్రుత్వం కూడా ఈ మ్యాచ్‌లో బయటపడింది. అర్జెంటీనా డిఫెండర్లు మార్టినెజ్, గియోవానిలు మ్యాచ్ గెలిచిన అనంతరం 'ఫాక్‌లాండ్స్ అర్జెంటీనాదే' అని రాసి ఉన్న ఒక వివాదాస్పద బ్యానర్‌ను స్టేడియంలో ప్రదర్శిస్తూ ఊపారు.

నిజానికి ఫాక్‌లాండ్స్ దీవుల కోసం 1982లో ఇంగ్లండ్, అర్జెంటీనా దేశాల మధ్య దాదాపు 74 రోజుల పాటు భీకర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో బ్రిటిష్ దేశానిదే పైచేయి కాగా, రెండు వైపులా కలిపి దాదాపు 900 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. నాటి నుండి నేటివరకు ఇరు దేశాల మధ్య ఫుట్‌బాల్ మ్యాచ్ జరిగినప్పుడల్లా ఈ రాజకీయ సెగలు, శత్రుత్వం మైదానంలో కనిపిస్తూనే ఉంటాయి.

## భూముల సర్వే, రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 16 (భారత శక్తి )భూముల సర్వే, రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం భైంసా మండలం బాబుల్ గావ్ గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మ్యాపులు లేని గ్రామాలకు మ్యాపులు తయారు చేసేందుకు చేపట్టిన సర్వేను పారదర్శకంగా చేపట్టాలన్నారు. రీ సర్వేకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో అత్యాధునిక సాంకేతికత వినియోగించి రీ సర్వే ప్రక్రియ చేపట్టిందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను మొత్తాన్ని గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానిక రైతులతో మాట్లాడుతూ, రైతులందరూ ఆయిల్ ఫామ్ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో ఎక్కువ లాభాలు వస్తాయని అన్నారు. వాతావరణ పరిస్థితులు, నీటిలభ్యత, వర్షాలను బట్టి పంటలు సాగు చేయాలన్నారు. పంట మార్పిడి విధానాలపై దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏడి ల్యాండ్ సర్వే ల్యాండ్ రికార్డ్ నరసింహ మూర్తి, తహసిల్దార్ శశి భూషణ్, ఎంపీడీవో నీరజ్ కుమార్, గ్రామ సర్పంచ్ అనసూయ మహేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు అందించాలి.

**-టీయూడబ్ల్యూజే హెచ్ 143- రాష్ట్ర ఉపాధ్యక్షులు బీఆర్ లెనిన్**

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 16 (భారత శక్తి ): జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న అర్హులైన ప్రతి జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు అందించాలని టీయూడబ్ల్యూజే హెచ్ 143- రాష్ట్ర ఉపాధ్యక్షులు బీఆర్ లెనిన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్లో గురువారం జిల్లా జర్నలిస్టుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు లెనిన్ హాజరై మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో తమ యూనియాన్ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 వేల జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు అందజేసిందన్నారు. ఈ ప్రభుత్వంలో ఉన్న జర్నలిస్టుల కమిటీ నాయకులు ప్రిట్, ఎలక్ట్రానిక్ మీడియాలు పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు అరకొరకగా ఇస్తు ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. జిల్లాలో సభ్యత్వ నమోదు పెంచాలని, జిల్లా కలెక్టర్, ఎస్పీ స్నేహ షబరిష్, హెలెమెంట్ ధరించాలని ప్రజలకు, ఉద్యోగస్తులకు అవగహన కల్పించారని, ప్రతి జర్నలిస్టు హెలెమెంట్ ధరించాలని వారి కుటుంబని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు తీగల కృష్ణరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఈరగాని బిక్షం పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, జిల్లా కన్వీనర్ మద్దినేని గుట్టయ్య, కోకన్వీనర్ గాడిపెల్లి శేఖర్, నాయకులు కరుణకర్, ప్రసాద్, కిరణ్, వెంకన్న, శ్రీధర్, చక్రధర్, సుబ్రమణ్యం, శ్రీనివాస్, రాజేశ్వర్, వినోద్రెడ్డి, నారాయణరావు, సంతోష్, విష్ణు, మహేష్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 18న జరిగే యువ సంగ్రామసదస్సును విజయవంతం చేయాలి.

**- జిన్నారం నుంచి యువత భారీగా తరలిరావాలి**

**- గూడెం విక్రమ్ రెడ్డి, ఆది రామకృష్ణ**



సంగారెడ్డి జిన్నారం, జూలై 16 (భారత శక్తి న్యూస్): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 18న నిర్వహించనున్న యువ సంగ్రామ సదస్సుకు జిన్నారం మున్సిపల్ పరిధి నుంచి యువత పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని యువ నాయకుడు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తనయుడు గూడెం విక్రమ్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు ఆది రామకృష్ణ పిలుపునిచ్చారు. జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆది రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశానికి గూడెం విక్రమ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యువ సంగ్రామ సదస్సు లక్ష్యాలు, యువత పాత్ర, సభ విజయవంతానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. యువత సమస్యల పరిష్కారం, యువ శక్తి ఐక్యత, పార్టీ బలోపేతమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు ప్రతి యువకుడు తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని గూడెం విక్రమ్ రెడ్డి కోరారు. జిన్నారం మున్సిపల్ నుంచి అత్యధిక సంఖ్యలో యువత పాల్గొని సదస్సు విజయానికి తోడ్పడాలని ఆది రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు నాయి కోటిరాజేష్, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు చెన్నారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు మిరాజ్ ఖాన్, కౌన్సిలర్లు, యువజన విభాగం సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి

**పెండింగ్ అట్రాసిటీ కేసులను వేగంగా పరిష్కరించాలి**

**రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**






నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 16 (భారత శక్తి )ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో ప్రతి అర్హుడికి చేరేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల అమలు, అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర అంశాలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశానికి ముందు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం చిత్రపటాలకు చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, కమిషన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళు లర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు అమలవుతున్న సంక్షేమ పథకాల పురోగతి, అట్రాసిటీ కేసుల నమోదు, దర్యాప్తు, ఛార్జిషీట్ల దాఖలు, బాధితులకు పరిహారం చెల్లింపు తదితర అంశాలపై శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల వివరాలు, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇండ్లు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద జాబ్‌కార్డుదారులకు కల్పిస్తున్న ఉపాధి వంటి అంశాలను సమీక్షించారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఆలస్యం లేకుండా అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు పారదర్శకంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేసి బాధితులకు పరిహారం సకాలంలో అందేలా చూడాలని సూచించారు. ప్రతి నెల చివరి వారంలో మండల స్థాయిలో సివిల్ రైట్స్ డే నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి తగిన పని దినాలు కల్పించాలని, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని మౌలిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి సంబంధించిన అభివృద్ధి నిధులు ఎక్కడైనా పెండింగ్‌లో ఉంటే ముఖ్యమంత్రితో మాట్లాడి విడుదలయ్యేలా కృషి చేస్తానని చైర్మన్ హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తూ కామన్ మెనూ అమలు చేస్తున్నామని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం అందిస్తున్నామని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 4,306 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో ఎస్సీ, ఎస్టీ కూలీలకు ఉపాధి కల్పనలో నిర్మల్ జిల్లా రాష్ట్రంలో ముందంజలో ఉందన్నారు. బ్యాంకుల ద్వారా 199 ద్విచక్ర, త్రిచక్ర విద్యుత్ వాహనాలను ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అందించినట్లు పేర్కొన్నారు.

జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు వేగవంతంగా కొనసాగుతోందని, వివిధ దశల్లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

కమిషన్ సభ్యులు మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, 60 సంవత్సరాలు పూర్తి చేసిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్త్రం నీలాదేవి, రాంబాబు నాయక్, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయికిరణ్, డీఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, డీఎస్పీ శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రక్షణ సేన.. పార్టీ..తుంగతుర్తి నియోజవర్గం ఇంచార్జి గా- సూరారపు కృష్ణవేణి



సూర్యాపేట (భారత శక్తి ప్రతినిధి) జులై 16: తెలంగాణ రక్షణ సేన తుంగతుర్తి నియోజవర్గం ఇంచార్జి గా సూరారపు కృష్ణవేణి నియమితు లయ్యారు.ఈ మేరకు టీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కల్వకుంట్ల కవిత తొలి జాబితాలో 23 మంది లో కృష్ణవేణి కి అవకాశం కల్పించారు.తెలంగాణ జాగృతి సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలిగా పనిచేస్తున్న కృష్ణ వేణి కి తుంగతుర్తి నియోజవర్గం ఇంచార్జి గా ప్రకటించడం పట్ల పార్టీ వర్గాల్లో హర్షం వ్యక్తం అవుతుంది.భవిష్యత్ లో ఎమ్మెల్యే అభ్యర్థిగా సూరారపు కృష్ణవేణి పోటీ చేసే అవకాశం ఉందని అధినేత్రి నిర్ణయం సంతోష క రణమని టీఆర్ఎస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు.

**కవితమ్మ కు కృతజ్ఞతలు: కృష్ణవేణి**

తనపై విశ్వాసం ఉంచి తుంగ తుర్తి నియోజక వర్గం ఇంచార్జి గా బాధ్యతలు అప్పగించిన టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవితమ్మకు ఈ సందర్భంగా కృష్ణవేణి కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తులు నాణ్యవంతంగా తయారు చేయాలి



**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 16 (భారత శక్తి) ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తులు నాణ్యవంతంగా ఉండాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.గురువారం సాయంత్రం నిర్మల్ పట్టణంలోని స్కంద ఔట్ ఫిట్ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తుల తయారీ తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా దుస్తుల తయారీకి సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే దుస్తులు నాణ్యవంతంగా ఉండాలని పేర్కొన్నారు. సమయానికి యూనిఫాంలు తయారు చేసి విద్యార్థులకు అందించాలని తెలిపారు.ఈ పరిశీలనలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి లో జగన్నాథ రథ యాత్ర ను ప్రారంభించిన జగ్గారెడ్డి

**- సంగారెడ్డి పట్టణంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో వైభవంగా జగన్నాథ రథయాత్ర**

**- సంగారెడ్డి కొత్త బస్టాండ్ నుండి పిఎస్సార్ గార్డెన్ వరకు సాగిన యాత్ర**



**- భజనలు, కోలాటాలతో భక్తిపారవశ్యంలో మునిగిన సంగారెడ్డి పురవీధులు**

సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, జులై 16: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలో శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, పూజలు నిర్వహించి రథయాత్రను ఘనంగా ప్రారంభించారు.ఈ రథయాత్ర సంగారెడ్డి కొత్త బస్టాండ్ నుండి ప్రారంభమై, పట్టణ పురవీధుల గుండా పిఎస్సార్ గార్డెన్ వరకు సాగింది. రథం కదిలిన వెంబడి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని 'జగన్నాథ్ కీ జై' అంటూ హరినామ స్మరణ చేశారు. యాత్ర పొడవునా భక్తులు చేసిన భజనలు,ఆధ్యాత్మిక నాట్యాలు, సంకీర్తనలతో పట్టణ వీధులన్నీ భక్తిపారవశ్యంతో మారుమోగాయి. ముఖ్యంగా మహిళా భక్తులు సాంప్రదాయ దుస్తులలో ప్రదర్శించిన కోలాట నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, వీక్షకులను అలరించాయి. భక్తులకు ఎక్కడికక్కడ ఇస్కాన్ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.గత కొన్ని సంవత్సరాలుగా సంగారెడ్డి పట్టణంలో జగన్నాథ రథయాత్రను నిరంతరాయంగా నిర్వహిస్తూ, ఆధ్యాత్మికతను పెంపొందిస్తున్న ఇస్కాన్ స్థానిక శాఖ ప్రతినిధులను జగ్గారెడ్డి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన స్వయంగా భక్తి పాటలు పాడుతూ భక్తులలో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, ప్రముఖ నాయకులు కూన సంతోష్, సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, ఇస్కాన్ ప్రతినిధులు మరియు పట్టణ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ షాక్..



**-హుటాహుటిన హాస్పిటల్ కు తరలింపు**

మణుగూరు, జూలై 16 (భారతశక్తి): మంత్రుల పర్యటన నేపథ్యంలో అపశృతి చోటుచేసుకుంది. బుధవారం రాత్రి మణుగూరు మండలంలోని తోగ్గూడెం సమ్మక్క-సారలమ్మ ఆలయం సమీపంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండగా ఈ బయ్యారానికి చెందిన బాలాజీ ఫ్లెక్సీ షాప్ నిర్వాహకుడు సిరిగడ్డే సంతోష్ విద్యుత్ షాక్‌కు గురైనట్లు తెలుస్తోంది. గురువారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన సంతోష్‌ను మెరుగైన చికిత్స కోసం కొత్తగూడెంలోని నాగరాజు ఆస్పత్రికి తరలించగా, వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవలే ఆయన

# దేశంలోనే వినూత్న సంక్షేమ పథకాలు అమలవుతున్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం.

- పేదింటి స్వంత ఇంటి కళ ఇందిరమ్మ రాజ్యంతోనే సాకారం అయింది.
- 2ఏళ్లలో 35వేల కోట్లతో 7లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది.
- ఎన్నో గొప్పలు చెప్పిన గత ప్రభుత్వం ఒక్క ఇల్లు అయినా ఇచ్చిందా.
- నా రాజకీయ జీవితంలో గొప్ప సంతృప్తి ఇచ్చిన పని దేవాదుల ప్రాజెక్టు.
- ఉమ్మడి జిల్లా సాగు, త్రాగు నీటికి పెద్ద దిక్కుగా దేవాదుల నిలుస్తుంది.
- దేశవ్యాప్తంగా ఎల్ నీనో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి.
- దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి జిల్లాకు సాగు, త్రాగు నీరు అందించే ప్రయత్నం చేస్తున్నాం.
- ధర్మసాగర్ గ్రామ ప్రజలు సహకరిస్తే ఓఆర్ఆర్ నుండి ఎల్కుర్తి క్రాస్ వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణం చేయిస్తా.
- పని చేసే బాధ్యత నాది. సహకరించాల్సిన బాధ్యత మీది..
- మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



జనగామ(భారత శక్తి)జులై 16: ధర్మసాగర్ మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 92లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్ల ప్రారంభోత్సవంతో పాటు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.పేద ప్రజల స్వంత ఇంటి కళను సాకారం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే అని అన్నారు. దేశంలోనే ఎక్కడ లేని విధంగా రెండేళ్లలోనే 35వేల కోట్లతో 7లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అంటూ ఎన్నో గొప్పలు చెప్పిన గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇంత పెద్ద ధర్మసాగర్ మేజర్ గ్రామ పంచాయతీలో ఒక్క ఇల్లు అయినా ఇచ్చిందా అని ప్రజలను అడిగారు. కానీ నేను ఎమ్మెల్యే అయిన ఈ రెండున్నర ఏళ్లలో 2కోట్ల అభివృద్ధి పనులు చేశానని ఇవాళ ఒక్క రోజే 92లక్షల పనుల ప్రారంభోత్సవం చేసుకున్నామని అన్నారు. గతంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడు మండల కార్యాలయాల సముదాయం, జూనియర్ కళాశాల, ధర్మసాగర్ రిజర్వాయర్ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు.


దేశ వ్యాప్తంగా ఎల్ నీనో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ఎలాంటి పరిస్థితుల్లో దవాదుల పథకం ఉమ్మడి వరంగల్ జిల్లా సాగు నీరు, త్రాగు నీటికి పెద్దదిక్కుగా నిలుస్తుందని అన్నారు.

నా రాజకీయ జీవితంలో అత్యంత సంతృప్తి కలిగించిన పని దేవాదుల ప్రాజెక్ట్ అని అన్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకం మొదటి దశలో ధర్మసాగర్ రిజర్వాయర్ లోకే గోదావరి జలాలు చేరుతాయాని తెలిపారు. ఇక్కడి నుండే స్టేషన్ ఘనపూర్, నవాబ్ పేట, అశ్వరావుపల్లి, గండి రామారం, ఛీటకోడూరు, బొమ్మకూరు రిజర్వాయర్లకు కూడా నీటిని పంపింగ్ చేయడం జరుగుతుందని చెప్పారు. దేవాదులలోని 10పంపులను 100రోజులు నిరంతరాయంగా నడిపించి ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు, రైతులకు సాగు నీరు, త్రాగు నీరు అందించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని వెల్లడించారు. ధర్మసాగర్ గ్రామంలో చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని అన్నారు. రెండో విడతలో ధర్మసాగర్ గ్రామానికి 100ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో గుడిసెలు, పెంకుటిల్లు, కవర్లు కప్పుకొని, రేకుల ఇళ్లలో ఉంటున్న అర్హులైన పేద ప్రజలకు రాజకీయాలకు అతీతంగా చేరేలా చూడాలని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు సూచించారు.

ఓఆర్ఆర్ నుండి ఎల్కుర్తి క్రాస్ వరకు నాలుగు లైన్ల రహదారి గా ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నట్లు దీనికి గ్రామ ప్రజలు సహకరించి ముందుకు వస్తే రోడ్డు నిర్మాణం చేసే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. అలాగే ధర్మసాగర్ రిజర్వాయర్ ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలీయా, తహసీల్దార్, ఎంపిడివో, హౌసింగ్ డిఈ, వివిధ గ్రామాల సర్పంచులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తగ్గేదెలా.. ఆపేదెవరూ..?

**-మంత్రులు వచ్చిన ఇసుకంతైనా ఆగని అక్రమ రవాణా.!**
**-అభివృద్ధి పేరుతో నిషారాత్రిలో సౌండ్ పొల్యూషన్**
**-ఎమ్మెల్యే అనుచరులం.. పట్టుకోనే ధైర్యం చేస్తారా.?**
**-పెన్నులో ఇంకు అయిపొయ్యే వరకు వ్రాసిన ఫలితం శూన్యమే.!**




**- నిషారాత్రిలో సౌండ్ పొల్యూషన్**

స్థానికులు పగలంతా ఎదో ఒక పనిచేసి ఇంటికి వచ్చి రాత్రిపూట విశ్రాంతి తీసుకుందామంటే పెద్ద పెద్ద డిజే పాటలతో రయ్..



రయ్.. అంటూ అక్రమ ఇసుక ట్రాక్టర్లు తిరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగలంతా అలసిపోయి రాత్రిపూట ప్రశాంతంగా నిద్ర కూడా పోనియడం లేదని స్థానికులు బాధను వెళ్లగక్కుతున్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే చందంగా పగలు రాత్రి అనే తేడా అక్రమ ఇసుక దోపిడీకి తెరలేపుతున్నారు. అక్రమ ఇసుక మాఫియా బ్రదర్స్ ట్రాక్టర్ల దగ్గర వసూళ్లు చేస్తున్న నిధులు, అనుమతులు లేకుండా జరిగే అక్రమ ఇసుక రవాణాపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే అసలు భాగోతం బయట పడుతోందని ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు, గిరిజన సంఘాల నేతలు కోరుతున్నారు.

మణుగూరు జూలై 16 (భారతశక్తి): మండలంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక దందా జోరుగా సాగుతోంది. దమ్మొంటే పట్టుకోండి.. పట్టుకుంటే వదిలేస్తా సిండికేట్, తగ్గేదెలా.. అడ్డుకునే ధైర్యం ఎవరికి ఉంటుందో చూస్తాం.. ఈ డైలాగ్ ఎక్కడో విన్నట్లుగా



ఉంది. కదా అంటే పొరపాటే.. పుష్పా సినిమాలో హీరో అధికారులకు సవాల్ విసిరినట్టు అచ్చం మణుగూరులో కూడా ఇసుక మాఫియా బ్రదర్స్ అధికారులకు సవాల్ విసురుతున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే అనుచరులం, అభివృద్ధికి మేము మూల స్థంబాలం, ఎవరికి ఇసుక కావాలన్న అరగంటలో చెప్పిన ప్రదేశంలో ఇసుకతో ట్రాక్టర్ ముందుంటుంది. మమ్ముల్ని పట్టుకునే ధైర్యం ఎవరికి వుంటుందని బహిరంగంగా మంగమ్మ శపదం చేస్తున్నారు.

**- ముగ్గురు మంత్రులు వచ్చిన ఆగని దందా.!**

గురువారం మణుగూరుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు వచ్చిన ఇసుక దోపిడీ ఆగలేదు. మంత్రులు వస్తున్నారని వాళ్లకు స్వాగతం పలికేందుకు కలెక్టర్, ఎస్పీ మండలంలో మకాం వేసిన ఇసుక అక్రమ రవాణా మాత్రం



తగ్గేదెలా అన్నట్లు నయా దందా సాగించారు. మండల అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ప్రోటోకాల్ అంటూ ఏర్పాట్లలో ఉంటే అదే అదునుగా భావించిన బ్రదర్స్ మాత్రం ఇసుక అక్రమ రవాణాను యథేచ్ఛగా కొనసాగించారు. స్థానిక ఎమ్మెల్యే మంత్రులు వస్తున్నారని మండల కేంద్రంలో హడావుడి ఏర్పాట్లలో నిమగ్నమైతే ఆయనతో పాటు వున్నట్లుగా నటించి ఇసుక దందాకు నయా బాటలు వేసుకున్నారు.

**- వరుస కథనాలు వస్తున్న చలనం లేదాయే.!**

ఎటువంటి అనుమతులు లేకుండా గోదావరి నది నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని ఆధారాలతో సహా వరుస కథనాలు పత్రికలలో వస్తున్న అధికారులకు మాత్రం కూసంతైన చలనం లేకుండా పోయిందని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. అక్రమార్కులు మాత్రం మీసం మెలేస్తూ మమ్ముల్ని పట్టుకోలేరంటూ సవాళ్లు విసురుతున్నారు. పెన్నులో ఇంకు అయిపొయ్యే వరకు వ్రాసుకొని అంటూ బ్రదర్స్ అధికార అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారు. మంత్రుల రాక కోసం హెలిప్యాడ్ ఏర్పాట్లు, వివిధ రకాల పనులకు సంబంధించి ఇసుకాసురుల యంత్రాలు, ట్రాక్టర్లను అధికారులు వినియోగించినట్లు తెలుస్తోంది.

## రెడ్డిపల్లి చౌరస్తాలో ఘనంగా ప్రారంభమైన ఎంఎస్‌డబ్ల్యూ ఫ్యాబ్రికేషన్ షాపు



మెదక్ జిల్లా నర్సాపూర్, జూలై 16 (భారత శక్తి న్యూస్): రెడ్డిపల్లి చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఎంఎస్‌డబ్ల్యూ ఫ్యాబ్రికేషన్ షాపు ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రెడ్డిపల్లి గ్రామ సర్పంచ్. పద్మావతి అశోక్ గౌడ్ రిబ్బన్ కట్ చేసి షాపును ప్రారంభించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి నూతన వ్యాపార సంస్థలు ఏర్పాటు కావడం ఎంతో సంతోషకరమని అన్నారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు గ్రామ ఆర్థికాభివృద్ధికి కూడా ఇలాంటి పరిశ్రమలు దోహదపడతాయని పేర్కొన్నారు. వ్యాపారంలో నాణ్యత, నిజాయితీ, వినియోగదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు సాగాలని నిర్వాహకులకు సూచించారు.ప్రజలకు నాణ్యమైన ఫ్యాబ్రికేషన్ సేవలను అందిస్తూ వ్యాపారాన్ని విజయవంతంగా అభివృద్ధి చేసుకోవాలని, కష్టపడి పనిచేస్తే ప్రతి రంగంలో విజయం సాధించవచ్చని ఆమె అన్నారు. ఈ సందర్భంగా షాపు నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు, యువకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొని నూతన షాపు నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామంలో మరో నూతన వ్యాపార సంస్థ ప్రారంభం కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రజా ప్రయోజనాలకు భంగం కల్గిస్తే చూస్తూ ఊరుకోం

**- ప్రజా సంఘాలు, జర్నలిస్ట్ సంఘాలు**



పోరుమామిళ్ల, జులై 16(భారత శక్తి ): స్థానిక రెవిన్యూ ప్రాంగణంలోని మైదుకూరు రోడ్డు వైపు వున్న స్థలం మీద కొంతమంది కన్ను పడిందే తడవుగా లీజు పేరుతో కాజేసేందుకు పావులు కదపడం ప్రారంభించారు. ప్రభుత్వ రికార్డుల్లో అధికారికంగా ప్రజల కోసం వున్న ప్రధాన ముఖద్వారాన్ని సయితం మాయం చేసే ప్రయత్నాలు ముమ్మురం చేశారు. దుర్మార్గపు ఆలోచనకు శ్రీకారం చుట్టి బిల్డింగ్ కాంట్రాక్టర్ కు భాద్యత అప్పగించగా ఆయన పునాదులు తీసేందుకు మార్కింగ్ సిద్ధం చేశాడు. ఇది గమనించిన ప్రజలు, ప్రజా సంఘాలు, విలేకరులు గట్టిగా అడ్డుకోవడం జరిగింది. షాపింగ్ కాంప్లెక్స్ పేరుతో ప్రజా ప్రయోజనాలను కాలరాస్తున్నారని, దాదాపు అన్ని శాఖల కార్యాలయాలు ఈ ప్రాంగణంలోనే వున్నాయని, కాంప్లెక్స్ నిర్మాణంవల్ల ప్రధాన ముఖ ద్వారం మూతపడితే విద్యార్థులు, రైతులు, మహిళలు, కార్యాలయాల సిబ్బంది, ఇటువైపు వున్న ఆరు బూతుల ప్రజలు కార్యాలయాల్లోకి దారిలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, అంతేకాకుండా అనుకోని అత్యవసర పరిస్థితులు ఎదురయితే ఫైర్, అంబులెన్సు లాంటి వాహనాల సేవలకు ఆలస్యమయ్యే ప్రమాదం ఉందని నిలదీయడం జరిగింది. ఒక వ్యక్తి స్వార్థపూరిత ఆలోచనలకు ఆ వ్యక్తి పార్టీలోని సహచరులు సై అనడంతో ఈ తతంగం నడుస్తోందని ఇది సరికాదని పలువురు హితవు పలుకుతున్నారు, ఈ దుర్మార్గపు చర్యను అడ్డుకొనేందుకు ఆ ప్రాంత ప్రజలు సిద్ధమవుతున్నారు. సోమ్మొకరిది... సోకొకడిది చందాన స్థలం ప్రభుత్వానిది, షాపింగ్ నిర్మాణం చేపట్టేది జడ్పీ నిధులతో, వచ్చే బాడుగలు మాత్రం అక్రమ లీజు దారుడికి అన్నమాట. లీజు పేరుతో అప్పనంగా ప్రభుత్వ సొమ్మును కాజేస్తుంటే, ప్రజా ప్రయోజనాలు తుంగలో తొక్కేందుకు సిద్దపడుతుంటే ఏ మాత్రం చూస్తూ ఊరుకోమని, సహించేదిలేదని ప్రజలు, ప్రజా సంఘాలు, విలేకరులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.

# నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ జే.నరేందర్ గౌడ్

- సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలి
- రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి
- విధుల్లో క్రమశిక్షణతో పనిచేయాలని పోలీసులకు ఆదేశం




నర్సాపూర్, జూలై 16 (భారత శక్తి న్యూస్): మెదక్ జిల్లా తూప్రాన్ డివిజన్ డీఎస్పీ జే.నరేందర్ గౌడ్ గురువారం సంవత్సర సందర్శనలో భాగంగా నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసుల నమోదు విధానం, పరిపాలనా నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని సమీక్షించిన డీఎస్పీ, దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేసుల విచారణలో జాప్యం లేకుండా చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్న ఆయన ట్రాఫిక్ నియంత్రణను మరింత పటిష్టం చేయడంతో పాటు వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిరంతరం చేపట్టాలని అధికారులకు సూచించారు. స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన డీఎస్పీ, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, ప్రమాదకర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమైన డీఎస్పీ, వారి సమస్యలను అడిగి తెలుసుకొని పోలీసు అధికారుల కిట్లను పరిశీలించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణతో పాటు ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును వెంటనే స్వీకరించి చట్టబద్ధంగా పరిష్కరించే చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పోలీసు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీలో నర్సాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రంగకృష్ణ, నర్సాపూర్ ఎస్ఐ రంజిత్ రెడ్డి, ఎస్ఐ కృష్ణ, ఏఎస్ఐలు శివకుమార్, ముజీబ్ అహ్మద్, సుందర్ రాజు, స్టేషన్ రైటర్ సురేష్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# 2027 డిగ్రీ కోర్సుల ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూలై 16: (భారత శక్తి)తెలంగాణ ప్రభుత్వం బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్-కమ్-మెయిన్స్--2027 ఉచిత శిక్షణ కార్యక్రమానికి అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి తెలిపారు. ఈ కోచింగ్ కార్యక్రమం హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తుల స్వీకరణ జూలై 17 నుంచి ఆగస్టు 7, 2026 వరకు కొనసాగుతుందని తెలిపారు. మొత్తం 150 మంది అభ్యర్థులకు ప్రవేశం కల్పించనుండగా, వారిలో 100 మందిని ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులైన 50 మంది అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్ష లేకుండానే కోచింగ్‌లో అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, భారతీయ పౌరులై ఉండాలని, యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్--2027 నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగి ఉండాలని సూచించారు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించరాదని తెలిపారు. అభ్యర్థులు రూ.5,000 సెక్యూరిటీ డిపాజిట్ (శిక్షణ పూర్తిచేసిన అనంతరం తిరిగి చెల్లింపు), రూ.5,000 వ్యక్తిగత నిధి, ఇతర అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల చివరి తేదీ ఆగస్టు 7, హాల్ టికెట్ల డౌన్‌లోడ్ ఆగస్టు 13, స్క్రీనింగ్ పరీక్ష ఆగస్టు 16, ఫలితాలు ఆగస్టు 19, ధ్రువపత్రాల పరిశీలన ఆగస్టు 21 నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు టీజీ బీసీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ను సందర్శించవచ్చని, లేదా జిల్లా బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు సూచించారు.

# కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్‌చెరు జులై 16 భారత శక్తి పటాన్‌చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి (జిఎంఆర్) గురువారం ఉదయం కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారిని తిరుమలలో భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఉదయం స్వామివారి సుప్రభాత సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్ అనంతరం ఆలయంలో ప్రత్యేక దర్శనం చేసుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి అనుగ్రహంతో పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంలో ఆనందం నెలకొనాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సుభిక్షం, అభివృద్ధి చేకూరాలని స్వామివారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే జిఎంఆర్ తో పాటు గూడెం సందీప్ రెడ్డి, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, సోమ శీనయ్య, సుధాకర్ గౌడ్, స్వామి వారిని దర్శించుకున్నారు.

# ఆస్తి కోసం అత్త దారుణ హత్య

- గుట్టురట్టు చేసిన పోలీసులు.. కన్న కోడలే హంతకురాలు..
- నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట డీఎస్పీ ప్రవీణ్ కుమార్



సూర్యాపేట, జులై 16(భారతశక్తిజిల్లా ప్రతినిధి ) ఆస్తి కోసం కన్న కోడలే అత్తను దారుణంగా హత్య చేసిన సంఘటన సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల పరిధిలోని తూర్పుగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. ముందుగా సాధారణ మరణంగా, అనుమానాస్పద మృతిగా భావించిన ఈ కేసును పోలీసుల తమదైన శైలిలో దర్యాప్తు చేసి అసలు నిజాన్ని వెలికితీశారు. గురువారం సూర్యాపేట ఎస్డీపీవో (రాణూరా) కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ప్రవీణ్ కుమార్, తుంగతుర్తి సీఐ డి. ఉపేందర్ రావులతో కలిసి ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

**- భూమి తగాదాలే కారణం..**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తూర్పుగూడెం గ్రామానికి చెందిన కోణతం భాగ్యమ్మ (వృద్ధురాలు)కు గ్రామంలో ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే ఆ భూమిలో తనకు కూడా వాటా కావాలని ఆమె కూతురు ఉప్పు శోభ స్థానిక కోర్టులో సివిల్ దావా (రా.వా.చీశీ.10/2024) వేసింది. అప్పటినుంచి కుటుంబంలో ఆస్తి తగాదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో ఏప్రిల్ 26వ తేదీన కూతురు శోభ ఇంటికి వచ్చి, తల్లి భాగ్యమ్మను కలిసి భూమి వాటా విషయమై అడిగి వెళ్లిపోయింది.

**- ఆగ్రహంతో గొంతు నులిమి..**

కూతురు ఇంటికి వచ్చి భూమి వాటా అడగడం కోడలైన కోణతం మాధవికి ఇష్టం లేదు. ఏప్రిల్ 27వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో అత్తాకోడళ్లు ఇద్దరే ఇంట్లో ఉన్న సమయంలో మాధవి ఇదే విషయమై అత్త భాగ్యమ్మతో గొడవకు దిగింది. ఆ భూమిలో కనీసం రెండు ఎకరాలైనా తనకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆగ్రహంతో అత్తను గట్టిగా నెట్టేసింది. దీంతో కిందపడిపోయిన వృద్ధురాలు తిరిగి లేచేందుకు ప్రయత్నించగా.. కోడలు మాధవి వెనుక నుంచి వెళ్లి ఆమెను మంచం మీదకు తోసేసి, కిరాతకంగా గొంతు నులిమి హత్య చేసింది. అనంతరం మంచం పైనుంచి కిందపడి చనిపోయిందని బంధువులను నమ్మించే ప్రయత్నం చేసింది.

**- స్నానం చేయిస్తుండగా బయటపడ్డ నిజం..**

మరుసటి రోజు (ఏప్రిల్ 28న) అంత్యక్రియల నిమిత్తం బంధువులు, కూతురు శోభ కలిసి మృతదేహానికి స్నానం చేయిస్తున్న సమయంలో మెడపై తీవ్రమైన గాయాలు ఉండటాన్ని గమనించారు. వెంటనే అప్రమత్తమైన కూతురు శోభ పోలీసులకు ఫిర్యాదు చేయగా, తుంగతుర్తి పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

- లోతైన విచారణలో కోడలు మాధవి ఆస్తి కోసం అత్తను హత్య చేసినట్లు నిర్ధారణ కావడంతో బుధవారం (జులై 15న) నిందితురాలిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుంచి ఒక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని, కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

**నిందితురాలి వివరాలు:**

- పేరు: కోణతం మాధవి (50)

# ఐక్యతకు సరికొత్త వేదిక

**- తెలంగాణలోనే అతిపెద్ద విద్యుత్ రంగ కుటుంబ మహోత్సవం "టాంబోలా హంగామా - 2026"**

**-వ్యాపార అనుబంధాలకు నూతన దిశానిర్దేశం చేయనున్న సికింద్రాబాద్ విద్యుత్ వర్తకుల సంఘం (సెటా) మెగా ఈవెంట్!**



హైదరాబాద్ జూలై 16భారత శక్తి :ఆధునిక సమాజ గమనానికి రథసారథి అయిన విద్యుత్ రంగంలో పనిచేసే వ్యాపారవేత్తలు, నిపుణుల మధ్య సామాజిక సమతుల్యతను, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు ఒక వినూత్న చొరవ రూపుదిద్దుకుంది. సికింద్రాబాద్ విద్యుత్ వర్తకుల సంఘం (సెటా) ఆధ్వర్యంలో "టాంబోలా హంగామా -- కుటుంబ స్నేహ సమ్మేళనం 2026" పేరిట తెలంగాణాలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన భారీ కుటుంబ మహోత్సవాన్ని ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్నారు. శంషాబాద్‌లోని సిటాడెల్ కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న ఈ వేడుకకు దాదాపు 1,200 మందికి పైగా అసోసియేషన్ సభ్యులు, వారి కుటుంబ సమేతంగా హాజరుకానున్నారు.

**- మానవ సంబంధాల శాస్త్రీయ దృక్పథం**

**- ఈ సమ్మేళన విశిష్టత**

సాధారణంగా వ్యాపార రంగాలలో ఉండే తీవ్రమైన పని ఒత్తిడి, నిరంతర పోటీ వాతావరణం మానసిక అలసటకు దారితీస్తాయని సామాజిక మానసిక శాస్త్ర నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో, వ్యాపార వర్గాల మధ్య కేవలం లావాదేవీలకే పరిమితం కాకుండా.. కుటుంబాల మధ్య బలమైన స్నేహ బంధాలను పెంపొందించడం ద్వారా వృత్తిపరమైన ఉత్పాదకత మరింత పెరుగుతుందని శాస్త్రీయ అధ్యయనాలు నిరూపిస్తున్నాయి. ఈ సూత్రాన్ని ఆధారం చేసుకుని, వ్యాపార ఐక్యతతో పాటు మానసిక ప్రశాంతతను అందించడమే ఈ సమ్మేళనం ప్రధాన లక్ష్యం.

**- ఆకర్షణీయ కార్యక్రమాల సమాహారం**

సెటా చరిత్రలోనే తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ మహా సమ్మేళనంలో పలు వినోదాత్మక, వైజ్ఞానిక కార్యక్రమాలను పొందుపరిచారు:

- **గ్రాండ్ టాంబోలా (అదృష్టాన్వేషణ క్రీడ):** ఆకర్షణీయమైన బహుమతులతో కూడిన ఈ క్రీడ సభికులలో సరికొత్త ఉత్సాహాన్ని నింపనుంది.
- **కళా సాంస్కృతిక ప్రదర్శనలు:** సంప్రదాయ, ఆధునిక శైలుల కలబోతగా సాగే నృత్యాలు, సంగీత విభావరి.
- **వస్త్రాలంకరణ ప్రదర్శన (ఫ్యాషన్ షో):** కుటుంబ సభ్యుల ప్రతిభను చాటేలా ప్రత్యేక వస్త్రాలంకరణ పోటీలు.
- **సజీవ నృత్య ప్రదర్శనలు (లైవ్ డ్యాన్స్):** ఆహూతులను అలరించేందుకు ప్రత్యేక కళాకారులచే సాంస్కృతిక ప్రదర్శనలు.
- **పరిశ్రమల అనుసంధానం (నెట్‌వర్కింగ్):** వ్యాపార రంగానికి చెందిన సభ్యులు తమ ఆలోచనలను పంచుకోవడానికి నూతన అవకాశాల వేదిక.
- **సహజ రుచులతో కూడిన విందు:** ఆరోగ్యకరమైన, రుచికరమైన సాంప్రదాయ విందు ఏర్పాటు.

"టాంబోలా హంగామా 2026 అనేది కేవలం ఒక వినోద కార్యక్రమం మాత్రమే కాదు.. ఇది మన విద్యుత్ రంగ కుటుంబాల మధ్య ఐక్యత, ఆత్మీయతలను చాటిచెప్పే ఒక గొప్ప వేదిక. పరస్పర సహకారంతోనే వ్యాపార పురోగతి సాధ్యమవుతుందని మేము విశ్వసిస్తున్నాము."
సురేష్ సురానా, అధ్యక్షులు, సెటా.

**- సంఘటిత శక్తితోనే అభ్యుదయం**

ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సభ్యులు, ప్రాయోజకులు (స్పాన్సర్లు) ఎంతో చొరవ చూపారని సెటా కార్యదర్శి సుధీర్ కోఠారి స్పష్టం చేశారు. ప్రతి సభ్యుడు తమ కుటుంబ సమేతంగా ఈ చారిత్రాత్మక వేడుకలో పాల్గొని విజయవంతం చేయాలని కోశాధికారి సిద్ధార్థ్ కేవల్‌రమాని పిలుపునిచ్చారు.

ఈ మహాసభకు దేశీయ ప్రముఖ విద్యుత్ ఉత్పత్తి సంస్థ "పాలీక్యాబ్" ప్రధాన ప్రాయోజకురాలిగా వ్యవహరిస్తోంది. వీరికి తోడుగా పలువురు స్వర్ణ, రజత శ్రేణి భాగస్వామ్య సంస్థలు తమ మద్దతును ప్రకటించాయి. తెలంగాణ విద్యుత్ వ్యాపార ప్రగతిలో ఈ సమ్మేళనం ఒక నూతన అధ్యాయాన్ని లిఖించబోతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# బడంగ్‌పేట్‌లో వైభవంగా జగన్నాథ రథయాత్ర

**శ్రీ సాయి బాలాజీ ఫేస్-2 కమ్యూనిటీ హాల్‌లో ఆధ్యాత్మిక శోభ**





బడంగ్‌పేట్: జులై 16 భారత శక్తి మహేశ్వరం నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ పరిధిలో గల బడంగ్‌పేట్ శ్రీ సాయి బాలాజీ ఫేస్-2 కమ్యూనిటీ హాల్‌లో జగన్నాథ రథయాత్ర వైభవంగా ప్రారంభమైంది. శ్రీశ్రీ చైతన్య నితాయ్ జగన్నాథ్ మందిర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొని రథయాత్రను ప్రారంభించారు.

**- కోలాహలంగా సాగిన రథోత్సవం**

సాయి బాలాజీ కాలనీ నుండి ప్రారంభమైన ఈ రథయాత్ర గాయత్రి హిల్స్, బడంగ్‌పేట్ - బాలాపూర్ మెయిన్ రోడ్డు, శ్రీ విద్యా టౌన్ షిప్ మీదుగా సాయి బాలాజీ ఫేస్-1 వరకు సాగింది. భక్తుల కోలాహలం, హరినామ స్మరణల మధ్య రథం ముందుకు కదిలింది.

**- భక్తుల విశేష స్పందన**

ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో శ్లోక ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ జైపాల్ రెడ్డి, ఆధ్యాత్మిక గురువు చంద్ర దాస్ సహా స్థానిక కాలనీ వాసులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జగన్నాథుని రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడటంతో బడంగ్‌పేట్ పరిసర ప్రాంతాలు భక్తి శ్రద్ధలతో మురిసిపోయాయి.

# బాధితురాలికి సీఎం రిలీఫ్ ఫండ్ అందజేసిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



ఎల్బీనగర్, జూలై 16 (భారత శక్తి): గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని తిరుమల నగర్ నందు నివాసం ఉండే మంజుల వెన్నుముక సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో వారి యొక్క కుటుంబ సభ్యులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించిన సుధీర్ రెడ్డి వారి చికిత్సకు అవసరమైన వివరాలను ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా దరఖాస్తు చేయించారు. దానికి గాను రూ.2 లక్షల ఎల్.ఓ.సీ. (రాజా) మంజూరు కాగా, ఆ చెక్కును బాధితురాలు అన్న రాజుకి అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజలకు సేవ చేయడం తమకు ఎంతో సంతృప్తిని ఇస్తుందని తెలిపారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక మంది పేద కుటుంబాలకు సహాయం చేసే అవకాశం లభించిందన్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, తమ అక్క ఆరోగ్య సమస్య విషయంలో సుధీర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సహాయం చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. మా అక్క చికిత్స కోసం చెక్కు అందించడంలో ఆయన చూపిన మద్దతు జీవితాంతం మరువలేమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, ముద్ద కళ్యాణ్,ప్రదీప్, యాద శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో అశాంతిని సృష్టించే వారిని తరిమి కొట్టాలి

**- బద్వేలు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి**



**బద్వేలు(భారత శక్తి)** అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ సమాజంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నించే వారిని ప్రజలే తరిమి కొట్టాలని బద్వేలు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు గురువారం బద్వేల్ లో ఆయన పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నప్పటికీ, వైసీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సమాజంలో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసే కుట్రపూరిత శక్తులకు వారు అండగా నిలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తపరిచారు. వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి తో పాటు ఆపార్టీ నాయకులు పదేపదే అధికార పార్టీ నేతలపై బురద చల్లుతూ దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు హిందూ దేవతలు, సంప్రదాయాలపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘవిద్రోహ శక్తులకు వత్తాసు పలికే ఇలాంటి నేతలకు తగిన బుద్ధి చెప్పకపోతే మళ్లీ మళ్లీ నిరాధారమైన ఆరోపణలను చేస్తూనే ఉంటారని తెలియజేశారు. అధికారంలో ఉన్న తాము ఏదైనా చేస్తే... అధికారాన్ని అడ్డుపెట్టుకొని చేశారని అబాండాలు వేస్తారన్నారు.

అదే ప్రజలు ఒకసారి తిరగబడితే మళ్లీ మన జోలికి రారని సూచించారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేసే వారికి మీరే తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ప్రజల ఆదరణ, ఆశీస్సులే కూటమి ప్రభుత్వానికి అతిపెద్ద బలమని, ప్రజల మద్దతు ఉన్నంతకాలం రాష్ట్ర అభివృద్ధిని ఏ శక్తి అడ్డుకోలేదని స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థులను అన్ని స్థానాల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. రైతుల హక్కులను హరించే విధంగా వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనే చీకటి చట్టాన్ని చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేయడం జరిగిందన్నారు. భూ యజమానికి తన సొంత పొలంపై సర్వ హక్కులు కల్పిస్తూ మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రైతుల ఫోటోతో పాటు రాజముద్ర కలిగిన ఈ పాస్‌పుస్తకాలు భూ యాజమాన్యానికి మరింత భరోసా కల్పిస్తాయని ఆయన పేర్కొన్నారు.

## ప్రాణాపాయంలో ఉన్న వ్యక్తిని కాపాడిన మాజీ కౌన్సిలర్ సురేంద్ర

**- సమయస్ఫూర్తితో ప్రాణం కాపాడిన వైనం..**



**నందికొట్కూర్ (భారత శక్తి)** బ్రాహ్మణకొట్టుకూరు బొల్లవరం జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని నందికొట్కూరు మాజీ కౌన్సిలర్ సురేంద్ర అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. కర్నూలు నుంచి మిడ్తూరుకు బైక్‌పై ప్రయాణిస్తున్న డాక్టర్ ఫారుక్ ప్రమాదవశాత్తు అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై రక్తస్రావంతో అక్కడే పడి ఉన్నారు.వెనుకనే కారులో వస్తున్న మాజీ కౌన్సిలర్ సురేంద్ర ప్రమాదాన్ని గమనించి వెంటనే స్పందించారు. గాయపడిన డాక్టర్ ఫారుక్ ను స్వయంగా ఎత్తుకుని తన కారులో ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. సమయానికి వైద్యం అందడంతో ప్రమాద తీవ్రత మరింత పెరగకుండా నివారించగలిగారు.ఈ విషయం తెలుసుకున్న బాధితుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రికి చేరుకుని సురేంద్ర చేసిన సేవాభావాన్ని కొనియాడారు. ఆపదలో ఉన్న వ్యక్తికి సకాలంలో సహాయం చేసి ప్రాణరక్షకుడిగా నిలిచిన సురేంద్రపై స్థానికులు ప్రశంసల వర్షం కురిపించారు.

## బొప్పాయి అమ్మకాలలో దళారి వ్యవస్థను రద్దు చేయాలి



**చిట్వేలి(భారత శక్తి)** బొప్పాయి అధికంగా పండించే రైల్వే కోడూరు నియోజకవర్గంలో బొప్పాయి అమ్మకాలలో దళారీ వ్యవస్థను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హేమలత కోరారు. చిట్వేలి మండలం చెర్లోపల్లి లో బొప్పాయి, మామిడి పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు కష్టనష్టాలకు ఓర్చి బొప్పాయి పంటను పండిస్తున్నారని అన్నారు. నకిలీ విత్తనాలతో దళారీలు రైతులను బోల్తా కొట్టించి వారి పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు.

ఢిల్లీ, ముంబాయి, ఇతర ప్రాంతాల నుండి వచ్చే బొప్పాయి వ్యాపారులను నేరుగా రైతుల వద్దకు వెళ్లనీయకుండా కోడూరు లోనే వారికి సకల సదుపాయాలు దళారీలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నేరుగా దళారీలే తమకు నచ్చిన రేటుకు బొప్పాయిని కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. నకిలీ విత్తనాలతో సగం బొప్పాయి చెట్లు కాయకపోవడంతో దిగుబడి రాకపోవడంతో రైతులు సాగు కోసం పెట్టిన ఖర్చుల కోసం నానా అగచాట్లు పడుతున్నారని తెలిపారు. వారం క్రితం కిలో 25 రూపాయలు అమ్మిన బొప్పాయి ప్రస్తుతం దళారీలు రూ.18 కి తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ జోక్యం చేసుకొని బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సభ్యులు పందికాళ్ళ మణి పాల్గొన్నారు.

## దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలు



**శ్రీశైలం(భారత శక్తి)** లోకకల్యాణంకోసం దేవస్థానం ఈ రోజు ఆలయప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న శ్రీ దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలను నిర్వహించింది.ప్రతి గురు వారం దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ఈ పూజాదికార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించబడింది.ఆ తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. లోకోద్ధరణకోసమై బ్రహ్మ,విష్ణు,మహేశ్వరులు ఒకే స్వరూపములో దత్తాత్రేయునిగా అవతరించారు. అందుకే త్రిమూర్తి స్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్ధుడు.కాగా శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల వారికి ఎంతో దగ్గర సంబంధం ఉంది. ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద దత్తాత్రేయులవారు తపస్సు చేశారని ప్రతీతి. అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షమని పేరు. కాగా దత్తాత్రేయస్వామివారు కలియుగంలో గోదావరితీరాన పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా జన్మించారు. వీరు ఒకసారి శ్రీశైలక్షేత్రంలోనే చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లుగా గురుచరిత్రలో చెప్పబడింది. కాగా శ్రీపాదవల్లభుడు తమ శిష్యులకు ఆయా తీర్థక్షేత్రాల మహిమావిశేషాలను పేర్కొనే సందర్భంలో కూడా శ్రీశైలాన్ని పలుసార్లు ప్రస్తావించారు.శ్రీపాదవల్లభుల జన్మ తరువాత మహారాష్ట్రలోని కరంజినగరములో నృసింహసరస్వతి స్వామిగా దత్తాత్రేయస్వామివారు జన్మించారు.వీరు ఒకసారి మహాశివరాత్రి రోజున శ్రీశైలమల్లికార్జునుని సేవించినట్లుగా కూడా గురుచరిత్ర చెబుతోంది.

నృసింహసరస్వతి వారు తమ అవతార సమాప్తిని శ్రీశైలంలోని పాతాళగంగలోనే చేశారు.కలియుగ ప్రభావం రోజు రోజుకు ఎక్కువకావడముతో, నృసింహసరస్వతీస్వామి అదృశ్య రూపములో ఉండి తన భక్తులను రక్షించాలని నిర్ణయించారు. దాంతో భౌతికదేహాన్ని త్యజించేందుకు నలుగురు శిష్యులతో కలిసి శ్రీశైలానికి వచ్చారు. శ్రీశైలంలోని కదళీవనం దగ్గర తమ శిష్యులు చూస్తుండగానే నృసింహసరస్వతిస్వామివారు అరటి ఆకులతో చేసిన ఒక ఆసనంపై కూర్చొని, కృష్ణానదిలో ప్రవేశించి, కొంతదూరం ఆ అరటిఆకులపైనే పయనిస్తూ, అదృశ్యమైనట్లు గురుచరిత్ర చెబుతోంది.

## హిందూ విద్యార్థితో కల్మా చదవాలని ఒత్తిడి

**- సైదాబాద్లో ఉద్రిక్తత**

**హైదరాబాద్(భారత శక్తి)** హైదరాబాద్:- పాతబస్తీ పరిధిలోని సైదాబాద్లో ఉన్న సక్సెస్ స్కూల్లో 2వ తరగతి చదువుతున్న ఓ హిందూ విద్యార్థితో కల్మా చదవాలని పాఠశాల యాజమాన్యం ఆదేశించిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. తమ పిల్లల మత విశ్వాసాలకు విరుద్ధంగా ఎలాంటి ప్రార్థనలు లేదా మతపరమైన పాఠాలు బలవంతంగా చెప్పించడం సరైంది కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలోని సిబ్బంది తీరు పట్ల విద్యార్థి కన్నీరు పెడుతు ఇంటికి రావడంతో తల్లితండ్రులు గమనించి అడగగా అసలు విషయం వెలుగులోకి రావడం జరిగింది.. ఈ ఘటనపై సంబంధిత అధికారులతో విచారణ జరిపించి, ఆరోపణలు నిజమైతే పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.మరోవైపు. హిందూ సంఘాలు స్కూలు ముందు అందోళన చెపట్టాయి. స్కూలు అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేసాయి. పరిస్థితులు ఉద్రిక్తతంగా మారడంతో పోలీసులు అందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు.

## వెల్కటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్

**సిద్దిపేట(భారత శక్తి)** ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ప్రతి రోజు క్రమం తప్పకుండా చదవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి విద్యార్థులకు సూచించారు. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్పాఠశాల ప్రాంగణం మొత్తం కలియతిరిగారు. మైదానంలో చెట్లు ప్రశాంతమైన వాతావరణం బాగుందని ప్రిన్సిపల్ ను అభినందించారు.పదవ తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అన్ని సబ్జెక్ట్స్ తరగతులు అవుతున్నాయా, మధ్యాహ్న భోజనం బాగుందా అని అడగ్గా అన్ని తరగతులు బాగానే అవుతున్నాయని భోజనం బాగుందని విద్యార్థులు కలెక్టర్ కి తెలిపారు.గోడపైన రాయించిన తెలుగు వ్యాకరణం, ఇంగ్లీష్ టెన్సెస్, గణిత సుత్రాలు, సైన్స్ సుత్రాలను చూపిస్తూ విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. గోడపైన రాసినవి రోజు చూస్తుంటే వాటిని ఎప్పటికీ మర్చిపోకుండా జ్ఞాపకం ఉంటాయని, రోజు ఒకసారి వాటిని తప్పనిసరిగా చదవాలని తెలిపారు.సబ్జెక్టులో ఏదైతే రాదన్న టాపిక్ పలు మార్లు చదివితే రానీదంటూ ఏదీ ఉండదని, సమయాన్ని వృధా చేయవద్దని పుస్తక జ్ఞానంతో పాటు రోజు న్యూస్ పేపర్ చదవాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను పెండింగ్ ఉంచకుండా అదే రోజు చదవాలని, మంచి క్రమశిక్షణతో కూడిన అలవాట్లను అలవర్చుకోవాలని, సబ్జెక్టుకు సంబంధించి ఏలాంటి డౌట్స్ ఉన్నా ఉపాధ్యాయుల దృష్టికి తేవాలని, భయపడుతూ, సార్ ఏమంటారో, అని వెనకడుగు వేయకూడదని, ధైర్యంగా తెలపాలని జీవితంలో ఏ రంగం ఎంచుకున్న దృఢంగా నిలబడినాలని తెలిపారు.పదవ తరగతి అనేది జీవితానికి ఒక పునాది వంటిదని ఇక్కడ బాగా చదివి అందరూ ఫస్ట్ క్లాస్ లో ఉత్తీర్ణులు కావాలని, మీకు మీ పాఠశాలకు మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.

## చెరువును కబళిస్తున్న మట్టి మాఫియా...

**- నిబంధనలకు నీళ్లొదిలిన అధికారులు**

**- తూర్పు గోదావరి జిల్లా, గోకవరం మండలం,**



**(భారత శక్తి)** ప్రభుత్వ ఆస్తిపై కన్నేసిన మట్టి మాఫియా ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. నిబంధనలను బేఖాతరు చేసి కొత్తపల్లి గ్రామం చివర ఉన్న ప్రభుత్వ చెరువులో యథేచ్ఛగా ఏఅఃలతో మట్టి తవ్వకాలు జరుపుతున్న దృశ్యాలు స్థానికుల కెమెరాకు చిక్కాయి.గత కొన్ని రోజులుగా తెల్లవారుజామున, సాయంత్రం వేళల్లో ఏఅః, ట్రాక్టర్లతో వచ్చి చెరువు మట్టిని తవ్వి ట్రాలీలకు ఎక్కించి తరలిస్తున్నారు. ఫోటోల్లో కనిపిస్తున్నట్లుగా యంత్రాలతో పెద్ద పెద్ద గుంతలు తీసి మట్టిని అమ్ముకుంటున్నారు.పర్యావరణానికి, రైతాంగానికి పెను ప్రమాదంచెరువు మట్టిని ఇష్టానుసారం తవ్వేయడంతో నీటి నిల్వ సామర్థ్యం పూర్తిగా దెబ్బతింటుంది. దీనివల్ల రాబోయే వర్షాకాలంలో కొత్తపల్లి, చుట్టుపక్కల గ్రామాల్లోని వేలాది ఎకరాల ఆయకట్టుకు నీరు అందకుండా పోయే ప్రమాదం ఉంది. అంతేకాదు, భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి సమస్య కూడా తలెత్తనుంది."చెరువే మా ప్రాణం. దాన్ని నాశనం చేస్తే మా బతుకులు ఏమైపోవాలి? ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. రాజకీయ నాయకుల అండతోనే ఈ అక్రమాలు జరుగుతున్నాయి సమాచారంఅధికారుల నిర్లక్ష్యమే కారణమామట్టి అక్రమ తరలింపుపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. గోకవరం రెవెన్యూ, మైన్స్, ఇరిగేషన్ శాఖ అధికారుల అలసత్వం వల్లే ఇలాంటి అక్రమాలకు ఆస్కారం ఏర్పడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.అక్రమార్కులపై వెంటనే కేసులు నమోదు చేసి, ఉపయోగిస్తున్న ఏఅః, వాహనాలను సీజ్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. చెరువును యథాపూర్వ స్థితికి తీసుకురావాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పరువురు కోరుతున్నారు

## ఫిషింగ్ హార్బర్లో బోటు ప్రమాదం

**విశాఖపట్నం(భారత శక్తి)** విశాఖ ఫిషింగ్ హార్బర్లో అలల ఉద్ధృతికి బోటు బోల్తాపడి ఏడుగురు మత్స్యకారులు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనలో తాతారావు, ఆకాష్ తీవ్రంగా గాయపడి కేజీహెచ్లో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.4.5 లక్షల ఆస్తి నష్టం జరిగింది. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత మత్స్యకారులు వేడుకుంటున్నారు.

## నిలుచున్న చోటే ప్రసవం

**- కిందపడిన శిశువుకు గాయాలు**

**భద్రాద్రి(భారత శక్తి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాతా శిశు కేంద్రంలో దారుణం చోటు చేసుకుంది. పురిటి నొప్పులతో వచ్చిన మహిళను అక్కడి వైద్యులు, సిబ్బంది పట్టించుకోలేదు. దాంతో గర్భిణి నిల్చున్న చోటే బిడ్డకు జన్మనిచ్చింది. శిశువు కిందపడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. బిడ్డ పుట్టాక కూడా 10 నిమిషాల వరకు వైద్యులు రాలేదని కుటుంబ సభ్యుల ఆరోపణ. ఘటన చూసి ఇతర రోగులు భయాందోళనకు గురైయారు. పోలీసులు విచారణ చేపట్టారు.

## ఎస్ఐఆర్ గడువు పొడగింపును వినియోగించుకోవాలి



**(భారత శక్తి)**ఆన్ లైన్ దరఖాస్తు పూర్తి చేస్తే ఎన్యూమరేషన్ ఫామ్ అవసరం లేదు.ఆగస్టు 3 చివరి తేదీ... అక్టోబర్ 12న తుది ఓటర్ల జాబితారాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూఎఖీ) గడువును మరో పదిరోజులు పొడగించటంపై మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జూలై 24 నుంచి ఆగస్టు 3 వరకు గడువును పొడగించటం వల్ల ప్రతీ ఓటర్ తమ ఓటును అప్ డేట్ చేసుకోవాలని కేఎల్ఆర్ సూచించారు. తుక్కుగూడ కార్యాలయంలో కాంగ్రెస్ నేతలతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.తప్పులు లేకుండా ఎన్యూమరేషన్ ఫామ్స్ నింపి ఃఒూలకు ఇవ్వాలని కోరారు. ఆన్ లైన్ దరఖాస్తు చేసుకున్న వారు మ్యానువల్ గా ఎన్యుమరేషన్ ఫామ్స్ నింపాల్సిన పని లేదని లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల ముసాయిదా జాబితాను ఆగస్టు 10న ప్రచురించనున్నారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించి సెప్టెంబర్ 9 వరకు సవరణలు, కొత్త దరఖాస్తులు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తి చేసి తుది జాబితాను అక్టోబర్ 12న అధికారికంగా విడుదల చేస్తారని కిచ్చెన్నగారు తెలిపారు.డిజిటలైజేషన్ ఇప్పటి వరకు 50 శాతానికి పైగా పూర్తి అయిందన్నారు. మిగతా ఓటర్లు సైతం ఎన్యూమరేషన్ ఫామ్స్ పూర్తి చేసి ఇవ్వటం, ఆన్ లైన్ దరఖాస్తులను పూర్తి చేసి ఓటును కాపాడుకోవాలని కేఎల్ఆర్ విజ్ఞప్తి చేశారు.కాంగ్రెస్ ఃఒం లు ఆగస్టు 3 వరకు అప్రమత్తంగా ఉండి ప్రజలకు, ఓటర్లకు అవగాహన కల్పించి... ఃఒూలకు సహకరించాలని లక్ష్మారెడ్డి కిచ్చెన్న సూచించారు.

## పల్నాడు జిల్లాలో ఆలయంలో చోరీ..

**- హుండీ పగలగొట్టి నగదు అపహరణ..**

**(భారత శక్తి)**నాదెండ్ల మండలం ఎండుగుంపాలెం గ్రామంలోని నూజెండ్లపల్లి అగ్రహారంలో ఉన్న శ్రీ సువర్చల సమేత ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు.స్థానిక వివరాల ప్రకారం, దుండగులు అర్ధరాత్రి సమయంలో ఆలయంలోకి ప్రవేశించి, గర్భాలయం సమీపంలో ఉన్న హుండీ తాళాన్ని ధ్వంసం చేశారు. అనంతరం హుండీని పగలగొట్టి అందులో ఉన్న నగదును అపహరించారు.నగదు తీసుకున్న అనంతరం, ఖాళీ హుండీని సమీపంలోని పొలాల్లో పడేసి పరారయ్యారు.?గురువారం ఉదయం ఆలయానికి చేరుకున్న గ్రామస్థులు హుండీ ధ్వంసమై ఉండటాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.ఘటనా స్థలానికి చేరుకున్న నాదెండ్ల పోలీసులు క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరిస్తున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తు చేపట్టి దుండగుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.ఆలయంలో చోరీ జరగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## గంజాయి రవాణాదారులపై రూరల్ పోలీసుల కఠిన చర్యలు

**- పీఐటీ ఎన్డీపీఎస్ చట్టం కింద నిందితుడి అరెస్ట్**

**చిలకలూరిపేట(భారత శక్తి):** గంజాయి రవాణాపై పల్నాడు జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, నరసరావుపేట డీఎస్పీ ఎం. హనుమంతరావు పర్యవేక్షణలో చిలకలూరిపేట రూరల్ సీఐ బి. సుబ్బానాయుడు నేతృత్వంలోని బృందం అక్రమ రవాణాదారులపై నిఘా తీవ్రతరం చేసింది. ఈ క్రమంలో, రెండు అంతకంటే ఎక్కువ కేసులు నమోదై సమాజానికి ముప్పుగా మారిన ముఠా సభ్యులను గుర్తించి, పీఐటీ ఎన్డీపీఎస్ (ఖమి ఔఆఖూ ంఃఃబి - 1988) చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటోంది. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు కి నిందితుడు ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా, గతంలో చల్లా గోపిపై చర్యలు తీసుకున్న పోలీసులు, తాజాగా కారసాని శివప్రసాద్ రెడ్డి (అలియాస్ ప్రసాదరెడ్డి) అనే గంజాయి విక్రయదారుడిని అరెస్ట్ చేశారు. ఇతనిపై నమోదైన నేర చరిత్రను పరిశీలించిన ప్రభుత్వం, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో డిటెన్షన్‌లో ఉంచాలని ఉత్తర్వులు జారీ చేసింది. జులై 15న సీఐ బి. సుబ్బానాయుడు, రూరల్ ఎస్ఐ జి. అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిందితుడిని జైలుకు తరలించారు.

## ఆ వార్తలు నిరాధారం

**- మా అబ్బాయి డ్రగ్స్ తీసుకోలేదు - అరెస్ట్ కాలేదు**

**- ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి**

**హైదరాబాద్(భారత శక్తి)** మా అబ్బాయి భరత్ రాజ్ రెడ్డి డ్రగ్స్ తీసుకున్నట్టు.. మంగళ్ హాట్ పోలీసులు అరెస్ట్ చేసినట్టు జరుగుతున్న ప్రచారం లో వాస్తవం లేదు.

మీడియాలో, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు పూర్తిగా నిరాధారం.. అవాస్తవమని ఎమ్మెల్సీ వెంకట్రాం రెడ్డి వివరణ ఇచ్చారు.

గురువారం ఉదయం మంగళ్ హాట్ పోలీసులు మా ఇంటికి వచ్చి ఒక డ్రగ్స్ కు సంబంధించి కేసు విచారణ జరుపుతున్నామని.. భరత్ రాజ్ రెడ్డి కామన్ ఫ్రెండ్స్ ఫోన్ జాబితాలో తన ఫోన్ నెంబర్ ఉండడంతో అనుమానంతో విచారించాల్సి ఉందని కోరారు. విచారణలో ఈ డ్రగ్స్ కేసు వ్యవహారానికి భరత్ రాజ్ కు ఏ సంబంధం లేదని పోలీసులు నిర్ధారించుకున్నారు. భరత్ రాజ్ కు చేసిన డ్రగ్స్ టెస్ట్ లో నెగెటీవ్ వచ్చింది. ఈ విషయంలో అనేక అవాస్తవాలు, కల్పిత సమాచారం ప్రచారంలో ఉన్నాయి. నాకుమారుడు ఎన్నడూ డ్రగ్స్ తీసుకోలేదు... ఈ కేసులో అరెస్ట్ కాలేదని అన్నారు.

## గంజాయి అక్రమ రవాణాపై అనకాపల్లి పోలీసుల ఉక్కుపాదం

**అనకాపల్లి (భారత శక్తి)**జిల్లాఅనకాపల్లి జిల్లాలో పోలీసులు భారీ గంజాయి అక్రమ రవాణా ముఠాను పట్టుకున్నారు. రావికమతం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.1.1 కోట్ల విలువైన 220 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన రెండు కార్లను సీజ్ చేసి, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. మరో ఐదుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ప్రత్యేక బృందాలు దర్యాప్తు కొనసాగిస్తున్నాయి. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను డీఎస్పీ జి.ఆర్.ఆర్. మోహన్ నగదు బహుమతులతో అభినందించారు.

## టాటా గ్రూప్ బ్రాండ్ విలువ రూ. 3.24 లక్షల కోట్లు

**ముంబై (భారత శక్తి)**భారతీయ కార్పొరేట్ రంగంలో 'టాటా' గ్రూప్ మరోసారి తన తిరుగులేని ఆధిపత్యాన్ని చాటుకుంది. ప్రముఖ బ్రాండ్ వాల్యుయేషన్ కన్సల్టెన్సీ సంస్థ 'బ్రాండ్ ఫైనాన్స్' తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం.. దేశంలోనే అత్యంత విలువైన టాప్ 100 బ్రాండ్ల జాబితాలో టాటా గ్రూప్ మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. విశేషం ఏమిటంటే ఈ జాబితాలో టాటా అగ్రస్థానంలో నిలవడం ఇది వరుసగా 10వ సారి. టాటా తరువాత ఇంకా ఏమేం సంస్థలు ఉన్నాయో చూద్దాం..ప్రస్తుతం టాటా గ్రూప్ బ్రాండ్ విలువ రూ. 3.24 లక్షల కోట్లకు (సుమారు 39 బిలియన్ డాలర్లు) చేరినట్లు 'బ్రాండ్ ఫైనాన్స్' నివేదిక వెల్లడించింది. వైవిధ్యభరితమైన వ్యాపారాలు, నమ్మకమైన సేవలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న విస్తృత టాటా బ్రాండ్ విలువను ఇంతలా పెంచడానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.

**టాప్ 5 లో నిలిచిన ఇతర దిగ్గజాలు :** ఈ జాబితాలో టాటా తర్వాత ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. ఇన్ఫోసిస్ బ్రాండ్ విలువ రూ. 1.58 లక్షల కోట్లుగా నమోదైంది. ఆ తర్వాతి స్థానాల్లో దేశీయ బ్యాంకింగ్, బీమా రంగానికి చెందిన ప్రముఖ సంస్థలు నిలిచాయి. రెండో స్థానం: ఇన్ఫోసిస్ (రూ. 1.58 లక్షల కోట్లు) , మూడో స్థానం: ఎల్ఐసీ ఒఎఐ (రూ. 1.47 లక్షల కోట్లు), నాలుగో స్థానం: హెచ్డీఎఫ్సీ బ్యాంక్ ఐదో స్థానం: రిలయన్స్ ఇండస్ట్రీస్ భారత ఆర్థిక వ్యవస్థ జోరుకు నిదర్శనం ఈ నివేదిక ప్రకారం, భారతదేశంలోని టాప్ 100 బ్రాండ్ల మొత్తం సంయుక్త విలువ రూ. 24.34 లక్షల కోట్లకు చేరింది. ఇది భారతీయ కంపెనీల బ్రాండ్ ఇమేజ్ అంతర్జాతీయ స్థాయిలో ఎంతలా బలపడుతుందో తెలియజేస్తోంది. బ్యాంకింగ్, ఐటీ, టెలికాం, ప్యాకేజ్డ్ గూడ్స్ వంటి రంగాలు ఈ వృద్ధిలో కీలక పాత్ర పోషించాయి. కొన్ని ఏళ్లుగా ఎదురవుతున్న ప్రపంచ ఆర్థిక సవాళ్లను తట్టుకుని మరీ భారతీయ బ్రాండ్లు ఇంతటి వృద్ధిని నమోదు చేయడం విశేషం. ముఖ్యంగా డిజిటలైజేషన్, కస్టమర్ నమ్మకాన్ని గెలుచుకోవడం వల్లే ఈ బ్రాండ్ల విలువ భారీగా పెరిగినట్లు విశ్లేషకులు చెబుతున్నారు.

## కేంద్రంతో సయోధ్యకి రేవంత్

**హైదరాబాద్,(భారత శక్తి)** రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనేది పాత సామెత. కానీ, కేంద్రంలో ఒక పార్టీ, రాష్ట్రంలో మరో పార్టీ అధికారంలో ఉంటే.. నిత్యం కత్తులు దూసుకోవడం, సవాళ్లు విసురుకోవడం భారత రాజకీయాల్లో మనం తరచూ చూసే నిత్యకృత్యం. ముఖ్యంగా కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత, కాంగ్రెస్ లేదా ఇతర ప్రతిపక్షాలు పాలించే రాష్ట్రాల మధ్య నిరంతరం ఘర్షణ వాతావరణమే కనిపించేది. గతంలో తెలంగాణలోనూ ఇదే తరహా 'ఢీ అంటే ఢీ' అనే రాజకీయాలు నడిచాయి. అయితే, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పాత పంథాకు పూర్తిగా స్వస్తి పలికింది. కేంద్రంతో సఖ్యతగా ఉంటూనే రాష్ట్ర ప్రయోజనాలను సాధించుకోవచ్చనే సరికొత్త రాజకీయ ఒరవడికి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు.ఎన్నికల రణక్షేత్రంలో విమర్శలు, ప్రతివిమర్శలు సహజం. కానీ, ఎన్నికలు ముగిసి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా అదే రాజకీయ వైరాన్ని కొనసాగిస్తే నష్టపోయేది రాష్ట్ర అభివృద్ధి. ప్రజలెన్నిన రేవంత్ సర్కార్ బలంగా నమ్ముతోంది. అందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో నిత్యం తలపడే ధోరణిని పక్కనబెట్టి, సామరస్య పూర్వక వైఖరిని అవలంబిస్తోంది. రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారు.ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులను రేవంత్ రెడ్డి వరుసగా కలుస్తున్నారు. రాష్ట్రానికి రావలసిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టులు, విభజన చట్టం హామీలను వారికి వివరంగా వివరిస్తున్నారు. కేంద్రం నుంచి ఆమోద ముద్ర పొందేలా చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. ఇందుకోసం అవసరమైతే రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలను సైతం కలుపుకుంటూ, వారి ద్వారా కూడా ఒత్తిడి తెచ్చే వ్యూహాత్మక పంథాను అనుసరిస్తున్నారు.ఈ క్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీని రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో 'పెద్దన్న' అని సంబోధించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ముఖ్యమంత్రి అయ్యి ఉండి మోడీని అలా కొనియాడడం వెనుక రాజకీయ వ్యూహాలు ఉన్నాయనే ప్రచారం జరిగింది. అయితే దీనిపై రేవంత్ రెడ్డి అత్యంత స్పష్టతతో సమాధానమిచ్చారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకూ ప్రధానే పెద్ద దిక్కు కాబట్టి, ఆ కోణంలోనే తాను 'పెద్దన్న' అన్నానని, అంతేకానీ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో తానేనాడూ రాజీ పడబోనని కుండబద్దలు కొట్టారు. అవసరమైనప్పుడు హక్కుల కోసం కొట్లాడతామని, మిగిలిన సమయంలో అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు.మరోవైపు రేవంత్ రెడ్డి పనితీరు, ఆయన అనుసరిస్తున్న విధానాల పట్ల ప్రధాని మోడీ కూడా సానుకూల వైఖరితోనే ఉన్నట్లు కనిపిస్తోంది. "తనతో కలిసి పనిచేసి చూడు.. రాష్ట్రాన్ని ఎక్కడికో తీసుకెళ్తాం" అంటూ మోడీ బహిరంగంగానే రేవంత్‌కు పిలుపునివ్వడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మోడీ ఇలా రేవంత్‌కు గాలం వేస్తున్నారనే ప్రచారాలు సాగినా, వాటన్నింటినీ రేవంత్ రెడ్డి తనదైన శైలిలో తిప్పికొట్టారు. తన దృష్టంతా కేవలం తెలంగాణ అభివృద్ధి పైనేనని తేల్చిచెప్పారు.రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఘర్షణ వాతావరణాన్ని పక్కన పెట్టడం, దానికి తగ్గట్టే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా తెలంగాణకు అవసరమైన సహాయసహకారాలు అందించడం ఒక సానుకూల పరిణామం. కేంద్ర-రాష్ట్రాల మధ్య ఉండాల్సిన ఫెడరల్ స్ఫూర్తికి ఇది ఒక కొత్త నిర్వచనంగా నిలుస్తోంది.ఎన్నికల సమయంలో ఎంతటి రాజకీయ శత్రుత్వమైనా ఉండొచ్చు, కానీ పాలనలోకి వచ్చేసరికి ప్రజల బాగు కోసం కలిసి నడవాలనే రేవంత్ రెడ్డి సూత్రం తెలంగాణ ప్రయోజనాలకు ఎంతవరకు లాభిస్తుందో చూడాలి. ఏదేమైనా, కేంద్రంతో నిత్యం యుద్ధం చేసే పాత పంథాకు భిన్నంగా రేవంత్ రెడ్డి తెచ్చిన ఈ సరికొత్త రాజకీయ ఒరవడి ప్రస్తుతానికి తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ఆసక్తికరమైన, లోతైన చర్చకు దారితీస్తోంది.

# అమాత్య.. భాగ్యమెప్పుడు

**హైదరాబాద్,(భారత శక్తి)** సినిమాల్లో లేడీ అమితాబ్‌గా, రాజకీయాల్లో ఫైర్‌బ్రాండ్‌గా పేరొందిన విజయశాంతి శైలి ఎప్పుడూ విలక్షణమే. ఏ పార్టీలో ఉన్నా తనదైన ముద్ర వేయాలనుకునే ఆమె, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ఉంటూ సొంత ప్రభుత్వంపైనే విమర్శల బాణాలు ఎక్కుపెట్టడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తాజాగా షాబాద్ మర్డర్ల కేసులో పోలీసుల తీరును, రాష్ట్ర ప్రభుత్వ స్పందనను ఆమె బహిరంగంగా తప్పుబట్టడం హస్తం పార్టీని తీవ్ర ఇరకాటంలోకి నెట్టింది. అయితే, ఈ విమర్శల వెనుక శాంతిభద్రతల పరిరక్షణ కంటే, ఆమె వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలే ఎక్కువగా ఉన్నాయనే విమర్శలు స్వపక్షం నుంచే బలంగా వినిపిస్తున్నాయి.విజయశాంతికి ఉన్న మాస్ ఇమేజ్, కరిష్మాను చూసి అన్ని రాజకీయ పార్టీలూ ఆమెను సాదరంగా ఆహ్వానిస్తూ ఉంటాయనేది బహిరంగ రహస్యం. కానీ, ఆమె ట్రాక్ రికార్డును పరిశీలిస్తే క్షేత్రస్థాయి రాజకీయాలకు ఆమె చాలా కాలంగా దూరంగా ఉంటున్నారనే వాస్తవం స్పష్టమవుతుంది. ప్రజల పక్షాన నిలబడి రోడ్లపైకి వచ్చి పోరాడిన దాఖలాలు, లేదా పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో పర్యటించిన సందర్భాలు ఇటీవలి కాలంలో ఎక్కడా కనిపించలేదు.కేవలం సోషల్ మీడియా వేదికగా అడపాదడపా పోస్టులు పెట్టడానికే ఆమె పరిమితమయ్యారనే విమర్శలు ఉన్నాయి.

ఆ పోస్టులు సైతం పార్టీకి మైలేజ్ తెచ్చేలా కాకుండా, ప్రభుత్వాన్ని డిఫెన్స్‌లో పడేసేలా ఉండటం గమనార్హం. కేవలం సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పిస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమించకుండా పదవులు ఆశించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు సొంత పార్టీ శ్రేణుల నుంచే వ్యక్తమవుతున్నాయి.తాజా పరిణామాల వెనుక విజయశాంతి సుదీర్ఘ నిరీక్షణ, అసంతృప్తి దాగి ఉన్నాయని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తనకు మంత్రి పదవి దక్కాలని ఆమె ఎంతో కాలంగా గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. అయితే, సామాజిక సమీకరణాలు, క్షేత్రస్థాయిలో పార్టీకి చేసిన సేవలను పరిగణనలోకి తీసుకునే అధిష్ఠానం ఆమెకు ఆ అవకాశం కల్పించలేకపోయింది.దీంతో ఎలాగైనా మంత్రి పదవి దక్కించుకోవాలనే ఏకైక లక్ష్యంతోనే విజయశాంతి వ్యూహాత్మకంగా అటు ప్రభుత్వాన్ని, ఇటు పార్టీని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారని పార్టీ అంతర్గత వర్గాలు భావిస్తున్నాయి. సంక్షోభ సమయాల్లో ప్రభుత్వానికి అండగా నిలవాల్సింది పోయి, ప్రతిపక్షాలకు ఆయుధాలు ఇచ్చేలా సొంత పార్టీ నేతే వ్యవహరించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇలాంటి ఒత్తిడి రాజకీయాల ద్వారా అధిష్ఠానాన్ని బెదిరించి తన పంతం నెరవేర్చుకోవాలని ఆమె చూస్తున్నట్లు స్పష్టమవుతోంది.గతంలో పలు పార్టీలు విజయశాంతి కరిష్మాను చూసి ఆమె ఒత్తిళ్లకు లొంగి ఉండవచ్చు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీలో ఇలాంటి బెదిరింపు రాజకీయాలు సాగవని పార్టీ సీనియర్ నాయకులు అంతర్గత చర్చల్లో స్పష్టం చేస్తున్నారు. 24 గంటలూ ప్రజల్లో ఉంటూ, పార్టీ లైన్ దాటకుండా పనిచేసే వారికే పదవులు వస్తాయనే సంకేతాన్ని అధిష్ఠానం ఇప్పటికే బలంగా పంపింది.తాజా పరిణామాలపై కాంగ్రెస్ పెద్దలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, విజయశాంతికి గట్టిగా లైన్ క్లియర్ చేయాలని నిశ్చయించుకున్నట్టు తెలుస్తోంది. సొంత పార్టీని ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని, పనిచేస్తేనే పదవులు వస్తాయనే చేదు నిజాన్ని ఆమెకు స్పష్టం చేసేందుకు అధిష్ఠానం సిద్ధమవుతోంది. మరి ఈ హెచ్చరికల తర్వాత విజయశాంతి తన రూట్ మారుస్తారా, లేక తన పంథాలోనే ముందుకు సాగుతారా అనేది వేచి చూడాలి.

# జర్నలిస్టుల సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు,
- ప్రజాస్వామ్య రక్షణలో పాత్ర కీలకం.. సంక్షేమానికి పెద్దపీట
- మంత్రితో భేటీ అయిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ప్రతినిధులు.
- "టీడబ్ల్యూజేఎఫ్ మీడియా డైరీ" ఆవిష్కరణ.. ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలు.



హైదరాబాద్ జులై 16 భారత శక్తి, సమాజ గమనానికి దిక్సూచిగా, ప్రజాస్వామ్య పరిరక్షణలో నాల్గవ స్తంభంగా నిలిచే జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. సమాచార ప్రసార రంగంలో పనిచేసే శ్రామికుల వృత్తిపరమైన భద్రత, సామాజిక సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కార్యాచరణను రూపొందిస్తోందని ఆయన పేర్కొన్నారు.గురువారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంత్రి శ్రీధర్ బాబును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకుంది. ఈ సందర్భంగా ఫెడరేషన్ రూపొందించిన "టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధుల సమాచార గ్రంథాన్ని" (మీడియా డైరీ) మంత్రికి అందజేశారు.

### - శ్రమ జీవుల హక్కులు - సామాజిక భద్రతపై చర్చ

రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను ఈ సమావేశంలో ఫెడరేషన్ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. శతాబ్దాలుగా సామాజిక మార్పు కోసం సమాచారాన్ని అందిస్తున్న విలేకరుల ఆర్థిక భద్రత, ఆరోగ్య రక్షణ, నివాస వసతి వంటి పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని మామిడి సోమయ్య మంత్రికి విజ్ఞప్తి చేశారు. శ్రామిక విలేకరుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం తగిన చొరవ చూపాలని కోరారు.

### - ముఖ్యమంత్రితో చర్చించి త్వరలోనే నిర్ణయం : మంత్రి శ్రీధర్ బాబు

ఫెడరేషన్ విజ్ఞప్తులపై మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారు. ఆధునిక సమాజంలో పౌర హక్కుల రక్షణకు, ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి జర్నలిస్టుల పాత్ర శాస్త్రీయంగా ఎంతో ప్రాధాన్యత కలిగినదని ఆయన కొనియాడారు.

"ఒక ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య వ్యవస్థ నిలబడాలంటే వార్తా సేకరణ రంగం బలంగా ఉండాలి. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిశీలిస్తోంది. అత్యంత త్వరలోనే ఈ విషయాలను గౌరవ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషిస్తాం."

**- దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి**

### - హాజరైన ప్రముఖులు

జర్నలిస్టుల సంక్షేమ సాధనకై జరిగిన ఈ ప్రాధాన్యత కలిగిన సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు కుంచెం శ్రీనివాస్, వి. రవికుమార్, పర్కాల సమ్మయ్య గౌడ్, చొల్లేటి బ్రహ్మాచారి, ఎం.రవికుమార్ తదితరులు పాల్గొని తమ గళాన్ని వినిపించారు.

## సైబర్ బాధితులకు భారీ ఊరట..

### - నేరగాళ్లు కొట్టేసిన డబ్బు తిరిగి వెనక్కి..

**హైదరాబాద్,(భారత శక్తి)** సైబర్ మోసాలకు గురై డబ్బు కోల్పోయిన బాధితులకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో శుభవార్త చెప్పింది. పోగొట్టుకున్న డబ్బును తిరిగి పొందేందుకు మనీ రిస్టోరేషన్ మాడ్యూల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. అధికారిక మెసేజ్ అందుకున్న వారు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. బ్యాంకులు, చట్ట అమలు సంస్థల ధ్రువీకరణ తర్వాత అర్హులైన వారి ఖాతాల్లోకి నేరుగా డబ్బు జమ కానుంది.సైబర్ మోసాలకు గురై డబ్బులు పోగొట్టుకున్న వారికి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) గుడ్‌న్యూస్ చెప్పింది. బాధితులు తమ డబ్బును సులభంగా తిరిగి పొందేందుకు మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ (ఎంఆర్ఎం)ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కొత్త విధానం ద్వారా అర్హులైన బాధితులు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లోనే రీఫండ్ కోసం దరఖాస్తు చేసుకుని.. నేరుగా తమ బ్యాంకు అకౌంట్లలోకి డబ్బు పొందే అవకాశం కల్పించింది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్, ఐపీఎస్ అధికారి శిఖా గోయెల్ ఈ వివరాలు వెల్లడించారు.కేంద్ర హోంమంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ) నుంచి రీఫండ్‌కు సంబంధించిన అధికారిక ఎస్ఎంఎస్ లేదా నోటిఫికేషన్ అందుకున్న బాధితులు మాత్రమే ఈ మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ సేవను వినియోగించుకోవచ్చు. బాధితుల అభ్యర్థనను చట్ట అమలు సంస్థలు, సంబంధిత బ్యాంకులు ధృవీకరించిన తర్వాత అర్హత ఉన్న వారి ఖాతాల్లోకి నేరుగా నగదు జమ చేయనున్నారు.దరఖాస్తు విజయవంతంగా నమోదైనట్లు మెసేజ్ వచ్చిన తర్వాత.. ధృవీకరణ పూర్తయ్యాక డబ్బు నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది.ఈ సందర్భంగా ప్రజలకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో మరోసారి అలర్ట్ చేసింది. రీఫండ్ త్వరగా ఇప్పిస్తామని చెప్పే మోసగాళ్లను నమ్మవద్దని హెచ్చరించింది. ఓటీపీలు, బ్యాంక్ పాస్‌వర్డ్‌లు, ఏటీఎం వివరాలు లేదా ఇతర గోప్యమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ ఇవ్వొద్దని సూచించింది. రీఫండ్ కోసం ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. అదే సమయంలో సహాయం అవసరమైన బాధితులు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెల్ప్‌డెస్క్‌ను లేదా తమ కేసును దర్యాప్తు చేస్తున్న అధికారిని నేరుగా సంప్రదించాలని సూచించింది.

## పంట పొలాలకు విద్యుత్ సమయాన్ని పెంచాలి

### - రైతుల వినతి



**సి.బెళగల్,(భారత శక్తి)** రైతులకు వ్యవసాయ అవసరాల కోసం ప్రస్తుతం అందిస్తున్న 9 గంటల విద్యుత్ సరఫరా సమయాన్ని పెంచడంతో పాటు, కేటాయించిన సమయంలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ అందించాలని కోరుతూ సి.బెళగల్ మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, కమ్మదహాల్ గ్రామాల రైతులు బుధవారం మండల విద్యుత్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏడి జాన్సన్, ఏఈ సుకుమారును కలిసి తమ సమస్యలను వివరించారు.ఈ సందర్భంగారైతులు మాట్లాడుతూ, ఈ ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడం, కాలువల ద్వారా సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం బోరు బావులపైనే పూర్తిగా ఆధారపడాల్సి వస్తోందని, అయితే విద్యుత్ సరఫరా మధ్య మధ్యలో నిలిచిపోవడం వల్ల మోటార్లు సక్రమంగా నడవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పంటలకు సకాలంలో నీరు అందక రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు.కనీసం ప్రస్తుతం కేటాయించిన 9 గంటల విద్యుత్‌ను కూడా అంతరాయం లేకుండా నిరంతరంగా అందించాలని, సాధ్యమైనంత వరకు విద్యుత్ సరఫరా సమయాన్ని మరింత పెంచాలని అధికారులను కోరారు. రైతుల సమస్యలను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని విద్యుత్ అధికారులు హామీ ఇచ్చినట్లు సమాచారం.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు మారందొడ్డి టీడీపీ నాయకుడు జిక్రియ భాష, కమ్మదహాల్‌కు చెందిన భాస్కర్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## వసతులు లేవని గురుకుల బాలికల అందోళన

**మహబూబాబాద్ (భారత శక్తి)** కొత్తగూడ మండలంలోని గాంధీనగర్ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల బాలికలు రోడెక్కదారు. మాకు దోమలు, పురుగులు కుట్టి శరీరం మొత్తం అలర్జీ లాగా అవుతుంది. రూల్ నంబర్లు వేసి మాతో బాత్రూంలు క్లీన్ చేయిస్తున్నారు. ఇదేంటని అడిగితే వేధిస్తున్నారని ఆరోపించారు. మేం పిల్లలం. తలా 20 రూపాయలు ఇస్తే బాత్రూంలు క్లీన్ చేయిస్తాం, లేదంటే మీరే చేసుకోండి అని ప్రిన్సిపాల్ మేడం అంటుంది. సంవత్సరం నుండి సరిగ్గా నీళ్లు రావట్లేదు. అడిగితే మార్కులు కట్ చేసి ఫెయిల్ చేస్తామని భయపెడుతున్నారని అన్నారు.

## విద్యుత్ సరఫరా సరిగా కావడం లేదని సబ్స్టేషన్ను ముట్టడించిన రైతులు

**సూర్యాపేట (భారత శక్తి)** మద్దిరాల మండలం రెడ్డిగూడెం గ్రామ సబ్స్టేషన్ వద్ద రైతులు ఆందోళన కు దిగారు. విద్యుత్ సరఫరా సరిగా కావడం లేదని సబ్స్టేషన్ను ముట్టడించారు. విద్యుత్ సరఫరా సరిగా కావడం లేదని, వేసిన పంటలు కరెంటు లేక ఎండిపోతున్నాయని మండిపడ్డారు. కోతలు లేని నాణ్యమైన కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేసారు.

## వైసీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం

**తాడేపల్లి(భారత శక్తి)** తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ ఎంపీతో సమావేశమైయారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ఉభయ సభల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, ప్రస్తావించాల్సిన ప్రజా సమస్యలు, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై జగన్ దిశానిర్దేశం చేసారు.

## లక్క పురుగుల బెడద.. రైతుల ఆందోళన

**కామారెడ్డి (భారత శక్తి)**రామారెడ్డి మండలం మోషంపూర్ గ్రామంలో గోదాముల ఎదుట గ్రామస్తులు బైఠాయించారు. గోదాముల నుంచి లక్క పురుగులు ఇండ్లలోకి వస్తున్నాయని గ్రామస్తుల ఆవేదన. పురుగుల కారణంగా ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసారు.

## మృత్యువాత నుండి బయటపడిన మత్స్యకారులు

**(భారత శక్తి)** కేజిహెచ్ లు చికిత్సబోటుపై ఏడుగురు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లారు. ఫిషింగ్ హార్బర్ కు దగ్గరలో సముద్రంలో చేపల వేట సాగిస్తుండగా సాగర జలాలు ఒక్కసారిగా వలను లాక్కున్నాయి. ఈ ఘటనలో పడవ బోల్తాపడి మత్స్యకారులపై పడింది. అలల తాకిడి ఎక్కువగా ఉండడంతో ఆ బోర్డుతో పాటు మత్స్యకారులు పెద్ద రాళ్లకు మధ్యలో చిక్కుకుపోయారు. ఈ ప్రమాదంలో మత్స్యకారులు బోటును పట్టుకొని ప్రాణాలతో బయటపడ్డారు. తాతారావు, ఆకాష్ అనే ఇద్దరు మత్స్యకారులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన గంగపుత్రులు కేజీహెచ్ లో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంతో రెండున్నర లక్షల పైగా విలువ చేసే బోటు, రెండు లక్షల రూపాయలు విలువ చేసే వల పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంతో మత్స్యకారులు ఆర్థికంగా నష్టపోయారు. గంగమ్మ తల్లి అనుగ్రహంతో ప్రాణాలతో బయటపడ్డామని మత్స్యకారులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని మత్స్యకారులు కోరారు.

# వెంకన్న సన్నిధి... వికలాంగుల పెన్నిధి

- తిరుమల వెళ్లలేని దివ్యాంగుల కోసం "ట్రస్ట్" సాయం - ఖర్చులన్నీ వాళ్లవే
- ఏడుకొండలవాడి చెంతకు వెళ్లలేని వారికి అండగా నిలుస్తోన్న "శ్రీ అష్టోత్తర శత చుక్కల చారిటబుల్ ట్రస్ట్"



**హైదరాబాద్ (భారత శక్తి):** ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన భారత పుణ్యక్షేత్రాలలో "తిరుమల" ఒకటి. ఏడుకొండలపై విష్ణుమూర్తి అవతారంలో కొలువై ఉన్న ఆ వేంకటేశ్వర స్వామి దర్శనానికి నిత్యం ఎంతో మంది భక్తులు తరలి వెళ్తుంటారు. ఆ కోనేటి రాయుడిని కనులారా చూసి, మనసారా వేడుకుంటారు. ముడుపులు, మొక్కులు చెల్లించుకుంటుంటారు. అయితే, చాలా మంది భక్తులు కనీసం సంవత్సరానికి ఒక్కసారైనా దర్శించుకుంటే మరి కొద్దిమంది మాత్రం జీవితంలో ఒక్కసారి దర్శించుకున్నా చాలని కోరుకుంటారు. ఈ క్రమంలోనే ఒక్కసారి కూడా ఏడుకొండలవాడిని చూసుకోలేని వారికి అండగా నిలుస్తోంది ఓ సంస్థ. అదే "శ్రీ అష్టోత్తర శత చుక్కల చారిటబుల్ ట్రస్ట్". నిరుపేదలు, దివ్యాంగులకు ఆ శ్రీనివాసుడి దర్శన భాగ్యం కల్పిస్తోంది.తిరుపతి వెంకన్నను దర్శించుకోవాలని చాలా మందికి ఉంటుంది. అయితే, చేతిలో డబ్బులు లేని కారణంగా కొద్దిమంది ఆ కోరికను తుంచుకుంటే దివ్యాంగులు వాళ్ల లోపం కారణంగా వెళ్లలేకుంటారు. అలాంటి వారందరికీ తిరుమలేశుడి దర్శన భాగ్యం కల్పిస్తోంది "శ్రీ అష్టోత్తర శత చుక్కల చారిటబుల్ ట్రస్ట్".

### సంస్థకు పునాది ఆ ఆలోచనే

హైదరాబాద్?కు చెందిన చుక్కల వేణుకుమార్? అనే వ్యాపారికి ఒకరోజు "ఒక్కసారైనా తిరుమల దర్శనం చేసుకోని వాళు ంటారా?" అనే సందేహం వచ్చిందట. ఆ క్రమంలోనే ఓసారి నాగోల్‌లో ఉన్న ఒక గుడికి వెళ్లినప్పుడు "తిరుపతికి వెళ్లని వాళు న్నారా" అంటూ మైక్‌లో అడిగించారట. దీంతో "మేం వెళ్లలేదు" అని చాలా మంది చెప్పడం చూసి ఆశ్చర్యపోయారట. దాంతో తన సొంత డబ్బులతోనే కొందరు మురికివాడ ప్రజల్ని ఏడుకొండలు ఎక్కించారు వేణుకుమార్. తిరుమలకి వెళ్లాలని ఉన్నా పేదరికంతో వెళ్లలేనివారి కోసమే స్నేహితులతో కలిసి 2014లో "శ్రీ అష్టోత్తర శత చుక్కల చారిటబుల్ ట్రస్ట్"ను ఏర్పాటు చేశారు.

### ఖర్చులన్నీ ట్రస్ట్ తరఫునే

సమాజంలోని పేదలు, దివ్యాంగులకు ఆధ్యాత్మిక సేవలు అందించే ఒక ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ ఇది. జీవితంలో ఒక్కసారైనా తిరుమల కొండను సందర్శించి, శ్రీవారిని దర్శించుకోవాలని ఆశపడే దివ్యాంగులు, అంధులు, అనాథలు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలు, జీవితంలో ఇప్పటివరకు ఒక్కసారి కూడా తిరుమల కొండను సందర్శించని భక్తులకు ఈ ట్రస్ట్ పూర్తిగా ఉచితంగా తిరుపతి యాత్రను ఏర్పాటు చేస్తుంది. భక్తులకు తిరుమల వెళ్లడానికి రానూపోనూ ఛార్జీలూ, వసతి, భోజనం అన్నీ వాళ్లే చూసుకుంటారు.

### వాలంటీర్లు కూడా సిద్ధం

ఈ ట్రస్ట్‌లో "గరుడ సేన" అనే వాలంటీర్ల బృందం పనిచేస్తుంది. తిరుమల యాత్రకు వచ్చే దివ్యాంగులకు, వృద్ధులకు కొండపై నడవడానికి, వీల్ చైర్ సదుపాయం కల్పించడానికి, సురక్షితమైన దర్శనం చేయించడానికి ఈ వాలంటీర్లు ఎల్లప్పుడూ తోడుగా ఉంటారు.టీటీడీ బోర్డు సాయం ఈ ట్రస్టు సేవలకి సాయంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఉచిత వసతి, దర్శన ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటి వరకూ సుమారు 3000 మంది భక్తులకు వెంకన్న దర్శనభాగ్యం కల్పించిందీ ట్రస్టు.

### ఎలా దరఖాస్తు చేసుకోవాలి

ఈ ఉచిత సేవలను పొందడానికి ట్రస్ట్ అధికారిక మార్గాల ద్వారా ముందే పేరు నమోదు చేసుకోవాలి. అందుకోసం ట్రస్ట్ అధికారిక వెబ్‌సైట్ బజీబఞఇఞబి.నీతీణ లో లేదా వారి వాట్సాప్ నెంబర్ 96661 59999 అందించే గూగుల్ ఫారమ్‌ను పూరించాలి.అప్లై చేసుకునే సమయంలో భక్తుని ఆధార్ కార్డ్, దివ్యాంగులైతే సదరం సర్టిఫికేట్ లేదా నిరుపేదలయితే రేషన్ కార్డ్ జిరాక్స్?లను అందించాలి.ఈ యాత్రకు సంబంధించిన నమోదు ప్రక్రియ, తదుపరి యాత్ర ఎప్పుడు ఉంటుందో తెలుసుకోవడానికి మీరు నేరుగా ట్రస్ట్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. ఈ ట్రస్ట్? మల్కాజ్?గిరిలో ఉంది.అనేది ప్రధానంగా శారీరక వికలాంగులు, అనాథలు, నిరుపేదలకు ఉచిత తిరుమల దర్శనం కల్పించేందుకు ఏర్పాటయిన ఒక స్వచ్ఛంద సంస్థ.

# ‘ది కాల్’ మూవీ రివ్యూ!

హారర్ థ్రిల్లర్ సినిమాలకు ఓటీటీ ఫ్లాట్ ఫామ్స్ పై ఎప్పుడూ మంచి ఆదరణ లభిస్తూ ఉంటుంది. ఈ జోనర్ నుంచి వచ్చిన సినిమాలను భాషతో సంబంధం లేకుండా ఆడియన్స్ చూస్తుంటారు. అందువల్లనే ఈ జోనర్ సినిమాలను ఎక్కువగా వదలడానికి ఓటీటీ సంస్థలు పోటీపడుతూ ఉంటాయి. అలా రూపొందిన సినిమానే ‘ది కాల్’. 2020 నవంబర్లో విడుదలైన ఈ సౌత్ కొరియన్ సినిమా, ఆ తరువాత ఓటీటీ సెంటర్లలోకి అడుగుపెట్టింది. అయితే తాజాగా ‘జియో హాట్ స్టార్’ లో తెలుగులోను అందుబాటులోకి వచ్చింది. ఈ నెల 10వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. అది సిటీకి దూరంగా ఉన్న ఒక మారుమూల గ్రామం. అక్కడ ఎడిత్ క్రాన్స్ టన్ (లిన్ షేయ్) అనే ఒక వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తూ ఉంటుంది. క్రాన్స్ భర్త ఎక్కువగా ట్రావెలింగ్ లో ఉండటం వలన, ఆమె భయపడుతూనే రోజులు గడుపుతూ ఉంటుంది. ఆమె రూపం.. చిత్రమైన ధోరణి కారణంగా మంత్రగత్తె అనే ఒక పేరు పడిపోతుంది. కొంతమంది ఆకతాయిలు ఆమెను మరింత ఇబ్బందిపెడుతూ ఉంటారు. తన చెల్లెలు ‘లారా’ కనిపించకపోవడానికి క్రాన్స్ కారణమని ‘తానియా’ భావిస్తుంది. ఆమెనే లారాను ఏదో చేసి ఉంటుందని ప్రచారం చేస్తుంది. తన స్నేహితులైన క్రిస్ .. బ్రెడ్ .. జాక్ తో కలిసి క్రాన్స్ ఇంటిపైకి వెళుతుంది. రాళ్లు విసురుతూ ఆమె ఇంటి అద్దాలను పగులగొడతారు. ఆ తరువాత ఆమె చనిపోయిందని తెలుసుకుని వాళ్లంతా ఆశ్చర్యపోతారు. ట్రావెలింగ్ నుంచి వచ్చిన క్రాన్స్ భర్త, ఆ నలుగురు స్నేహితులను తన ఇంటికి పిలిపిస్తాడు. తన భార్య ఆత్మ హత్య చేసుకుందనీ, ఆమె బాడీతో పాటు ఫోన్ ను కూడా ఖననం చేశానని చెబుతాడు. తన ఇంట్లోని మేడ పై గదిలోకి ఒక్కొక్కరుగా వెళ్లి, ఆ నెంబర్ కి కాల్ చేసి ఒక నిమిషం మాట్లాడమని కోరతాడు. నిమిషం పాటు మాట్లాడినవారికి, పెద్ద మొత్తంలో నగదు బహుమతిని అందజేస్తానని చెబుతాడు. అలా చేయకపోతే తన భార్య రాసిన సూసైడ్ లెటర్ ను పోలీసులకు అందజేస్తానని బెదిరిస్తాడు. దాంతో అతను చెప్పినట్టుగా చేయడానికి వాళ్లు అంగీకరిస్తారు. ఒక్కొక్కరుగా మేడపైకి వెళతారు. అక్కడ ఏం జరుగుతుంది? వెళ్లినవాళ్లు తిరిగొస్తారా లేదా? అనేది మిగతా కథ.



ఆత్మహత్య చేసుకున్నవాళ్లు దెయ్యాలుగా మారతారా? బ్రతికున్నపుడు తమని అదే పనిగా వేధిస్తూ వచ్చినవాళ్లపై ప్రేతాత్మలు పగబడతాయా? అలాంటివాళ్లపై ప్రతీకారం తీర్చుకుంటాయా? అనే ప్రశ్నలకు సమాధానంగా ఈ సినిమా కథను అల్లుకున్నారు. ఆకతాయి చేష్టలతో తనని వేధించిన ముగ్గురు యువకులు .. ఒక యువతిపై ఒక ప్రేతాత్మ ఎలా ప్రతీకారం తీర్చుకుంటుంది? అనే అంశం చుట్టూనే ఈ కథ తిరుగుతుంది. వృద్ధురాలు చనిపోవడం .. ఆమె ఆత్మహత్యకు కారకులైన నలుగురు ఫ్రెండ్స్ ను ఆమె భర్త పిలిపించడం .. వాళ్లకి ఒక టాస్క్ ఇవ్వడం వరకూ ఈ కథ ఇంట్రెస్టింగ్ గానే అనిపిస్తుంది. ఇక ప్రేతాత్మతో ఫోన్లో మాట్లాడటానికి ఒక్కొక్కరూ మేడపైకి వెళుతుంటే, అసలు కథ మొదలైందనే ఒక కుతూహలం పెరుగుతూ పోతుంది. అయితే ఆ క్యూరియాసిటీ ఎంతోసేపు నిలబడదు. ఎందుకంటే ఆడియన్స్ భయపడేంత స్థాయిలో అక్కడ ఏమీ జరగదు. మేడపైకి వెళ్లిన వాళ్లు ఒక ప్రత్యేకమైన జోన్ లోకి వెళ్లిపోవడం వరకూ బాగానే ఉంది. అయితే అక్కడ లైటింగునుగానీ, ప్రేతాత్మకి సంబంధించిన జుగుప్సాకరమైన సన్నివేశాలనుగాని చూడలేము. భయంతో ముచ్చెమటలు పట్టేంత సీన్ .. అక్కడ ఏ సీన్ కి లేదు. మొబైల్ ను శవంతో పాటు పెట్టేసి పూడ్చేయడం, ఆ నెంబర్ కి కాల్ చేస్తే ప్రేతాత్మ మాట్లాడటం వంటి సన్నివేశాలు చాలా సిల్లీగా అనిపిస్తాయి.సాధారణంగా దెయ్యాల కథలన్నీ దాదాపు ఒక ఇంటిపరిమితమవుతూ ఉంటాయి. ఆ ఇంటి గేటుదాటి దెయ్యాలు బయటికి రావు.

బయట పాత్రలు లోపలికి వెళతాయి అంతే. పైగా ఈ తరహా కథలకు పెద్దగా తారాగణం అవసరం లేదు. చాలా తక్కువ మందితో .. తక్కువ బడ్జెట్ లో కానిచ్చేస్తూ ఉంటారు. అలాంటి ఒక కాన్సెప్ట్ తో రూపొందిన సినిమానే ఇది. ఒక్కమాటలో చెప్పాలంటే రియాలిటీ షోను గుర్తుకు చేసే కంటెంట్ ఇది.ఆర్టిస్టుల నటన గురించి గొప్పగా చెప్పుకోవడానికేమీ లేదు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. హారర్ సినిమాలను ఇష్టపడే ఆడియన్స్ కి చాలా సాధారణంగా అనిపించే కాన్సెప్ట్ గా ఈ సినిమా మిగిలిపోతుందని చెప్పచ్చు.

## నిరీక్షణకు తెర 23న వస్తున్న
# ‘జన నాయగన్’



తమిళనాడు సీఎం, అగ్ర కథానాయకుడు దళపతి విజయ్ అభిమానుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. సెన్సార్ చిక్కుల్లో పడి విడుదల విషయంలో వరుస వాయిదాలు ఎదుర్కొన్న ‘జన నాయగన్’ సినిమా విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 23న భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో దళపతి విజయ్ పోలీస్ గెటప్‌లో స్టైలిష్ అండ్ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. రాజకీయరంగ ప్రవేశం సమయంలోనే ‘జన నాయగన్’ తన చివరి చిత్రమని ప్రకటించారు హీరో విజయ్. ఇక తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. విజయ్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత విడుదలవుతున్న చిత్రమిదే కావడంతో సామాన్య ప్రజానీకంలో కూడా ఈ సినిమాపై ఆసక్తి నెలకొంది. హెచ్.వినోద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది.

## తమిళంలో
# బంపరాఫర్



‘కాంతార: ఛాప్టర్ 1’ చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో మంచి గుర్తింపును సంపాదించుకుంది కన్నడ భామ రుక్మిణి వసంత్. ప్రస్తుతం ఆమె యశ్ ‘టాక్సిక్’, ఎన్టీఆర్ ‘డ్రాగన్’ వంటి భారీ చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం ఈ సొగసరి మరో బంపరాఫర్‌ను చేజిక్కించుకున్నట్లు తెలిసింది. రజనీకాంత్ తాజా చిత్రం ‘ధర్మన్– ది డెడ్లీ డాక్టర్’లో ఈ భామ కీలక పాత్రకు ఎంపికైందని చెన్నై ఫిల్మ్‌నగర్ టాక్. కథాగమనంలో ఆమె క్యారెక్టర్‌కు చాలా ప్రాధాన్యత ఉంటుందని చెబుతున్నారు. ‘ధర్మన్’ చిత్రంలో సిమ్రాన్ కథానాయికగా నటిస్తుండగా, రాశీఖన్నా ఇంపార్టెంట్ రోల్‌లో కనిపించనుంది. అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా త్వరలో సెట్స్‌మీదకు వెళ్లనుంది. అగ్ర నటుడు కమల్‌హాసన్ నిర్మాణ బాధ్యతలు తీసుకున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతాన్నందిస్తున్నారు.



## అనకాపల్లిలో
# జరిగే ప్రేమకథ

విక్రమ్ సహిదేవ్, సంధ్య వశిష్ట జంటగా నటిస్తున్న చిత్రం ‘అనకాపల్లి’. ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కాండ్రేగుల నాయుడు, త్రినాథ రావు నక్కిన నిర్మిస్తున్నారు. ఆగస్ట్ 7న విడుదలకానుంది. ఈ సినిమాలోని ‘ఎలగే పిల్ల’ అనే పాటను ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగవంశీ విడుదల చేశారు. దేవ్‌జండ్ సంగీతాన్నందించిన ఈ పాటను అనంత్‌శ్రీరామ్ రచించారు. అనకాపల్లి నేపథ్యంలో నడిచే ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇదని, సంగీతానికి చాలా ప్రాధాన్యం ఉంటుందని, ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ఆకట్టుకుంటున్నాయని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: దేవ్‌జండ్, కథ, స్క్రీన్‌ప్లే: త్రినాథరావు నక్కిన, దర్శకత్వం: ఖగేష్ తమ్మినేని.

## డబ్బుల కోసమే సినిమాల్లోకి వచ్చా..
## ఒకప్పుడు కూలీ పని కూడా చేశా: విజయ్ సేతుపతి



సినిమా పరిశ్రమలో ఎలాంటి గాడ్‌ఫాదర్ లేకుండా, కేవలం తన అద్భుత నటనతో ‘మక్కల్ సెల్వన్’ (ప్రజల నటుడు)గా ఎదిగిన విజయ్ సేతుపతి.. తమిళ, తెలుగు ప్రేక్షకులలో సంపాదించుకున్న గుర్తింపు ప్రత్యేకమైనది. ఇటీవల జరిగిన ఒక ఇంటర్వ్యూలో ఆయన తన చిన్ననాటి కష్టాలు, కుటుంబ ఆర్థిక ఇబ్బందుల గురించి పంచుకున్న విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.“చిన్నప్పుడు మా కుటుంబం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉండేది. మా నాన్న మా కోసమే చాలా అప్పులు చేశారు. అవి తీర్చలేక సతమతమయ్యేవాళ్లం. కొన్నిసార్లు అప్పులవాళ్లు మా ఇంటిపైకి గొడవకు వచ్చేవారు. ఆ సమయంలో మా నాన్న ఒంటరిగా బాధపడకూడదని నేను ఎప్పుడూ ఆయన పక్కనే కూర్చునేవాడిని” అని సేతుపతి గుర్తుచేసుకున్నారు.ఎన్ని కష్టాలున్నా ప్రతిరోజు రాత్రి 9.30 గంటలకు నాన్న బుల్లెట్ బండిపై వస్తూ ఫ్రైడ్ రైస్ తెచ్చేవారని, కుటుంబమంతా కలిసి దాన్ని పంచుకుని తినే ఆ క్షణాలు తన జీవితంలో మర్చిపోలేని మధుర జ్ఞాపకాలని చెప్పారు. నటుడు అవ్వాలనేది విజయ్ సేతుపతి లక్ష్యం కాదట. కేవలం కుటుంబ బాధ్యతలు, డబ్బుల కోసమే ఆయన రంగుల ప్రపంచంలోకి అడుగుపెట్టారు. సినిమాల్లోకి రాకముందు ఆయన స్కూల్ రోజుల్లో కూలీ పనికి వెళ్లారు. ఆ తర్వాత రిటైల్ స్టోర్‌లో సేల్స్‌మ్యాన్‌గా, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో క్యాషియర్‌గా, ఫోన్ బూత్ ఆపరేటర్‌గా పనిచేశారు.

ఆ తర్వాత దుబాయ్ వెళ్లి అక్కడ అకౌంటెంట్‌గానూ ఉద్యోగం చేశారు.దుబాయ్ నుంచి ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత నాటక రంగానికి చెందినవారితో ఏర్పడిన పరిచయమే విజయ్ సేతుపతి జీవితాన్ని మలుపు తిప్పింది. మొదట్లో సినిమాల్లో చిన్న చిన్న క్యారెక్టర్లు చేస్తూ.. ‘తెన్మేర్కు పరువకాట్రు’ చిత్రంతో హీరోగా మారారు. ఆ తర్వాత ‘సూదు కవ్వమ్’, ‘విక్రమ్ వేద’, ‘పిజ్జా’, ‘మహారాజా’ వంటి విలక్షణమైన చిత్రాలతో స్టార్ హీరోగా నిలదొక్కుకున్నారు. ప్రస్తుతం ఆయన హీరోగా నటించిన ‘ట్రైన్’, ‘స్లమ్ డాగ్’ సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

# నా కెరీర్‌లోనే బెస్ట్ స్క్రీన్‌ప్లే



పోసాని కృష్ణమురళి ప్రధాన పాత్రలో నటిస్తూ స్వీయ నిర్మాణ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం ‘ఆపరేషన్ అరుణా రెడ్డి’. హిందోళ చక్రవర్తి, కాజల్ శర్మ, అయేషా ఖాన్ తదితరులు ప్రధాన పాత్రధారులు. ఈ నెల 17న విడుదలకానుంది. మంగళవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పోసాని కృష్ణమురళి మాట్లాడుతూ ‘నేను పనిచేసిన అన్ని చిత్రాల్లో ‘ఆపరేషన్ అరుణారెడ్డి’కి బెస్ట్ స్క్రీన్‌ప్లే ఇచ్చానని చెప్పగలను. ఈ సినిమా ప్రారంభం నుంచి చివరి వరకు ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. ఎక్కడా అసభ్యతకు తావు లేకుండా ఈ సినిమాను తెరకెక్కించాం’ అన్నారు. ఈ చిత్రానికి మహదేవ్ ఏలెందర్ సంగీతాన్నందించారు.

## నోలన్ ‘ది ఒడిస్సీ’ సినిమాకు వెళుతున్నారా? అరగంట ముందే థియేటర్‌కు చేరుకోండి!

ప్రఖ్యాత హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కించిన ‘ది ఒడిస్సీ’ చిత్రం కోసం సినీ ప్రేక్షకులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం శుక్రవారం (జులై 17) విడుదల కానుంది. అయితే, సినిమా వీక్షించేందుకు వచ్చే ప్రేక్షకులు, మరీ ముఖ్యంగా ఐమ్యాక్స్ స్క్రీన్‌లలో చూసేవారు, కనీసం 30 నిమిషాల ముందే థియేటర్లకు చేరుకోవాలని చిత్ర బృందం సూచించింది. ఈ చిత్రాన్ని సంపూర్ణంగా అధునాతన ఐమ్యాక్స్ కెమెరాలతో చిత్రీకరించారు. ప్రేక్షకులకు అద్భుతమైన దృశ్యానుభూతిని అందించే క్రమంలో, కొన్ని ఎంపిక చేసిన ఐమ్యాక్స్ 70ఎంఎం స్క్రీనింగ్‌లలో ప్రధాన చిత్రం ప్రారంభానికి ముందు ప్రత్యేక కంటెంట్‌ను ప్రదర్శించే అవకాశం ఉంది. దీనిలో భాగంగా, డెనిస్ విల్లేనువే దర్శకత్వంలో రాబోతున్న ‘డూన్: పార్ట్ త్రీ’ చిత్రానికి సంబంధించిన నాలుగు నిమిషాల ప్రోలోగ్‌ను ప్రదర్శించవచ్చని ప్రచారం జరుగుతోంది. గతంలోనూ నోలన్ తన ‘ది డార్క్ నైట్’, ‘ది డార్క్ నైట్ రైజెస్’ చిత్రాల ప్రమోషన్ కోసం ఇదే తరహా వ్యూహాలనే అనుసరించడం గమనార్హం.

సాధారణంగా భారీ చిత్రాల విడుదల సమయంలో తలెత్తే ట్రాఫిక్ ఇబ్బందులు, టికెట్ స్కానింగ్ ప్రక్రియ మరియు రద్దీగా ఉండే హాల్స్‌లో సీట్లను వెతుక్కోవడం వంటి కారణాల వల్ల ప్రేక్షకులకు ఆలస్యమయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో నిర్ణీత సమయం కంటే ముందుగానే థియేటర్‌లకు చేరుకోవడం ఉత్తమమని విశ్లేషకులు సూచిస్తున్నారు.కాగా, ఈ చిత్రాన్ని నోలన్ ఆశించిన పూర్తిస్థాయి ఐమ్యాక్స్ 70ఎంఎం ఫార్మాట్‌లో ప్రదర్శించే




థియేటర్లు ప్రపంచవ్యాప్తంగా కేవలం 41 మాత్రమే ఉన్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రారంభ వారాంతపు టిక్కెట్లు హాట్ కేకుల్లో అమ్ముడయ్యాయి.హోమర్ రచించిన గ్రీకు ఇతిహాసం ‘ది ఒడిస్సీ’ ఆధారంగా రూపొందిన ఈ చిత్రంలో ప్రధాన పాత్ర అయిన ఒడిస్సియస్‌గా మ్యాట్ డామన్ నటించగా, యాన్ హాత్వే, టామ్ హాలండ్, జెండాయా వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రలు పోషించారు. సుమారు 2 గంటల 52 నిమిషాల నిడివి గల ఈ చిత్రంపై, లండన్ ప్రీమియర్ షో అనంతరం అద్భుతమైన సమీక్షలు వెలువడుతున్నాయి. సాంకేతికంగానూ, భావోద్వేగాల పరంగానూ సినిమా అత్యున్నత స్థాయిలో ఉందంటూ ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# ఎమ్మెల్యేల్లో అంతర్గత అసహనం

**విజయవాడ,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం పటిష్టమైన పాలనపై దృష్టి పెట్టినప్పటికీ, తెరవెనుక పార్టీ ఎమ్మెల్యేలలో పెరుగుతున్న అసంతృప్తి ఇప్పుడు అధిష్ఠానానికి సరికొత్త సవాల్‌గా మారుతోంది. అయితే, ఈ అసంతృప్తికి ప్రభుత్వంపై వ్యతిరేకత కానీ, నిధుల కొరత కానీ కారణం కాకపోవడం ఇక్కడ అసలు ట్విస్ట్. క్షేత్రస్థాయిలో తమకు దశాబ్దాలుగా శత్రువులుగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులను, ప్రత్యర్థులను ప్రభుత్వం ఆర్థికంగా దెబ్బతీయకపోగా, అయాచితంగా కొన్ని నిర్ణయాల వల్ల వారు మరింత బలోపేతం అవుతుండటమే ఈ అసంతృప్తికి ప్రధాన కారణం. ఈ అంతర్గత అసహనానికి తాజా ఉదాహరణగా గన్నవరం శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు నిలిచారు. గన్నవరం నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో టీడీపీ కేడర్‌ను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులకు, ఆయనకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచే ఒక ప్రముఖ కన్స్ట్రక్షన్ సంస్థకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ పెండింగ్ పనుల కాంట్రాక్ట్ దక్కడంపై వెంకట్రావు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. తమ కళ్ల ముందే ప్రత్యర్థులు ప్రభుత్వ కాంట్రాక్టుల ద్వారా మళ్లీ ఆర్థికంగా పుంజుకుంటుంటే, నియోజకవర్గంలో తమ రాజకీయ ఉనికి ఏమవాలనే ఆందోళన ఆయనను బహిరంగంగానే మాట్లాడేలా చేసింది. వెంకట్రావు లేవనెత్తిన ఈ అంశం కేవలం గన్నవరానికి మాత్రమే పరిమితం కాలేదు, రాష్ట్రవ్యాప్తంగా మెజార్టీ టీడీపీ ఎమ్మెల్యేల అంతర్గత సమస్య ఇదేనని పొలిటికల్ సర్కిల్స్ లో విశ్లేషణలు సాగుతున్నాయి. గత ఐదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్ర అణచివేతకు గురై, ఆస్తులు నష్టపోయి, పార్టీ కోసం నిలబడిన కార్యకర్తలపై నమోదైన పాత కేసులు ఇప్పటికీ పూర్తిగా పరిష్కారం కాలేదు. ఒకవైపు సొంత కేడర్ పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతుంటే, మరోవైపు ప్రత్యర్థి పార్టీ నేతలు అధికార యంత్రాంగంలోని కొందరు అధికారుల అండతో యథేచ్ఛగా తమ వ్యాపారాలను, ఆర్థిక సామ్రాజ్యాలను కాపాడుకోవడం ఎమ్మెల్యేలకు మింగుడుపడటం లేదు. అధికారంలోకి వచ్చిన కొత్తలో సహజంగానే అధికారులు పాత కాంట్రాక్టర్ల పెండింగ్ పనులను క్లియర్ చేయడం, సాంకేతిక కారణాల వల్ల పాత సంస్థలకే ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంటుంది. కానీ, రాజకీయ క్షేత్రంలో ఇది తప్పుడు సంకేతాలు పంపుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రత్యర్థులను ఆర్థికంగా దెబ్బతీయకపోతే, వారు రాబోయే రోజుల్లో మళ్లీ పుంజుకుని తమపైకే రాజకీయంగా దాడికి వస్తారనే భయం టీడీపీ ఎమ్మెల్యేలలో స్పష్టంగా కనిపిస్తోంది. అధికారుల నిర్ణయాలు తమ రాజకీయ భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని వారు అంతర్గత సమావేశాల్లో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ నిర్వహణ, పాలనాపరమైన సంస్కరణలపైనే పూర్తి దృష్టి పెట్టిన టీడీపీ హైకమాండ్‌కు, సొంత పార్టీ శాసనసభ్యుల మనోభావాలను , క్షేత్రస్థాయిలో జరుగుతున్న లోపాలను గమనించడానికి తగినంత తీరిక లేనట్లు కనిపిస్తోంది. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యత దక్కడం లేదనే భావన కేడర్‌లో బలపడితే, అది రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఇమేజ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎమ్మెల్యేలు నేరుగా అసెంబ్లీ లోపల లేదా బహిరంగ వేదికలపై అసంతృప్తిని వెళ్లగక్కకముందే అధిష్ఠానం జోక్యం చేసుకోవాల్సి ఉంటుంది. టీడీపీ అగ్రనాయకత్వం ఈ తీవ్రతను గుర్తించి, నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల సమస్యలను ఆలకించకపోతే పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉంది. బ్యూరోక్రసీ తీసుకునే నిర్ణయాలు పార్టీ రాజకీయ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా మారకుండా ఒక స్పష్టమైన కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని టీడీపీ సీనియర్ నేతలు అనుకుంటున్నారు.

### చంద్రబాబుకు తీరక లేదు... లోకేష్ బిజీ బిజీ

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇది మంచి ప్రభుత్వం అనే నినాదంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనను ముందుకు తీసుకెళ్తున్నారు. అయితే, ఈ మంచితనం ఇప్పుడు సొంత పార్టీ ఎమ్మెల్యేలకు, ముఖ్యంగా క్షేత్రస్థాయిలో కష్టపడిన కీలక నేతలకు ఒక కొత్త తలనొప్పిగా మారింది. తెలుగుదేశం పార్టీ లోని కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలలో అంతర్గత అసంతృప్తి రోజురోజుకూ పెరిగిపోతోంది. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వంటి నేతలు ఇటీవల బహిరంగంగానే తమ ఆవేదనను వెళ్లగక్కడం దీనికి నిదర్శనం. అయితే, ఈ అసంతృప్తి చంద్రబాబు నాయకత్వంపై కానీ, పార్టీ సిద్ధాంతాలపై కానీ కాదు. నియోజకవర్గాల స్థాయిలో తమ రాజకీయ, ఆర్థిక మనుగడకు పొంచి ఉన్న ప్రమాదంపైనే ఈ ఆందోళన అంతా. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో తీవ్రమైన అణచివేతను, ఆర్థిక నష్టాలను భరించి, నియోజకవర్గాల్లో పార్టీ జెండాను మోసి గెలిచిన టీడీపీ ఎమ్మెల్యేలకు ఇప్పుడు ఒక విచిత్రమైన పరిస్థితి ఎదురవుతోంది. ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదార విధానాల వల్ల, నియోజకవర్గాల్లో పాత అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్లు, మైనింగ్ మాఫియా, ఆర్థిక శక్తులు ఇప్పటికీ యథేచ్ఛగా తమ వ్యాపారాలను సాగిస్తూ ఆర్థికంగా మరింత బలం పుంజుకుంటున్నారు. రాజకీయం ముగిసింది.. ఇక అందరూ సమానమే అనే ప్రభుత్వ ధోరణి వీరికి వరంగా మారింది. ప్రత్యర్థులు ఇలాగే ఆర్థికంగా బలపడితే, రాబోయే రోజుల్లో వారు తమకే ఏకు మేకవుతారనే సహజమైన భయం టీడీపీ ఎమ్మెల్యేలను వెంటాడుతోంది. చెడ్డవాళ్లకు చూపించే అతి మంచితనం.. చివరికి తమ రాజకీయ జీవితాలకే చేటు చేస్తుందని వారు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎమ్మెల్యేలకు ఉన్న ఈ అంతర్గత, వ్యూహాత్మక సమస్యలను అధిష్ఠానానికి వివరించడం ఒక పెద్ద సవాలుగా మారింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అమరావతి నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, రాష్ట్ర బడ్జెట్ నిర్వహణ వంటి భారీ బాధ్యతలతో క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. మరోవైపు ఐటీ, నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రిగా నారా లోకేష్ కూడా నిరంతరం సమీక్షలు, పర్యటనలతో బిజీగా ఉన్నారు. కిందిస్థాయి ఎమ్మెల్యేల వ్యక్తిగత బాధలను, నియోజకవర్గాల గ్రౌండ్ రియాలిటీలను లోకేష్ ఒక్కరే పూర్తిగా వినడం లేదా పరిష్కరించడం ఆచరణాత్మకంగా సాధ్యం కావడం లేదు. దీనివల్ల క్యాడర్‌లో ఒక విధమైన ఒంటరితనం, ఆవేదన గూడుకట్టుకుంటున్నాయి.

ఈ పొలిటికల్ గ్యాప్‌ను భర్తీ చేయడానికి టీడీపీ హైకమాండ్ తక్షణమే ఒక ప్రత్యేకమైన, అత్యంత నమ్మకమైన అంతర్గత వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పార్టీలోని సీనియర్ నేతలు లేదా పొలిట్‌బ్యూరో సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసి, ప్రతి వారం ఎమ్మెల్యేలతో వన్-టు-వన్ సమావేశాలు నిర్వహించాలి. తమ సమస్యలను క్లియర్ కట్‌గా చెప్పుకునే వేదిక ఉందని, తమ ఆందోళనలపై అధిష్ఠానం కచ్చితంగా యాక్షన్ తీసుకుంటుందనే గట్టి నమ్మకం ఎమ్మెల్యేలలో కలగాలి. అప్పుడే క్షేత్రస్థాయిలో అసంతృప్తి చల్లారి, ప్రభుత్వం-పార్టీల మధ్య సమన్వయం కుదురుతుంది. పాలనలో మంచితనం, పారదర్శకత ఎంత ముఖ్యమో.. క్షేత్రస్థాయిలో పార్టీని నమ్ముకున్న రాజకీయ సైనికులకు రక్షణ కల్పించడం కూడా అంతే ముఖ్యం. ప్రత్యర్థుల ఆర్థిక మూలాలను కట్టడి చేయకపోతే, రేపు స్థానిక సంస్థల ఎన్నికల్లో గానీ, భవిష్యత్తు రాజకీయాల్లో గానీ కూటమి తీవ్రమైన ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తుంది. కాబట్టి, చంద్రబాబు-లోకేష్ ద్వయం ఇప్పటికైనా కిందిస్థాయి నేతల అంతర్గత ఆవేదనను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి ఒక పటిష్టమైన వేదికను ఏర్పాటు చేయాలి. లేనిపక్షంలో, ఈ చిన్న చిన్న అసంతృప్తులే రాబోయే రోజుల్లో పెద్ద అంతర్గత కుమ్ములాటలకు దారితీసే ప్రమాదం ఉందనేది ఎక్కువ మంది అభిప్రాయం.

# జగన్ ఫ్రస్టేషన్ అంతకు మించి

**విజయవాడ,(భారత శక్తి)** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖపట్నం పర్యటనలో చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన హామీలు చూస్తూ జగన్మోహన్ రెడ్డి పూర్తిగా విచక్షణ కోల్పోతున్నట్లుగా ఎవరికైనా అర్థమైపోతుంది. సముద్రంలో జరిగిన బోటు ప్రమాద బాధితులను పరామర్శించే క్రమంలో ఆయన మాట్లాడిన తీరు, వ్యవస్థలపై చేసిన విమర్శలు ఆయన పారదర్శకతను, చట్టాలపై ఉన్న అవగాహనను ప్రశ్నించేలా ఉన్నాయి. ఒక మాజీ ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి, క్షేత్రస్థాయి న్యాయ సూత్రాలను పక్కనబెట్టి కొంత మందిని మోసం చేయడానికి అడ్డగోలుగా మాట్లాడేస్తున్నారు. సముద్రంలో వేటకు వెళ్లి బోటు మునిగిపోయిన ప్రమాదంలో వ్యవస్థలన్నీ శ్రమించి సహాయక చర్యలు చేపట్టిన విషయాన్ని జగన్ రెడ్డి పూర్తిగా పక్కనబెట్టేశారు. వాళ్లను కాపాడకపోవడం కోస్ట్ గార్డ్ చేసిన తప్పని తేల్చేశారు. కళ్ళు మూసి తెరిచే లోపు మూడేళ్లు అయిపోతాయని, వైసీపీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే మత్స్యకార బాధిత కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున ఇస్తానని ఆయన హామీ ఇచ్చేశారు. ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉండి, బాధితులకు తక్షణమే ఎలాంటి ఆర్థిక సహాయం చేయకుండా, భవిష్యత్తులో అధికారంలోకి వస్తే ప్రజాధనం నుంచి కోటి రూపాయలు ఇస్తానంటూ కాలయాపనతో కూడిన హామీలు ఇవ్వడం బాధితులను మభ్యపెట్టడమే. గతంలో ఆయన హయాంలో వందల మంది మత్స్యకారులు చనిపోతే.. బోట్లు తగలబడిపోతే పైసా ఇవ్వని వ్యక్తి ఆయన అని అందరికీ తెలుసు. మరీ ముఖ్యంగా, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన హిట్ అండ్ రన్ కేసులో జగన్ వ్యవహరించిన తీరు చట్టాలను తెలిసిన వారిని సైతం గ్భ్రాంతికి గురిచేస్తోంది. బైక్ యాక్సిడెంట్ చేసి ఓ నిరుపేద వ్యక్తి మరణానికి కారణమవ్వడమే కాకుండా, పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు అసలు సంబంధం లేని మరో యువకుడిని నిందితుడిగా ఇరికించే ప్రయత్నం చేశాడు. ఆధారాలతో సహా దొరికిపోయిన తర్వాతే నిందితుడు లొంగిపోగా, అసలు ఆ 18 ఏళ్ల పిల్లోడిపై కేసు పెట్టడమే తప్పు అన్నట్లుగా జగన్ మాట్లాడటం వెనుక కేవలం రాజకీయ ఓటు బ్యాంకు ప్రయోజనాలే కనిపిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి. ఈ కేసులో నిందితుడిని వెనకేసుకురావడం ద్వారా చట్టం ముందు అందరూ సమానులే అనే ప్రాథమిక సూత్రాన్ని జగన్ రెడ్డి విస్మరించినట్లు స్పష్టమవుతోంది. నిందితుడు తమ పార్టీ నేత కుమారుడైనంత మాత్రాన, ఈ ప్రమాదంలో చనిపోయిన ఒక బీసీ సామాజికవర్గానికి చెందిన గొర్రెల కాపరి ప్రాణానికి విలువే లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన వ్యక్తికి చట్టాలపై కనీస అవగాహన లేకపోవడం, లేదా తెలిసి కూడా తప్పుడు కేసులను సమర్థించడం చూస్తుంటే ఆయన పూర్తి మైండ్ బ్యాలెన్స్ కోల్పోయారనడానికి ఈ విశాఖ పర్యటనే నిదర్శనంగా కనిపిస్తోంది.

# అయోమయంలో అమరావతి రైతులు

**విజయవాడ,(భారత శక్తి)** రాజధాని అమరావతిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ట్రంక్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు ఏళ్ల తరబడి ఉన్న ప్రధాన అడ్డంకులు ఎట్టకేలకు తొలగిపోయాయి. సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి అత్యంత కీలకమైన ఉండవల్లి గ్రామంలోని సుమారు 2 ఎకరాల 77 సెంట్ల భూమిని ల్యాండ్ అక్విజిషన్ చట్టం ప్రకారం ప్రభుత్వం అధికారికంగా స్వాధీనం చేసుకుంది. రాజధాని అమరావతి అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా కొందరు రైతులు, వారి వెనుక ఉన్న శక్తులు భీష్మించుకు కూర్చున్నప్పటికీ.. గుంటూరు జిల్లా కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్ గడువు ముగియడంతో రెవెన్యూ, సీఆర్‌డీఏ యంత్రాంగం రంగంలోకి దిగి భూమిని ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించింది. దీంతో రాజధానిలో రవాణా వ్యవస్థకు గుండెకాయ లాంటి సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమమైంది. భూసేకరణ నిబంధనల ప్రకారం 10 మంది రైతులకు చెందిన ఈ 2.77 ఎకరాల భూమికి గాను ప్రభుత్వం మొత్తం రూ.7 కోట్ల 14 లక్షల భారీ పరిహారాన్ని ఖరారు చేసింది. ఈ లెక్కన ఎకరాకు సుమారు రూ.2 కోట్ల 58 లక్షల మేర నష్టపరిహారం లభిస్తుంది. శుక్రవారం రాత్రి సీఆర్‌డీఏ అధికారులు ఈ పరిహారానికి సంబంధించిన చెక్కులను నేరుగా రైతుల వద్దకు తీసుకువెళ్లినప్పటికీ, వారు వాటిని తీసుకోవడానికి నిరాకరించారు. అభివృద్ధికి సహకరించకుండా ఉద్దేశపూర్వకంగానే వారు చెక్కులను తిరస్కరించడంతో.. అధికారులు సదరు పరిహారం మొత్తాన్ని చట్టప్రకారం ఎల్.ఎల్.ఆర్.ఆర్ అథారిటీలో డిపాజిట్ చేశారు. అనంతరం రంగంలోకి దిగిన ఏడీసీఎల్ , ఎన్‌సీసీ కంపెనీల సిబ్బంది పనులను ముమ్మరం చేసి, 24 గంటల్లో గ్రావెల్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు యుద్ధప్రతిపాదికన మట్టి పనులు జరుపుతున్నారు. అమరావతి ల్యాండ్ పూలింగ్‌కు మొదటి నుండి సహకరించకుండా కోర్టు స్టేలతో కాలయాపన చేసిన ఈ భూముల వెనుక పెద్ద ఎత్తున వైసీపీ నేతల రాజకీయ హస్తం ఉందనే బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మిగిలిన రైతుల మాదిరిగానే వీరు కూడా ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చి ఉంటే, వాటికి బదులుగా వచ్చే కమర్షియల్, రెసిడెన్షియల్ ప్లాట్లను అమ్ముకున్నా ఎకరాకు సుమారు రూ.6 నుంచి 7 కోట్లకు పైగా వచ్చేది. కానీ, పూలింగ్ ఇవ్వకుండా కేవలం రూ.2.58 కోట్ల ప్రభుత్వ పరిహారానికి పరిమితం కావడం వెనుక వైసీపీ నేతల ఇన్‌సైడర్ ఒప్పందాలు ఉన్నట్లు తెలుస్తోంది. రాజధాని అభివృద్ధి ప్రాజెక్టులను అడ్డుకుంటే ఇచ్చే ప్యాకేజీలు, రాజకీయ లబ్ధి ఎక్కువగా ఉంటుందనే ఆశతోనే సదరు నేతలు ఈ భూములను ముందే కొనుగోలు చేసి, రైతుల పేరుతో తెరవెనుక డ్రామాలు ఆడించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డుకు ఆటంకంగా మారిన ఈ ల్యాండ్ పూలింగ్ వివాదంలో నోటీసులు ఇచ్చే వరకు మొత్తం 18 మంది రైతులు సుమారు 4 ఎకరాల మేర ఇవ్వకుండా మొండికేసారు. అయితే మారుతున్న పరిస్థితులు, లీగల్ చిక్కులను గమనించిన 8 మంది రైతులు ఇటీవలే తమ రెండు ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగించారు. మిగిలిన 2.77 ఎకరాలకు సంబంధించి ఒక స్థానిక న్యాయవాది స్వయంగా భూమి ఇవ్వనని పట్టుబట్టడంతో, ఆయన మాటలు నమ్మి మిగతా 9 మంది రైతులు కూడా ఇన్నాళ్లూ భూములను ఆపారు. దీంతో శనివారం ఉదయం అధికారులు మొదట సదరు లాయర్‌కు చెందిన పొలాన్ని స్వాధీనం చేసుకోవడంతోనే ఈ ఆపరేషన్ ప్రారంభించారు.

# 26 లక్షల ఓట్లపై గల్లంతు

**విజయవాడ,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది. గత నెల రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియ నిర్వహించగా, ఇప్పటికే ఎక్కువ భాగం పూర్తయిందని ఎన్నికల అధికారులు వెల్లడించారు. అయితే ఇంకా కొంత పని మిగిలి ఉండటంతో గడువును పొడిగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ కేంద్ర ఎన్నికల సంఘం ను కోరారు. ఈ విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్ర ఎన్నికల సంఘం మరో పది రోజుల అదనపు గడువును మంజూరు చేసింది. దీంతో మిగిలిన పనిని త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు మరింత చురుకుగా పనిచేస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీల నుంచి కూడా గడువు పొడిగించాలన్న అభ్యర్థనలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు సుమారు 88 శాతం సవరణ ప్రక్రియ పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. ఇంకా దాదాపు 12 శాతం పని మిగిలి ఉండగా, కొత్త గడువులో దానిని కూడా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తున్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడంతో పాటు, వాటిని సేకరించి డిజిటల్ రూపంలో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. ఈ విధంగా ప్రతి ఓటరు వివరాలను సరిచూసి, ఖచ్చితమైన జాబితాను సిద్ధం చేయడంపై ఎన్నికల సంఘం దృష్టి సారించింది. రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 4 కోట్ల 16 లక్షల 26 వేల 144 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీరందరికీ ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. జూలై 14 నాటికి 3 కోట్ల 69 లక్షల 50 వేల 812 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజేషన్ చేసినట్లు వెల్లడించారు. మరో 1.67 శాతం ఫారాల నమోదు మాత్రమే పెండింగ్‌లో ఉందని, అది కూడా త్వరలో పూర్తవుతుందని పేర్కొన్నారు. ఈ సవరణ ప్రక్రియలో కీలకమైన విషయం ఏమిటంటే, రాష్ట్రంలో ఇప్పటికే మరణించిన 14 లక్షల 19 వేల 644 మంది పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సంబంధిత ధృవీకరణ పూర్తయిన తర్వాత ఈ పేర్లు జాబితా నుంచి తొలగించబడతాయి. అదే విధంగా ఉద్యోగాలు, వ్యాపారం లేదా ఇతర కారణాలతో శాశ్వతంగా ఇతర రాష్ట్రాలు లేదా విదేశాలకు వెళ్లి అక్కడే స్థిరపడిన వారి వివరాలను కూడా పరిశీలించారు. ఇప్పటికే 12 లక్షల 14 వేల 994 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారినట్లు గుర్తించిన అధికారులు, వారి ఓటు నమోదుపై కూడా తగిన చర్యలు చేపడుతున్నారు. మరణించిన వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు మారిన వారి సంఖ్య కలిపితే దాదాపు 26 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరో పది రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియలో ఇంకా మరికొన్ని మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమం పూర్తయిన తర్వాత రాష్ట్రంలో డబుల్ ఓటింగ్‌కు అవకాశం తగ్గడంతో పాటు, చెల్లని ఓట్లను తొలగించి మరింత పారదర్శకమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయగలమనే ఆశాభావాన్ని ఎన్నికల అధికారులు వ్యక్తం చేస్తున్నారు. దీంతో రానున్న ఎన్నికల నిర్వహణ మరింత విశ్వసనీయంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# అగ్రరాజ్యం ముప్పేట దాడి

**న్యూఢిల్లీ,(భారత శక్తి)** అమెరికా, ఇరాన్‌ల మధ్య యుద్ధం మరింత తీవ్ర స్థాయికి చేరబోతోంది. హోర్ముజ్ జలసంధి గుండా ఇరాన్ రాకపోకలను అమెరికా అడ్డుకుంది. హోర్ముజ్ జలసంధిలో ఇరాన్‌పై అమెరికా నావికా దళాలు దిగ్బంధనం చేశాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. దీని అర్థం, ఇరాన్ నౌకలు ఇకపై హోర్ముజ్ జలసంధిని దాటలేవు. దీనికి ప్రతిస్పందనగా ఇరాన్ ఈ ఘర్షణను మరింత తీవ్ర స్థాయికి తీసుకువెళ్లవచ్చు. యూఎస్ సెంట్రల్ కమాండ్ చీలో ఒక పోస్ట్‌ను షేర్ చేసింది.

అందులో ఇలా పేర్కొంది, “ఈరోజు సాయంత్రం 4 గంటల నుంచి ఇరాన్ ఓడరేవులు, తీరప్రాంతాల్లోకి ప్రవేశించే, బయలుదేరే నౌకలపై అమెరికా సైన్యం సముద్ర దిగ్బంధనాన్ని పునఃప్రారంభించింది. ప్రస్తుతం 20కి పైగా యూఎస్ నేవీ యుద్ధనౌకలు, వందలాది సైనిక విమానాలు మధ్యప్రాచ్యంలో మోహరించి ఉన్నాయి.”అమెరికా మొదట ఏప్రిల్‌లో ఇరాన్‌పై దిగ్బంధనాన్ని విధించి, కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన మరుసటి రోజే జూన్‌లో దానిని ఎత్తివేసింది. ఈ ఒప్పందం ప్రకారం 60 రోజుల్లోగా ఇరాన్ అణు కార్యక్రమంపై శాశ్వత ఒప్పందానికి రావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు, కానీ హోర్ముజ్ జలసంధిలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా చర్చలు ముందుకు సాగలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం దిగ్బంధనాన్ని తిరిగి విధిస్తున్నట్లు ప్రకటించారు. ఆయన మొదట హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే నౌకలపై 20 శాతం సుంకం విధించాలని ప్రతిపాదించినప్పటికీ, ఆ తర్వాత ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. హోర్ముజ్ జలసంధి ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన వాణిజ్య మార్గాలలో ఒకటి. యుద్ధానికి ముందు, ప్రపంచంలోని ముడి చమురు, గ్యాస్‌లో సుమారు 20 శాతం దీని ద్వారా వర్తకం జరిగేది. అయితే, అమెరికా-ఇరాన్ యుద్ధం ఈ మార్గాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. ఫలితంగా, యుద్ధం తర్వాత అనేక దేశాలలో చమురు, గ్యాస్ ధరలు పెరిగాయి

**మళ్లీ ఇరాన్ నిర్బంధమే.. డొనాల్డ్ ట్రంప్** పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మళ్లీ తీవ్రరూపం దాలుస్తూ అంతర్జాతీయంగా ఆందోళన రేకెత్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాత్కాలిక శాంతి ఒప్పందాన్ని పక్కనబెట్టి, ఇరాన్‌ను తమ నౌకాదళంతో మళ్లీ దిగ్బంధించబోతున్నట్లు సంచలన ప్రకటన చేశారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ట్రూత్ సోషల్’ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ దిగ్బంధం కేవలం ఇరాన్ నౌకలు, వారి ఖాతాదారుల రాకపోకలను మాత్రమే అడ్డుకుంటుందని, ఇతర దేశాల వాణిజ్య నౌకలు హర్మూజ్ జలసంధిని యథావిధిగా వాడుకోవచ్చని స్పష్టం చేశారు. ఇకపై అమెరికానే ఈ జలసంధికి సంరక్షకుడిగా వ్యవహరిస్తుందని ట్రంప్ ప్రకటించారు.

ఈ ప్రాంతంలో నిష్పక్షపాత భద్రత, రక్షణ కల్పించేందుకు అయ్యే ఖర్చుల కోసం అక్కడ ప్రయాణించే అన్ని రకాల వాణిజ్య నౌకల సరకు విలువపై 20 శాతం చొప్పున పన్ను లేదా టోల్ వసూలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సుంకాల వసూలు ప్రక్రియ తక్షణమే ప్రారంభమవుతుందని, అమెరికా రక్షణలోనే హర్మూజ్ ఎప్పటికీ సురక్షితంగా తెరిచి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య కత్తులు దూసుకుంటున్న ఈ పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతున్నాయి.

## యువకుడి దారుణ హత్య

**పిఠాపురం(భారత శక్తి)** పిఠాపురం నియోజకవర్గం మూలపేట గ్రామంలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. అమ్మమ్మ అంత్యక్రియలకు వచ్చిన పెదపూడి మండలం రామేశ్వరం గ్రామానికి చెందిన రాకేష్ (28) హత్యకు గురైయాడు. ఒక దుకాణం వద్ద రాకేష్ చెల్లితో కొందరు యువకులు అసభ్యకరంగా ప్రవర్తించడంతో వివాదం తలెత్తింది. తన చెల్లిని ఎందుకు కామెంట్ చేశారని రాకేష్ నిలదీయడంతో సదరు యువకులతో ఘర్షణ కు దిగారు. అమ్మమ్మ ఖననం కోసం స్మశాన వాటికకు వెళ్లిన రాకేష్పై వంశీ అనే యువకుడు, మరో నలుగురు చాకుతో దాడికి దిగారు. దాడిలో తీవ్రంగా గాయపడిన రాకేష్ను పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తరలించారు. ఆసుపత్రికి తరలించే లోపే రాకేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. యువకుడి దారుణ హత్యతో పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# కేరళ రేంజ్‌లో ఏపీలో ఆ 23 గ్రామాలు..!

**విశాఖపట్టణం,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ పాలనలో సరికొత్త మైలురాయిని అందుకుంది. రాష్ట్రంలోని 23 గ్రామ పంచాయతీలు తమ అద్భుతమైన సేవలు, పారదర్శక విధానాలకు గానూ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఐఎస్‌ఓ గుర్తింపును సొంతం చేసుకున్నాయి. స్థానిక సంస్థల పరిధిలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఈ విజయంతో సత్ఫలితాలను ఇచ్చాయని స్పష్టమవుతోంది. గ్రామ పంచాయతీల పరిధిలో ప్రభుత్వ రికార్డులను పక్కాగా నిర్వహించడం, ప్రజలకు కావాల్సిన వివిధ రకాల ధృవపత్రాలను (సర్టిఫికెట్లు) ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన జారీ చేయడంలో ఈ 23 పంచాయతీలు విశేష ప్రతిభ కనబరిచాయి. కార్యాలయాల నిర్వహణలో అంతర్జాతీయ ప్రమాణాలు పాటించడంతో పాటు, జవాబుదారీతనంతో కూడిన పాలనను అందించినందుకు గానూ ఈ ఐఎస్‌ఓ సర్టిఫికేషన్ లభించింది. ఈ అరుదైన గుర్తింపు సాధించిన గ్రామ పంచాయతీల సిబ్బందిని, అధికారులను ఏపీ పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ ఐఏఎస్ ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన సేవలందించడంలో సిబ్బంది చూపిన ప్రతిభను ఆయన కొనియాడారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో రాష్ట్రంలోని మరిన్ని గ్రామ పంచాయతీలు ఈ స్థాయికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. స్థానిక స్వపరిపాలనలో దేశంలోనే ముందంజలో ఉన్న కేరళ రాష్ట్ర తరహాలోనే, ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామాలను కూడా ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఏపీ పంచాయతీరాజ్ శాఖ గట్టి పట్టుదలతో ఉంది. అందులో భాగంగానే డిజిటలైజేషన్, వేగవంతమైన పౌర సేవలను విస్తృతం చేస్తూ, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని మరిన్ని గ్రామ పంచాయతీలకు కూడా ఐఎస్‌ఓ ప్రమాణాలు దక్కేలా అధికారులు ప్రత్యేక ప్రణాళికలతో కసరత్తు చేస్తున్నారు.

# నల్లమల్లో వజ్రాల వేట

**కర్నూలు,(భారత శక్తి)** నంద్యాల – ఒంగోలు జాతీయ రహదారి పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఎర్రవాగులో వజ్రాల వేట మొదలైంది. పెద్దగా వర్షాలు కురవకపోయినా.. గతంలో కురిసిన వర్షాలకు అటవీ ప్రాంతం నుంచి నీరు వచ్చింది. దాంతో అడవిలోని వజ్రాలు వాగుతో సహా కొట్టుకొచ్చి ఉంటాయనే కారణంతో స్థానికులు వజ్రాల అన్వేషణ మొదలుపెట్టారు. నీటి అడుగు భాగంలో వజ్రాల కోసం అన్వేషణ చేస్తున్నారు. కడప, కర్నూలు, మార్కాపురం జిల్లా ప్రజలు ఎక్కువగా అన్వేషిస్తున్నారు. నల్లమల అటవీ ప్రాంతం మరోసారి ఆశావాహులతో కిటికిటలాడుతోంది. వర్షాకాలం మొదలైందంటే నల్లమల ప్రాంతమంతా వజ్రాల వేటే. ప్రతి ఒక్కరూ తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమవుతుంటారు. కొంతమంది అయితే నెలల తరబడి ఇదే ప్రాంతంలో ఉంటూ వజ్రాల వేట కొనసాగిస్తారు. ముఖ్యంగా నంద్యాల ఒంగోలు ప్రధాన మార్గంలోని నల్లమల అడవిలో ఉన్న ఎర్రవాగు వైపే అందరూ ప్రయాణిస్తారు. నల్లమల అడవిలో ఉన్న ఎర్రవాగులో జోరుగా వజ్రాల వేట కొనసాగుతోంది. నంద్యాల, కర్నూలు, మార్కాపురం, కడప, ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలోని గ్రామాలకు చెందిన మహిళలు, పురుషులు ఎర్రవాగుకు చేరుకుని వజ్రాల వేట కొనసాగిస్తున్నారు. వాగు వెంట నీటిలో జల్లెడ పడుతున్నారు. ప్రతి ఏటా వాగులో నీరు ప్రవహించే సమయాల్లో వజ్రాల కోసం ఈ అన్వేషణ కొనసాగుతుంది. నెల రోజుల వ్యవధిలో ఇటీవల కురిసిన సాధారణ వర్షాలకు నల్లమలలో నీటి ప్రవాహం జరిగింది. దాంతో ప్రజలు వజ్రాల వేట కొనసాగిస్తున్నారు. గత నెలలో కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరిలో కూడా వజ్రాల వేట మొదలుపెట్టారు. జొన్నగిరి ప్రాంతంలో పొలాలకు వెళ్లి మరీ అన్వేషణ కొనసాగిస్తున్నారు. చిన్న వజ్రం దొరికినా తమ రాత మారుతుందనే ఆశతో ప్రజలు జల్లెడ పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనంతపురంలోని వజ్రకరూర్, కర్నూలు జిల్లాలోని తుగ్గలి, జొన్నగిరి వీటితో పాటు నల్లమల అటవీ ప్రాంతంలో కృష్ణా నది తీర ప్రాంతాల్లో వజ్రాల వేట కొనసాగుతోంది. తొలకరి వర్షాలకు మట్టి కొట్టుకుపోయి వజ్రాలు బయటపడతాయని ప్రజలు భావిస్తుంటారు. ఈ ప్రాంతాల్లో దొరికే వజ్రాలకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. నంద్యాల జిల్లా మహానంది మండలం గాజులపల్లి సమీపంలో నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఎర్రవాగు, రాళ్లవాగులో వర్షాకాలం వజ్రాల అన్వేషణ జోరుగా సాగుతుంది. గాజులపల్లి సమీపంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూర్వం స్వామి, అమ్మవార్ల కల్యాణానికి వజ్రాలను తలంబ్రాలుగా ఉపయోగించే వారని, అందుకే ఈ ప్రాంతంలో వజ్రాలు దొరికే అవకాశం ఉందని ప్రజలు భావిస్తారు. కేవలం స్థానికులే కాకుండా దూర ప్రాంతాల నుంచి కూడా వచ్చి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు.

# చైనాకు 14 దేశాల వార్నింగ్

**న్యూఢిల్లీ,(భారత శక్తి)** డ్రాగన్ కంట్రీ చైనా ప్రపంచంలో రెండో పవర్‌ఫుల్ దేశం. మొదటి స్థానం కోసం అనేక ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో అడ్డదారులు కూడా తొక్కుతుంది. ఈ క్రమంలో 2016, జూన్ 12 పర్మనెంట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ (పీసీఏ) తీర్పు వచ్చి పదేళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా అమెరికా, జపాన్, ఫిలిప్పీన్స్, ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా, జర్మనీ, ఇటలీ, ఎస్టోనియా, లాట్వియా, లిథువేనియా, న్యూజిలాండ్, రొమేనియా, స్లోవేనియా మొత్తం 14 దేశాలు ఒకటిగా ముందుకు వచ్చాయి. ఈ సంయుక్త ప్రకటనలో 2016 తీర్పును ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించి, అది చైనా, ఫిలిప్పీన్స్ మధ్య అంతిమమైనది, చట్టబద్ధంగా బంధించేలా ఉంది, నిర్ణయాత్మకమైనది అని స్పష్టం చేశాయి. చైనా విస్తృత సముద్ర హక్కుల వాదనలకు అంతర్జాతీయ చట్టం(యూఎన్‌సీఎల్‌ఓఎస్) ప్రకారం ఎలాంటి చట్టబద్ధమైన ఆధారం లేదని వారు ధ్రువీకరించారు. శాంతియుత పరిష్కారం, బలవంతపు చర్యలను వ్యతిరేకించడం, నావిగేషన్, ఓవర్‌ఫ్లైట్ స్వేచ్ఛను కాపాడడం వంటి అంశాలను ఈ ప్రకటనలో నొక్కి చెప్పాయి. ఈ సంయుక్త ప్రకటనతో చైనా బాగా అసంతృప్తి చెందింది. బీజింగ్‌లోని జపాన్ ఎంబసీలోని చీఫ్ మినిస్టర్ (డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్)ను విదేశాంగ శాఖ అధికారి సమన్లు జారీ చేసి, తీవ్ర అసంతృప్తి, నిరసన వ్యక్తం చేసింది. జపాన్ ఇతర దేశాలతో కలిసి తప్పుడు తీర్పును ముందుకు తెచ్చి, ప్రాంతీయ శాంతి-స్థిరత్వాన్ని దెబ్బతీస్తోందని, యుద్ధానంతర అంతర్జాతీయ వ్యవస్థను సవాలు చేస్తోందని చైనా ఆరోపించింది. జపాన్ ఈ వివాదంలో నేరుగా పాల్గొనే దేశం కాదు కాబట్టి దానికి చైనా సార్వభౌమాధికారం గురించి మాట్లాడే హక్కు లేదని చైనా పేర్కొంది. తన వాదనలను బలపరచుకోవడానికి చైనా సోషల్ మీడియాలో వీడియోను కూడా పంచుకుంది. ఈ తీర్పు 10వ వార్షికోత్సవం సందర్భంగా యూరోపియన్ యూనియన్ కూడా ప్రత్యేక ప్రకటన విడుదల చేసి, 2016 అవార్డును ముఖ్యమైనదిగా అభివర్ణించింది. యూఎన్సీఎల్‌ఓఎస్ ప్రకారం శాంతియుత పరిష్కారాలకు మద్దతు ఇచ్చింది. 2016లో ఫిలిప్పీన్స్ చైనాపై దాఖలు చేసిన కేసులో పీసీఏ తీర్పు చైనా యొక్క “నైన్-డాష్ లైన్”, చారిత్రక హక్కుల వాదనలను తిరస్కరించింది. ఈ తీర్పు ప్రకారం చైనా విస్తృత సముద్ర హక్కులకు అంతర్జాతీయ చట్టం కింద ఆధారం లేదు. చైనా ఈ తీర్పును ఎప్పటి నుంచో తిరస్కరిస్తోంది. దక్షిణ చైనా సముద్రం ప్రపంచ వాణిజ్యానికి అత్యంత ముఖ్యమైన రవాణా మార్గం.

ఇక్కడి నుంచి పెద్ద ఎత్తున చమురు, సహజవాయువు రవాణా జరుగుతుంది. చైనా కృత్రిమ దీవుల నిర్మాణం, సైనిక కార్యకలాపాలు చేస్తోంది. ఫిలిప్పీన్స్ తన ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్‌లో చైనా ప్రమాదకరమైన మాన్యూవర్లు చేస్తోందని ఆరోపిస్తోంది. అమెరికా, దాని మిత్రదేశాల నౌకాదళ పర్యటనలు, చైనా గస్తీల మధ్య ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. భవిష్యత్తులో ఘర్షణలు తలెత్తే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాలు ప్రాంతీయ భద్రత, అంతర్జాతీయ సముద్ర చట్టాల అమలు, వాణిజ్య స్వేచ్ఛ వంటి అంశాలపై దృష్టి సారించాయి.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే

# సమగ్ర భూ సర్వే

**- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



**రేగొండ, జూలై 16 (భారత శక్తి):** భూపాలపల్లి మండలంలోని గోరి కొత్తపల్లి మండలం జగ్గయ్యపేట గ్రామంలో గోరి కొత్తపల్లి మండల కేంద్రంలోగ్రామంలో భూ సర్వేపై నిర్వహించిన గ్రామసభలో భూపాలపల్లి ఎమ్మెల్యే లిగండ్ర సత్యనారాయణ రావులి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, గ్రామాల్లో భూములు సాగు చేస్తున్న వారు ఒకరైతే, పట్టా పాస్ పుస్తకాలు మరొకరి పేరుపై ఉండటం వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలంటే సమగ్ర భూ సర్వే తప్పనిసరిగా నిర్వహించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు గ్రామ ప్రజలను సమన్వయం చేసుకొని పారదర్శకంగా భూ సర్వే నిర్వహించాలని సూచించారు. వాస్తవంగా భూములను సాగు చేసుకుంటున్న 391 93 సర్వే నెంబరు అర్హులైన రైతులను గుర్తించి, నిబంధనల ప్రకారం వారికి పట్టాలు, పట్టాదారు పాస్ పుస్తకాలు అందించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా రెవెన్యూ భూములు, గ్రామకంఠం భూములు, ప్రభుత్వ భూములపై ఉన్న ఆక్రమణలను గుర్తించేందుకు భూ సర్వే ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావడం కూడా ఈ సర్వే ద్వారా సులభతరం అవుతుందని తెలిపారు. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అత్యంత ముఖ్యమని, పాస్ పుస్తకాలు ఉంటే పంట రుణాలు, రైతు భరోసా మరియు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇతర రైతు సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులైన రైతులకు భూ పట్టాలు, పాస్ పుస్తకాలు అందించే విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నూతన మండలానికి ఎంపీడీవో ఆఫీసు ఎమ్మార్వో ఆఫీసు మంజూరు చేయించాను త్వరలోనే కోటి రూపాయల నిధులతో పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవానికి పనులు చేపడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు

అంబులెన్స్ అడిగినారు త్వరలోనే అంబులెన్స్ కూడా మంజూరు చేస్తానని మహిళా సమైక్య భవనాన్ని కూడా మంజూరు చేస్తాను ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నిమ్మల శంకర్ ఎమ్మార్వో హేమలత, ఆర్డీవో, హరికృష్ణ భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కిష్టయ్య పిఏసిఎస్ చైర్మన్ నడిపెల్లి విజన్ రావు కోటంచ ఆలయ చైర్మన్ నాయినేని సంపత్ రావు జగ్గయ్యపేట సర్పంచ్ నడిపెల్లి శాంతాదేవి వెంకట్ రావు నిజాంపల్లి సర్పంచ్ సునీత రవీందర్ గాంధీనగర్ సర్పంచ్ బొజ్జం మమత సురేష్ చిన్న కోడెపాక సర్పంచ్ సాదు సుమలత ధర్మేందర్ బాలయ్య పల్లె సర్పంచ్ తొట్ల తిరుపతి యాదవ్ విజయ పల్లె సర్పంచ్ జక్కుల మానస సాంబయ్య జిల్లా సీనియర్ నాయకులు గంగుల రమణారెడ్డి తిరుమలగిరి గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మల విజేందర్ జిల్లా ఉప సర్పంచ్ల పోరం అధ్యక్షులు గట్టు ప్రదీప్ గౌడ్ గోరి కొత్తపల్లి మండల ఉపసర్పంచుల పోరం అధ్యక్షులు పిండి ప్రభాకర్ గోరి కొత్తపల్లి ఉప సర్పంచ్ సూధనబోయిన రవి వనపర్తి శ్రీనివాస్ మాజీ సర్పంచ్ సూదనబోయిన ఓం ప్రకాష్ మండల నాయకులు కాటం సదయ్య తుమ్మనపల్లి ఓ మాజీ ప్రేమాజీ ఉమ్మడి మండల సీనియర్ నాయకుడు సందెల మధుకర్ సూదనబోయిన రాజయ్య ఎంపీ నిజాంపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీరామ్ రాజు యూత్ నాయకులు సాదు తిరుపతి గూడ నరేష్ వర్మ బాలయ్య పల్లె మాజీ ఉప సర్పంచ్ తొట్ల రవీందర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కుమారస్వామి అమ్ముల సదానందం మటికే సంతోష్ పాత పెల్లి సంతోష్ మాజీ ఉపసర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## కన్నవారిని కాపాడుకోకపోతే కటకటాల్లోకే

**- 2007 చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తాం**

**- ఆర్డీవో కే.కృష్ణవేణి**



**ములుగు జిల్లా ప్రతినిధి,జులై 16(భారత శక్తి):**వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007 ప్రకారం కన్న తల్లిదండ్రులను కాపాడుకో లేకపోతే కటకటాల్లోకేనని, కఠిన చర్యలు తప్పవని తల్లిదండ్రులు, సీనియర్ పౌరుల పోషణ సంక్షేమ ట్రిబ్యునల్ అధికారి, ఆర్డీవో కే.కృష్ణవేణి తెలిపారు. ములుగు మండలం దేవగిరిపట్నం గ్రామానికి చెందిన గాదె నక్షత్రారెడ్డి, జేసింతమ్మ లు తమ కుమారులు గాదె అశోక్ రెడ్డి, గాదె అబ్రహం రెడ్డి లు తాము సంపాదించిన ఆరు గుంటల స్థలాన్ని ఇరువురికి సమానంగా పంపిణీ చేసిన అనంతరం తమను పట్టించుకోవడం లేదంటూ ఫిర్యాదు చేశారని అన్నారు. ఈ క్రమంలో నక్షత్ర రెడ్డి కుమారులకు 2007 చట్టం సెక్షన్ 5 (1) ప్రకారం నోటీసులు జారీ చేయగా గత నెల 30వ తేదీన విచారణ చేయగా తల్లిదండ్రులను పట్టించుకోవడంలేదని విషయాన్ని పరిగణలోకి తీసుకోవడం జరిగిందని అన్నారు. దీంతో 2007 చట్టం సెక్షన్ 9 (1) సెక్షన్ 4 ప్రకారం తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తి విషయంలో కొడుకులు జోక్యం చేసుకోరాదని తమ ఉత్తర్వులను పాటించని పక్షంలో చట్ట ప్రకారం కేసు నమోదు చేయబడతాయని కృష్ణవేణి తెలిపారు.

## కాంగ్రెస్ పాలనలో కరువు ఒకవైపు

## కరెంటు కష్టాలు మరొకవైపు

**- రైతులకు నాణ్యమైన కరెంటు సరఫరా చేయాలి**

**- బిజెపి మాజీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్**




**భారత శక్తి, జూలై 16 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి):** కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఒకవైపు కరువు తాండవిస్తుంటే మరొక్కవైపు కరెంటు కష్టాలు ఉన్నాయని బిజెపి యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. భారతీయ జనతా పార్టీ యాదగిరిగుట్ట మండల సమావేశం మైలారుగూడెం గ్రామంలోని సాయిశివ ఫంక్షన్ హాల్ లో మండల అధ్యక్షురాలు గుంటుపల్లి మహేశ్వరి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాశం భాస్కర్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు అందరూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా బస్వాపురం ప్రాజెక్టు ముంపు గ్రామమైన లప్ప నాయక్ తండా వాసులకు తక్షణమే ఇండ్లు మంజూరు చేయాలని అదేవిధంగా భూములు ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా రైతులకు నాణ్యమైన కరెంటు ఇవ్వకుండా గంటకు నాలుగు సార్లు కరెంటు పోతుందని దీనివల్ల గ్రామీణ రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నాణ్యమైన కరెంటు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు గుంటుపల్లి సత్యనారాయణ, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు కిషన్ నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు దొంత భరత్ కుమార్, కర్రె బీరు మల్లయ్య, జిల్లా కౌన్సిల్ మెంబర్ గంధమల్ల మహేష్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు గోపగాని ప్రసాద్ గౌడ్, దేవరకొండ నారాయణ, షారాజి లక్ష్మయ్య, కొత్తపల్లి రమేష్, నేరెళ్ల సంతోష్, బండి మహేష్, జోగు మహేష్, గుజ్జుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ముప్పు

### ప్రత్యామ్నాయ పంటలే రైతుకు శ్రీరామరక్ష

**- కోనరావుపేట ఇంచార్జ్ వ్యవసాయ అధికారి దుర్గరాజు.**




**భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూలై 16:** భూగర్భ జలాలు అడుగంటుతున్న ప్రస్తుత తరుణంలో ఎల్‌నినో ప్రభావం తోడై రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. రానున్న రోజుల్లో నీటి లభ్యత నానాటికీ క్షీణించే ప్రమాదం ఉన్నందున, రైతులు సాంప్రదాయ వరి సాగుపైనే పూర్తిగా ఆధారపడకుండా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని కోనరావుపేట మండల ఇన్‌చార్జి వ్యవసాయ శాఖ అధికారి దుర్గరాజు సూచించారు. ప్రస్తుతం మండల పరిధిలోని బోరుబావుల్లో నీటిమట్టాలు రోజురోజుకూ పడిపోతుండటం ఆందోళన కలిగిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు ఆశాజనకంగా లేకపోవడంతో చెరువులు కూడా పూర్తి స్థాయిలో నిండే పరిస్థితులు కనిపించడం లేదన్నారు. ఒకవేళ చివరి దశలో అరకొర వర్షాలు కురిసినా జలాశయాలు నిండటం కష్టమేనని స్పష్టం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో రైతులు తమకున్న భూమిలో మొత్తం వరి సాగు చేస్తే, పంట చివరి దశకు వచ్చేసరికి నీరందక చేతికొచ్చిన పంట ఎండిపోయి కోలుకోలేని నష్టాలు వాటిల్లే ప్రమాదముందని హెచ్చరించారు... రైతు సోదరులు నష్టాల బారి నుంచి గట్టెక్కడానికి తక్కువ నీటితో పండే మేలైన ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని దుర్గరాజు కోరారు. ముఖ్యంగా జొన్న వంటి తృణధాన్యాలు, పెసలు, మినుములు, కంది వంటి పప్పుధాన్యాలతో పాటు పొద్దుతిరుగుడు, ఆముదం వంటి నూనెగింజల పంటలను సాగు చేయడం ఎంతో శ్రేయస్కరమన్నారు. ఈ ప్రత్యామ్నాయ పంటల వల్ల నీటి పొదుపుతో పాటు పెట్టుబడి భారం కూడా తగ్గుతుందని వివరించారు. కాబట్టి కోనరావుపేట మండల రైతులంతా ప్రస్తుత పరిస్థితులను క్షుణ్ణంగా అవగాహన చేసుకుని, వ్యవసాయ అధికారుల సలహాలను పాటిస్తూ సాగు దిశను మార్చుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రాజన్న సిరిసిల్లాలో

## 'ఫుడ్ పాయిజన్' కలకలం

**- బకాసుర రెస్టారెంట్‌లో మండి బిర్యానీ తిని 15 నుండి 20 మందికి పైగా అస్వస్థత.**

**- రంగంలోకి దిగని ఫుడ్ సేఫ్టీ అధికారులు.. ఫోన్ చేసినా స్పందించని వైనం అని ఆరోపణలు.**

**- గతంలో 'బాలాజీ స్వీట్స్'లో బల్లి పడినా మొక్కుబడి చర్యలే.**

– ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారంటూ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు బర్కం లక్ష్మి ఆగ్రహం.

**రాజన్న సిరిసిల్ల, జూలై 16(భారత శక్తి ):**రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆహార భద్రత ప్రశ్నార్థకంగా మారింది.నిత్యం పర్యవేక్షించాల్సిన అధికారులు చోద్యం చూస్తుండటంతో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు స్థానికులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. మొన్నటికి మొన్న పానీపూరి తిని పలువురు అస్వస్థతకు గురైన ఘటన మరువక ముందే, తాజాగా పట్టణంలోని 'బకాసుర రెస్టారెంట్'లో మండి బిర్యానీ తిని పది మందికి పైగా యువకులు తీవ్ర అస్వస్థతకు గురవడం కలకలం రేపింది. ఇల్లంతకుంట మండలానికి చెందిన నలుగురు యువకులతో పాటు సిరిసిల్ల పట్టణానికి చెందిన మరో ఆరుగురు ఈ రెస్టారెంట్‌లో మండి బిర్యానీ తిన్నారు. తిన్న కొద్దిసేపటికే వాంతులు, విరేచనాలు, జ్వరం, ఒళ్లునొప్పులు ప్రారంభం కావడంతో బాధితులు ఆస్పత్రులకు పరుగులు తీశారు.కలుషిత ఆహారం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని వైద్యులు ప్రాథమికంగా ధ్రువీకరించారు.. జిల్లాలో వరుసగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ఫుడ్ సేఫ్టీ అధికారుల తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. గతంలో ప్రసిద్ధి చెందిన 'బాలాజీ స్వీట్ హౌస్'లో లభించిన తినుబండారాల్లో వేయించిన బల్లి రావడం తీవ్ర సంచలనం సృష్టించింది. ఆ సమయంలో తాత్కాలికంగా ఆ స్వీట్ షాప్‌ను మూసివేసి చేతులు దులుపుకున్న అధికారులు, ఎలాంటి పటిష్ట చర్యలు తీసుకోకుండానే మళ్లీ సదరు దుకాణం తెరుచుకునేలా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వెనుక ఉన్న మర్మమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకుల నుంచి అందుతున్న మామూళ్ల వల్లే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలు తుంగలో తొక్కి కుళ్లిన మాంసం, నిల్వ ఉంచిన పదార్థాలతో వంటకాలు వండుతున్నా తనిఖీలు చేయాల్సిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. సిరిసిల్లలో అసలు ఏం జరుగుతోంది? ఆహార భద్రతా అధికారులు ఎక్కడున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు బర్కం లక్ష్మీ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కలుషిత ఆహార ఘటనపై సమాచారం ఇచ్చేందుకు తాము ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేస్తే కనీసం రెస్పాండ్ అవ్వడం లేదని, ఒకవేళ మాట్లాడినా తానేమీ రానంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆమె ఆరోపించారు. జిల్లా పాలనాధికారి కలెక్టర్ గారు వెంటనే జోక్యం చేసుకుని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న హోటల్ నిర్వాహకులతో పాటు విధుల్లో అలసత్వం వహిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. నిరంతరం తనిఖీలు నిర్వహించి ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

## అనారోగ్యం భరించలేకే వేములవాడలోని సాయి నగర్ కు చెందిన యువకుడి ఆత్మహత్య

**- ఆస్తమా, ఛాతీ నొప్పితో మనస్తాపం..**

**- ఇంట్లో ఉరివేసుకున్న హేమంత్ (అజయ్)**

**- 18 రోజుల క్రితమే బాబు జననం..**

**- అంతలోనే అనారోగ్యంతో తండ్రి బలవన్మరణం**

**- పత్రిక ప్రకటనలో వివరాలు వెల్లడించిన పట్టణ సీఐ వీర ప్రసాద్..**




**భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూలై 16:** వేములవాడ పట్టణ పరిధిలోని సాయినగర్‌లో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిఐ వీర ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. సాయినగర్‌కు చెందిన బాలసాని హేమంత్ (అజయ్) (24) గత నాలుగేళ్లుగా ఆస్తమా, తీవ్రమైన ఛాతీ నొప్పితో బాధపడుతున్నాడు. అనారోగ్య సమస్యల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన హేమంత్ తన ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చూసేలోపే అతడు మృతి చెందాడు. మృతునికి 18 రోజుల క్రితమే బాబు జన్మించడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఘటనపై మృతుడి తండ్రి బాలసాని మల్లేశం గౌడ్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా వేములవాడ టౌన్ సీఐ మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలు, మానసిక ఒత్తిళ్లతో బాధపడేవారు ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదని, కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా వైద్య నిపుణులను సంప్రదించి సకాలంలో సహాయం పొందడం ద్వారా ఇలాంటి విషాదాలను నివారించవచ్చని సూచించారు.

## ఆగస్టు 2 నుండి 18 వరకు జరుగు అమరుల యాదిలో బస్సు యాత్రను జయప్రదం చేయండి

**- కే జీ కె ఎస్ జిల్లా కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య**





**జనగామ(భారత శక్తి)జులై 16:** తెలంగాణ రాష్ట్రంలో కల్లుగీత కార్మికుల హక్కుల కోసం పోరాడి అమరులైన నాయకులను స్మరించుకుంటూ మహబూబాద్ జిల్లా మానుకోట ఆగస్టు 2 నుండి ప్రారంభమై బస్సు యాత్ర 18 వరకు రాష్ట్రంలో అన్ని జిల్లాలు తిరుగుతూ పాపన్న జయంతి రోజున హైదరాబాద్ లో ముగుస్తున్న ఇట్టి కార్యక్రమానికి కల్లుగీత కార్మికులు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయవలసిందిగా జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య కోరారు. తేదీ 16/07 /2026 గురువారం రోజున జనగామ జిల్లా కేంద్రంలో గాయత్రీ ఫంక్షన్ హాల్ లో జరిగిన కల్లుగీత కార్మిక సంఘం జనగామ జిల్లా కమిటీ సమావేశం వడ్లకొండ వెంకటేష్ అధ్యక్షతన జరిగినది. అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. అనంతరం బాల్నే వెంకట మల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తి మీదనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు , వృత్తి ప్రమాదానికి గురైన కుటుంబాలకు పెండింగ్లో ఉన్న ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, వృత్తి చేసే ప్రతి గీత కార్మికునికి బైకులు ఇవ్వాలని, ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆగస్టు 10వ జనగామ జిల్లాకు వస్తున్న సందర్భంలో కల్లుగీత కార్మికులు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని స్వాగతం తెలిపి బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కనకటి రాజయ్య, పరీదుల భాస్కర్, బండపల్లి శంకరయ్య, మాచర్ల రఘురాములు, జిల్లా కమిటీ సభ్యులు బసవ గాని మహేందర్, బాల్నే ఉమాపతి, కమ్మగాని పరశురాములు, తాళ్లపల్లి మదర్, పులి శ్రీనివాస్, ఊడుగుల ప్రభాకర్, నాయిని యాదగిరి, బాల్నే రాజయ్య, నామాల యాదగిరి, యాదండ్ల పరంధామ, పోతుగంటి కృష్ణమూర్తి, బుషిగంపల సమ్మయ్య, బైరగోని వెంకటయ్య, బైరగోని బలరాములు, సోషల్ మీడియా కన్వీనర్ మూల వైకుంఠం, మిట్ట బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## తూర్పు తండా,ధరావత్ తండా,పొట్టిగుట్ట తండా గ్రామ కాంగ్రెస్ పార్టీ శాఖ అధ్యక్షుల ఏకగ్రీవ ఎన్నిక



**జనగామ (భారత శక్తి)జులై 16:** టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి,పాలకుర్తి నియోజకవర్గ శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ఆదేశాల మేరకు దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దావెర అనీల్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించబడ్డాయి.ఈ ఎన్నికల్లో తూర్పు తండా గ్రామ శాఖ అధ్యక్షుడిగా లకావత్ సురేష్,ధరావత్ తండా గ్రామ శాఖ అధ్యక్షుడిగా ధరావత్ శ్రీనివాస్,పొట్టిగుట్ట తండా గ్రామ శాఖ అధ్యక్షుడిగా మూడ అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గ్రామ శాఖ అధ్యక్షులకు దావెర అనీల్ కుమార్ శుభాకాంక్షలు తెలియజేస్తూ,గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి,పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భూక్యా సజ్జన్,మండల,గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు బానోత్ రామచంద్రు,రెడ్డి రాజుల రమేష్,పల్లపు రవి,మాసంపెల్లి మహేందర్,చెన్నూరు రాంబాబు,దేవరుప్పుల మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ గనుపాక ప్రదీప్,సోషల్ మీడియా కోఆర్డినేటర్లు ఎల్లప్ప,అఖిల్,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446,
Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy